ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 22.03.2025 | సంపుటి : 11 సంచిక : 248 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం JANAMSAKSHI TV
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## మేం వాస్తవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం



### రూ.16.70లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఏం చేశారు?


### భారాస పాలనాతీరుపై అసెంబ్లీలో విరుచుకుపడ్డ డిప్యూటీ సీఎం భట్టి

- శాసనసభ ఆమోదం లేకుండానే కేసీఆర్ రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేశారు
- ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని మండిపాటు
- ప్రభుత్వం గ్యారంటీలకు కేటాయించింది రూ.56.80 వేల కోట్లు : డిప్యూటీ సీఎం

హైదరాబాద్(జనంసాక్షి): కేసీఆర్ సారథ్యంలోని భారాస ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. గత పదేళ్లలో భారాస ప్రభుత్వం మొత్తం రూ.16.70లక్షల కోట్లు ఖర్చు చేసిందని.. ఆ మొత్తంతో ఏం నిర్మించారని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ప్రసంగించిన ఆయన భారాస పాలనా తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “రూ.16.70 లక్షల కోట్లతో నాగార్జునసాగర్ నిర్మించారా? ఎస్ఆర్ఎస్పీ నిర్మించారా? ఓఆర్ఆర్ నిర్మించారా? ఎయిర్‌పోర్టు నిర్మించారా? కాళేశ్వరానికి మాత్రమే రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు.

మిగతా 2లో..

## డీలిమిటేషన్‌పై పోరుకు



### చెన్నై చేరుకున్న సీఎం రేవంత్

### నేడు చెన్నై వేదికగా జాయింట్ యాక్షన్ కమిటీ భేటీ



- పునర్విభజన ఇప్పుడు జాతీయ ఉద్యమం
- సమావేశ వివరాలు ప్రకటించిన సీఎం స్టాలిన్



చెన్నై(జనంసాక్షి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని భాజపాకు, పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు మధ్య వివాదం కొనసా గుతున్న వేళ తమిళనాడు సిఎం స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలో అఖిల పక్ష నేతల భేటీ ని ఏర్పాటు చేశారు. దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో ఆయన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కుల కు భంగం వాటిల్లుతుం దని ఆయన ఆరోపించారు. సమావేశానికి హాజరువుతున్న ఏపీ, తెలంగా ణ , కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ నాయకులకు నా హృదయపూర్వక స్వాగతం. మార్చి 5న జరిగిన సమావేశం ఒక మైలురాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతి పదికన జరిగితే

మిగతా 2లో..

## అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్



- ఉచితంగా ఎల్ఆర్ఎల్ చేస్తామని మాటతప్పిన ప్రభుత్వం
- రైతు రుణమాఫీలోనూ మోసాలు చేస్తున్నారు
- అందరికీ అందని రైతు భరోసా సాయం
- శాసన సభ చర్చల్లో మాజీమంత్రి హరీశ్‌రావు

2లో

## భారాస బాటలోనే కాంగ్రెస్



రాష్ట్ర ప్రభుత్వం నిమిషానికి రూ.కోటికిపైగా అప్పు చేస్తోంది
భాజపా శాసనసభా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లుగా ఉందని భాజపా శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోజుకు

మిగతా 2లో..

## గ్రామీణ రోడ్లకు టోల్ విధించే ఆలోచన లేదు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శాసనసభలో ఆయన మాట్లాడారు.

మిగతా 9లో..

## ఉగాది నుంచి సన్నబియ్యం

తెల్లరేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం తీపికబురు



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోని తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉగాది నుంచి రేషన్ షాపులలో సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఉగాది రోజున హుజూర్ నగర్ నియోజకవర్గంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు

మిగతా 2లో..

## ఆరు గ్యారెంటీలకు ఏదీ భరోసా?

### బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజల ప్రయోజనాలు పట్టవు ఆ రెండు పార్టీలకు ఓట్లు.. సీట్లే ముఖ్యం : కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వారి స్వప్ర యోజ నాలే ముఖ్యమని.. ఎన్నడూ రాష్ట్ర ప్రజల ప్రయోజాల గురించి పట్టించుకున్న పాపానపోలేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ప్రజల గురించి ఆలోచిస్తే ఈపాటికే ఇంకా ఎంతో అభివృద్ధి సాధించేవారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యమని ఆ రెండు పార్టీలకు తెలంగాణ ప్రయోజనాలు, అభివృద్ధి, ఆకాంక్షలు పట్టవని విమర్శించారు. ఆ పార్టీల ప్రజాప్రతినిధులు కొత్త పరిశ్రమలు కావాలని అడగరని, ఉన్న పరిశ్రమలను ఉంచాలని కోరరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, తూకానికి అమ్మే పనిలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉన్నాయని మండిపడ్డారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరని, ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తరని ధ్వజమెత్తారు. అందుకే మంటికైనా ఇంటోడే కావాలని ఊరికే అనలేదన్నారు. 'బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరు... ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తరు. బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ నోరు తెరిచి దీని గురించి మాట్లాడరు. కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది

మిగతా 2లో..

## రైతు నెత్తిన అకాల పిడుగు

## ఉత్తర తెలంగాణలో వడగళ్ల వర్షం

### పంట చేతికొచ్చే సమయంలో తీవ్రంగా దెబ్బతిన్న వరి, మక్కా, మామిడి

భారీ వర్షాలతో రైతాంగానికి తీవ్ర నష్టం • నేడూ కొనసాగే అవకాశం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి • ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈదురుగాలులతో వర్ష బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు

మిగతా 2లో..







## తక్కువ వడ్డీకి రుణాలివ్వండి


### నాబార్డు చైర్మన్‌ను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తక్కువ వడ్డీకే రుణాలివ్వాలని నాబార్డు చైర్మన్ షాజీ కేవీ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయనతో భేటిలో సీఎం పలు విషయాలపై చర్చించారు. ఆర్ఐడీఎఫ్ మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని, కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని, కొత్తగా మరిన్ని కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని నాబార్డు చైర్మన్‌కు సిఎం విజ్ఞప్తి చేశారు. స్వయంసహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని, ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చ్ 31 లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. నాబార్డు పరిధిలోని

మిగతా 2లో..

## నిబంధనలు పాటించని వారు వెంటనే దేశాన్నివీడండి

### రష్యాలోని ఉక్రెయిన్ పౌరులకు పుతిన్ అల్టిమేటం



మాస్కో(జనంసాక్షి): రష్యాలో నివసిస్తున్న ఉక్రెయిన్ పౌరులకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్ అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. వారంతా ఇమిగ్రేషన్ స్టేటస్‌ను చట్టబద్ధం చేసుకోవాలని, లేనిపక్షంలో దేశాన్ని వీడాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈమేరకు పలు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉక్రెయిన్‌లో భాగమైన దొనేత్సక్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజియా ప్రాంతాలను రష్యా స్వాధీనం చేసుకుంది. తాజాగా ఆ ప్రాంతాల్లోని నివాసితులు రష్యాలో ఉండాలంటే దేశ పౌరసత్వం తప్పనిసరిగా తీసుకోవాలని పుతిన్ ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే సెప్టెంబరు 10 కల్లా దేశాన్ని వీడాలని ఆయన హెచ్చరించారు. ఈ తాజా ఉత్తర్వులు 2014లో మాస్కో సొంతం చేసుకున్న క్రిమియా ప్రాంతాల్లోని నివాసితులకు సైతం వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఇక,

మిగతా 2లో..

## కర్ణాటకలో అసెంబ్లీలో హనీట్రాప్ రగడ..

### 18 మంది భాజపా ఎమ్మెల్యేల సస్పెన్షన్

దోషులెవరినీ రక్షించే ఉద్దేశం లేదు

హనీట్రాప్‌పై సిద్ధరామయ్య వ్యాఖ్యలు


బెంగుళూరు(జనంసాక్షి): కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్' వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది.

మిగతా 2లో..



## ఉగ్రవాదాన్ని ఉపేక్షించేదిలేదు

### 2026 మార్చి కల్లా దేశంలో నక్సలిజాన్ని అంతం చేస్తాం : అమిత్ షా



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. 2026 మార్చి 21 నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని చెప్పారు. హోంశాఖ పనితీరుపై రాజ్యసభలో జరిగిన చర్చకు అమిత్ షా సమాధానమిచ్చారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 అధికరణ తాత్కాలికమని రాజ్యాంగ నిర్మాతలు అందులో పేర్కొన్నప్పటికీ, ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల అది కొనసాగుతూ వచ్చిందని అమిత్ షా విమర్శించారు. కశ్మీర్‌లో వేర్పాటువాదానికి ఆధారమైన ఆర్టికల్ 370ని రద్దు చేసి రాజ్యాంగ నిర్మాతల కలను నరేంద్ర మోదీ ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు భారత్‌కు అతిపెద్ద సవాళ్లుగా ఉన్నాయని తెలిపారు. వాటి వల్ల గత 4 దశాబ్దాల్లో 92 వేల మంది పౌరులు మరణించారని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు గతంలో వ్యవస్థీకృత ప్రయత్నం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంలో ఉగ్రవాద ఘటనల్లో పౌరులు, భద్రతా సిబ్బంది మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఉగ్రదాడులకు పాల్పడిన వారికి సర్జికల్ స్ట్రైక్స్ రూపంలో గట్టి సమాధానం ఇచ్చినట్టు అమిత్ షా గుర్తు చేశారు. “అధికారంలోకి

మిగతా 2లో..

## హైకోర్టు జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు

### జస్టిస్ యశ్వంత్ వర్మను మరో హైకోర్టుకు బదిలీ చేసిన కొలీజియం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో 14వ తేదీన అగ్నిప్రమాదం జరగడంతో..ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీఎత్తున డబ్బు కనిపించింది. దీంతో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని కొలీజియం స్పందించి ఆయన్ను మరో హైకోర్టుకు బదిలీ చేసింది.

మిగతా 2లో..






## తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలన్నారు.స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు కొత్త గ్రామపంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు చైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతోపాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ పోరుకు చెన్నై చేరుకున్న సీఎం రేవంత్

పార్లమెంటులో మన ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపీల సంఖ్య గురించి మాత్రమే కాదు.. రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై భాజపా తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడులోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజన ను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతులు కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా శనివారం జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు. ఈనెల 5న స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈక్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసి రావాలని ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈనెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతినిధులను పంపాలని ఆయన అందులో కోరారు. దీనికోసం తెలంగాణ నుంచి సిఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు.

### నిబంధనలు పాటించని వారు
## దేశాన్ని వీడండి

ఇటీవల కాలంలో పుతిన్ ప్రభుత్వం ఉక్రెయిన్ పౌరులపై ఇలాంటి ఒత్తిడి తెస్తూనే ఉంది. గతేడాది ఆయా ప్రాంతాల్లోని పౌరులకు రష్యన్ పాస్‌పోర్టులు జారీ చేసే ప్రక్రియను చేపట్టారు. ఈ చర్యలను ఉక్రెయిన్‌తో సహా దాని మిత్ర దేశాలు అప్పుడే ఖండించాయి. ఈక్రమంలో మరోసారి ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులోభాగంగా 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. అందుకు కీవ్ అంగీకరించగా.. మాస్కో సూత్రప్రాయంగా ఒప్పుకుంది. ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లోని ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజుల పాటు దాడులు నిలిపివేయాలని ఈ చర్చల్లో నిర్ణయించుకున్నారు. అయితే, ఒప్పందం కుదుర్చుకున్న కొన్ని గంటలకే అది ఉల్లంఘనకు గురైంది. ఈ దాడులు, ప్రతిదాడులు జరుగుతున్న సమయంలోనే రెండు దేశాలు 175 మంది యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకోవడం గమనార్హం. బుధవారం జెలెన్‌స్కీ, ట్రంప్‌లు ఫోన్‌లో మాట్లాడారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ సంభాషణలో పుతిన్‌తో జరిపిన చర్చల పైనే ఎక్కువసేపు మాట్లాడుకున్నారు. ఇదిలాఉండగా.. ఆదివారం సౌదీ అరేబియాలోని జెడ్డాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు ప్రారంభం కానున్నట్లు యూఎస్ అధికారి తెలిపారు.

## ఉగ్రవాదాన్ని ఉపేక్షించేదిలేదు

వచ్చినప్పటి నుంచి మోదీ ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ పాలసీని కలిగి ఉంది. గతంలో ఉగ్ర దాడులు జరిగితే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకునేది కాదు. ప్రజలు కూడా వాటిని మర్చిపోయేవారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత కూడా ఉరి, పుల్వామాలో ఉగ్రదాడులు జరిగాయి. కానీ 10 రోజుల్లోనే మేము పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు నిర్వహించాం. ఇప్పుడు కశ్మీర్‌లో సాయంత్రం పూట కూడా సినిమాహాళ్లు తెరిచే ఉంటున్నాయి. జీ20 సమావేశాలు జరిగాయి. 2019 నుంచి 2024 వరకు అక్కడి యువతకు 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య, పెట్టుబడులు పెరిగాయి. ఈ సభలో బాధ్యతగా మరో విషయం చెబుతున్నాను. 2026 మార్చి 21 లోగా దేశంలో నక్సలిజాన్ని అంతం చేస్తాం."రాజకీయ లబ్ధి కోసం, అవినీతిని దాచి పెట్టేందు కోసం కొన్ని పార్టీలు భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయని అమిత్ షా దుయ్యబట్టారు. భాష పేరిట ఇప్పటికే దేశంలో చాలా వరకు విభజన వచ్చిందని, ఇకపై ఎంతమాత్రం జరగదని వ్యాఖ్యానించారు. హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అది అన్ని భాషలకూ సోదర భాష అని పేర్కొనారు. రాజ్యసభలో వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడిన ఆయన, తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జాతీయ విద్యావిధానం, త్రిభాష అంశంపై వివాదం నెలకొన్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."కొన్ని పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయి. వారి అవినీతిని దాచుకునే ప్రయత్నిస్తున్నాయి. భారత్?లోని అన్ని భాషలూ మన దేశానికి ఓ నిధి లాంటివి. హిందీ కూడా ఇతర భాషలకు సోదర భాషే" అని అమిత్ షా అన్నారు. భాష పేరిట విభజన తీసుకొచ్చేందుకు చేపట్టే చర్యలేవీ ఫలించవన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు చేసిందని చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ ఇలా అన్ని భాషలనూ ప్రాచుర్యం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. అలాగైతే తాను గుజరాత్ నుంచి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా

# మేం వాస్తవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం

అదీ కూలిపోయింది. సింగరేణికి రూ.77 వేల కోట్లు బకాయిలు పెట్టిపోయారు. పదేళ్లలో ఏ గ్రామం లోనైనా రెండు పడకగదుల ఇళ్లు నిర్మించారా? అసెంబ్లీ ఆమోదం లేకుండా రూ.2.30లక్షల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని స్వయంగా కాగ్ వెల్లడించింది" అన్నారు."గత ప్రభుత్వం ఏనాడూ నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. భారీగా బడ్జెట్ పెట్టినా నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. 2016-17లో రూ.8వేల కోట్లు, 2018-19లో రూ.40వేల కోట్లు, 2021-22లో రూ.48వేల కోట్లు, 2022-23లో రూ.52వేల కోట్లకు పైగా, 2023-24లో రూ.58,571 కోట్లు ఖర్చు చేయలేదు. ఓఆర్‌ఆర్‌ను రూ.7వేల కోట్లకే 30 ఏళ్ల కాలానికి అమ్ముకున్నారు. దొడ్డిదారిన ఓఆర్ఆర్, ప్రభుత్వ భూములను అమ్ముకున్నారు. తర్వాత వచ్చే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని కూడా ముందే తీసుకున్నారు. కేసీఆర్ నెరవేర్చని హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారు" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## భారాస బాటలోనే కాంగ్రెస్

రూ.1700 కోట్లకుపైగా కాంగ్రెస్ సర్కారు అప్పు చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "నిమి షానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది."యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది. అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 2-3 శాతం కూడా పెంచలేదు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదు" అని ఆయన అన్నారు.

### అబద్ధాలతో పాలన సాగిస్తున్న
## రేవంత్ సర్కార్

- ఉచితంగా ఎల్ఆర్ఎల్ చేస్తామని మాటతప్పిన ప్రభుత్వం
- అందరికీ అందని రైతు భరోసా సాయం
- శాసన సభ చర్చల్లో మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):**రేవంత్‌రెడ్డి సర్కార్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, వారు ఒకటి చెప్తే ఇంకోటి చేస్తారని.. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి ఉందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు మార్పు పేరుతో వాగ్దానాలు ఇచ్చారని, ఎన్నికల తర్వాత ఆ వాగ్దానాలను ఏమార్చరని అన్నారు. ఎన్నికల ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారని, ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ కోసం ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు సమీకరించుకున్నట్లు చెప్పారని, రూ.20 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసినట్లు ఒప్పుకున్నారని వెల్లడించారు. శాసన సభలో బడ్జెట్‌పై చర్చను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది బడ్జెట్ రూ.2 లక్షల 91 వేల 159 కోట్లు అని గొప్పగా చెప్పుకున్నారు. ఇవి అవాస్తవిక అంచనాలని నేను ఆనాడే చెప్పాను. వారు కాదు పొమ్మన్నరు. రివైజ్డ్ ఎస్టిమేషన్‌లో రూ.27 వేల కోట్లు తక్కువ చేసి చూపారు. ముఖ్యమంత్రేమో రూ.60 నుంచి రూ.70 వేల కోట్లు తక్కువగా వస్తాయని స్వయంగా చెప్పారు. అంటే అంచనా అవాస్తవం అని తేలిపోయింది. ఈ కొటేషన్ ఎవరు చెప్పారోగానీ కాంగ్రెస్ కోసమే చెప్పారు. ఎన్నికలకు ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారు. ఎన్నికలు అయ్యాక ఆ వాగ్దానాలనే ఏమార్చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించి ఈరోజు వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేసింది లేదు. వడ్డీ లేని రుణాల పరిమితిని గత ప్రభుత్వంలో మేం ఇచ్చిన 5లక్షలకు మించి పెంచింది లేదు. ఇదే శాసనసభలో మేము అడిగిన ప్రశ్నకు సమాధానంగా 5లక్షల వరకే వడ్డీ అందుతుందని ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. 5లక్షల వరకే వడ్డీ లేని రుణాలు అని మీరే అన్నరు. మళ్లీ మీరే తీసుకున్న మొత్తం రుణానికి వడ్డీ లేని రుణం అని ప్రచారం చేసుకుంటున్నరు. నేను భట్టి గారిని సూటిగా అడుగుతున్నా. మహిళా సంఘాలు తీసుకున్న మొత్తం రుణానికి వీఎల్ఆర్ వర్తిస్తుంది అనే ఉత్తర్వులు ఉంటే చూపండి. లేదా ఈ సభను తప్పుదోవ పట్టించినందుకు, మహిళా లోకాన్ని మోసం చేసిందనందుకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామన్న సంకల్పం ఏమైంది. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని చెప్పారు. ఇప్పుడు కౌలు రైతులను రైతులే చూసుకోవాలంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో అసలు కౌలు రైతుల ప్రస్తావనే లేదు. మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టుకూలీ రూ.50 నుంచి రూ.75కు పెంచి ఇచ్చినట్లు చెప్పారు. రూ.75 కుట్టు కూలీ ఇచ్చిన మహిళా సంఘం పేరు చెప్పాలని లేకపోతే క్షమాపణ చెప్పాలి. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 4.5 లక్షల ఇండ్లు కాదు కాదా.. 4 ఇండ్లు కూడా కట్టలేదు. ఎస్సీ, ఎస్టీల ఇండ్లకు రూ.లక్ష అదనంగా కలిపి రూ.6 లక్షలు ఇస్తామన్నారు. ఈ సారి ప్రసంగంలో రూ.లక్ష మాయమైంది. దళిత, గిరిజనులను ప్రభుత్వం మో సం చేశారు. ఫసల్ బీమాకు రూపాయి ఇవ్వలేదని, ఫసల్ బీమా చేయట్లేదు. జాబ్ క్యాలెండర్.. జాబ్‌లెస్ క్యాలండర్ అయింది. ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగానికి మా ప్రభుత్వ హయాంలో అనుమతులు తెచ్చామన్నారు. భూసేకరణకు రూ.1,525 కోట్లు పెట్టామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఏడాదైనా ఒక్క ఎకరా సేకరించలేదు, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు, ఎన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి.. ఎంత ఆయకట్టుకు నీళ్లిచ్చారో చెప్పాలి. ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు, పంటలకు బోనస్ ఇస్తామని మోసం చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, విద్యార్థులకు భరోసా కార్డు పేరుతో మోసం చేశారు. ఆదాయం పెంచి హామీలు నెరవేరుస్తామని ఎన్నికలకు ముందు చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యం వల్ల రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడింది. రాష్ట్ర ఆదాయం క్షీణిస్తున్న సమయంలో ఏం చేయాలో భట్టి విక్రమార్క చెప్పాలి. ప్రభుత్వ వైఫల్యాలు సరిచేసుకోవాలి లేదా రేవంత్‌రెడ్డి ఫార్ములా ప్రకారం భూములు అమ్మాలి. ఎనుముల వారి పాలనలో ఎన్ని భూములు ఖతం పట్టిస్తారో తెలియదు. గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని వేలం చేయడం ద్వారా రూ.30 వేల కోట్లు రాబట్టాలని నిర్ణయించారు. టీజీఐఐసీ భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారు. హెచ్ఎండీఏ భూములు తాకట్టుపెట్టి రూ.20 వేల కోట్లు అప్పు తెస్తామని చెప్పారు. ఆ రోజు ఫార్మాసిటీకి మేము భూములు సేకరిస్తుంటే ఆ రోజు అక్కడ భట్టి విక్రమార్క, సీతక్క పాదయాత్ర చేసి భూములు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.

### ఆరు గ్యారెంటీలకు ఏదీ భరోసా?

ఎంపీలు, 64 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ ఈ అన్యాయాన్ని ప్రశ్నించరని నిలదీశారు. ఈ కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యం. తెలంగాణ ప్రయోజనాలు వాటికి పట్టవని విమర్శించారు.

## హైకోర్టు జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు

ఈ ఘటన న్యాయవర్గాల్లో సంచలనం సృష్టించింది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో జస్టిస్ వర్మ నగరంలో లేరు. ఆయన కుటుంబసభ్యులే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు ఫోన్ చేసి పిలిపించారు. వారు అక్కడ అగ్నికీలలను ఆర్పేశాక.. అక్కడ భారీఎత్తున నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు దానిని స్వాధీనం చేసుకొన్నారు. అది మొత్తం లెక్కల్లో చూపని నగదుగా గుర్తించారు.వెంటనే ఈ విషయం ఉన్నతాధికారుల ద్వారా సీజేఐ ఖన్నాకు చేరింది. దీనిని ఆయన తీవ్రంగా పరిగణించి వెంటనే కొలీజియం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జస్టిస్ వర్మను అలహాబాద్‌కు బదిలీ చేయాలని నిర్ణయించారు. గతంలో వర్మ అక్కడే పనిచేసి 2021లో దిల్లీకి వచ్చారు.ఐదుగురు సభ్యులున్న కొలీజియంలో కొందరు జస్టిస్ వర్మ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించారు. కేవలం బదిలీతోనే న్యాయశాఖ ఇమేజ్ తిరిగిరాదన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. వర్మను రాజీనామా చేయాలని కోరడమో.. ఆయనపై సీజేఐ అంతర్గత విచారణ చేపట్టడమో చేయాలన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇటువంటి ఘటనే 2008 ఆగస్టు 13వ తేదీన ఒకటి చోటుచేసుకొంది. నాటి పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటి ఎదుట రూ.15 లక్షల నోట్లు ఉన్న బాక్స్‌ను కొందరు వ్యక్తులు ఉంచారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ తర్వాత ఈ కేసును సీబీఐకు అప్పగించారు. దర్యాప్తు అనంతరం 2011 మార్చిలో ఉత్తరాఖండ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ నిర్మల్ యాదవ్‌పై అభియోగాలు నమోదు చేశారు. ఆమె 2009 వరకు పంజాబ్-హరియాణా కోర్టులో పనిచేశారు. ఓ కేసులో తీర్పు నిమిత్తం నిర్మల్ యాదవ్‌కు ఇవ్వాల్సిన డబ్బును పొరబాటున జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటి వద్ద పెట్టినట్లు తేలింది.

## ఉగాది నుంచి సన్నబియ్యం

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉగాది రోజు ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా మటంపల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పూజ అనంతరం సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తారని తెలిపారు. మటంపల్లి ఆలయంలో పంచాంగ శ్రావణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. కాగా రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల్లో ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీని చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీని మటంపల్లిలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం స్థల ఎంపికకు చర్యలు తీసుకున్నామని, అన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పేద, దిగువ మధ్య తరగతి వర్గాల కోసం చారిత్రక నిర్ణయం తీసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది.

## ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయండి

### కేసు పురోగతిపై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది.మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం.. అందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.బెంగళూరులో ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరపాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఆదేశించారు. దాడి చేసిన కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలని సూచించారు. దాడికి గురైన ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఎండీకి ఆదేశాలు జారీ చేశారు.

# ఉత్తర తెలంగాణలో వడగళ్ల వర్షం

విరిగిపడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అ య్యింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో పలు చోట్ల వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో భారీ వర్షం పడిం ది. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో కుండ పోత వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా లక్సెట్టి పేట, దండేపల్లి వడగళ్ల వాన కురిసింది. కాగజ్ నగర్‌లో దుకాణాలపై కప్పులు కూడా ఎగిరిపోయాయి. పోచమ్మ గుడి ముందున్న సుమారు 150 ఏళ్ల వృక్షం నేలమట్టం అయ్యింది. దీంతో వాహనాలను ఆ మార్గం నుంచి వెళ్లకుండా దారి మళ్లిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో వాతావరణం చల్లబడటంతో ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఊరట చెందారు. రాళ్లవానతో అక్కడక్కడా మామిడి రైతులకు నష్టం. వాటిల్లింది. గాలి దుమారానికి పిందెలు రాలిపోయాయి. పెద్దపల్లి జిల్లాలో మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్, మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.సుల్తానాబాద్ మండలం నారాయణపూర్, ఎలిగేడు మండలం దూళికట్టలో వడగళ్ల వాన పడింది. అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం వ్యాప్తంగా మోస్తరు వర్షం కురుస్తోంది. బోయిన్‌పల్లి రామడుగు మల్యాల మండలాల్లో మోస్తరు కంటే ఎక్కువ వర్షం కురుస్తోంది.కాగా ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో శనివారం కూడా ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముందస్తు చర్యలు చేపట్టాలని అప్రమత్తం చేశారు.వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని ఆదేశించారు.అసిఫాబాద్, చొప్పదండి, మంచిర్యాల, కాగజ్ నగర్, వేములవాడ, జగిత్యాల, కొండగట్టు తదితర రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వడగళ్ల వాన వల్ల పంట చేతికొచ్చే సమయంలో మక్కా, వరి, మామిడి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది.

## కర్ణాటకలో అసెంబ్లీలో హనీట్రాప్ రగడ..

సమావేశాల వేళ ప్రతిపక్ష భాజపా నేతలు ఈ అంశాన్ని లేవనెత్తడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. దాంతో సభా కార్యక్రమాలకు అడ్డుపడిన 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ తీర్మానం చేశారు. ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. సంచలనంగా మారిన 'హనీ ట్రాప్' వ్యవహారాన్ని ఈ రోజు భాజపా నేతలు లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభమైతే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు.ఇక, సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రకారం.. వేటుకు గురైన సభ్యులు అసెంబ్లీ హాల్, లాబీ, గ్యాలరీలోకి ప్రవేశించకూడదు. వారు ఏ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొనకూడదు. అసెంబ్లీ ఎజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. ఈ సమయంలో వారికి రోజువారీ భత్యాలు కూడా అందవు. ఇక సస్పెండైన ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించారు.

**దోషులెవరినీ రక్షించే ఉద్దేశం లేదు..**

కర్ణాటకలో మంత్రులు సహా అనేకమందిపై 'హనీ ట్రాప్' వ్యవహారం అక్కడి రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే.ఈ విషయాన్ని నేడు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష భాజపా నేతలు లేవనెత్తడంతో గందరగోళం నెలకొంది. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ చుట్టూ చేరి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభం అయితే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వానికి ఎవరినీ రక్షించే ఉద్దేశం లేదని.. చట్టప్రకారం దోషులకు తప్పక శిక్ష పడుతుందని వ్యాఖ్యానించారు. ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపిస్తామని హెూంమంత్రి జి.పరమేశ్వర హామీ ఇచ్చినప్పటికీ అసెంబ్లీలో భాజపా నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని సీఎం విమర్శించారు. దీంతో 15 నిమిషాల పాటు సభ వాయిదా పడినట్లు తెలుస్తోంది.రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు.



### త్వరలో మరో 295 మంది
## స్వదేశానికి..

**అమెరికా నుంచి రానున్న అక్రమ వలసదారులు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే.దీంతో విడతల వారీగా పలువురు స్వదేశానికి తిరిగొచ్చారు. త్వరలో మరో 295 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అక్రమ వలసల అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ (%వీజూా%) లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది.ఈ సందర్భంగా భారత్‌కు పంపించిన వలసదారుల పట్ల అమెరికా అధికారులు వ్యవహరించిన తీరుపైనా కేంద్రం స్పందించింది. దీనిపై తమ ఆందోళనను అగ్రరాజ్యానికి తెలియజేసినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 5న భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు, ముఖ్యంగా మహిళలకు సంకెళ్లు వేసిన అంశాన్ని అమెరికా వద్ద లేవనెత్తినట్లు తెలిపింది. దీనికి అగ్రరాజ్యం కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది."భారత్ ఆందోళనల తర్వాత ఫిబ్రవరి 15, 16 తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని అమెరికా ధ్రువీకరించింది. వలసదారులు స్వదేశానికి చేరుకున్న తర్వాత వారితో చర్చించి మన అధికారులు కూడా దీన్ని నిర్ధారించుకున్నారు. ఇక, అమెరికాలో చట్టవ్యతిరేకంగా నివాసం ఉంటున్న వారిలో మరో 295 మంది భారతీయులు త్వరలోనే స్వదేశానికి రానున్నారు. ప్రస్తుతం సంబంధిత ఏజెన్సీలు వారి వివరాలను పరిశీలిస్తున్నాయి" అని విదేశాంగశాఖ తమ సమాధానంలో పేర్కొంది.

### బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు
# దూకుడు పెంచిన పోలీసులు

- 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు
- 108 బెట్టింగ్ యాప్స్ బ్లాక్

**హైదరాబాద్(జనంసాక్షి):**

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో పోలీసులు దూకుడుగా ముందుకెళ్తున్నారు. బెట్టింగ్ యాప్స్ యజమానులే టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితుల వివరాలు సేకరించారు. బెట్టింగ్ ఊబిలో చిక్కుకుని ఒక్క ఏడాదిలో 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేసులు నమోదు చేశారు. ఆయా బెట్టింగ్ యాప్స్ గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్లను నిందితులుగా చేర్చనున్నారు. అయితే బెట్టింగ్ యాప్స్ కేసులపై పోలీస్‌శాఖ లీగల్ ఒపీనియన్‌కు వెళ్లబోతుంది. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కి మాత్రమే ప్రకటనలు చేశామంటున్నారు విజయ్, రానా. అయితే సెలబ్రిటీల నుంచి కీలక అంశాలు రాబట్టిన పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపైన ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్ చేశారు. మరో 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు తెలంగాణలో యాక్సెస్ కాకుండా. జియో-ఫెన్సింగ్ టెక్నాలజీతో చర్యలు తీసుకుంటోంది. కాగా బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరి, తేస్టీ తేజ, కిరణ్‌గౌడ్‌లను పోలీసులు విచారించారు. శ్యామల, అజయ్ సన్నీ, సుప్రీత, సన్నీ సుధీర్‌లను విచారణ కోసం సంప్రదించగా వారి ఫోన్లు స్విచాఫ్ వచ్చినట్లు సమాచారం. అలాగే మరికొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. విచారణ భయంతో హర్షసాయి, ఇమ్రాన్, భయ్యా సన్నీయాదవ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో సినీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా లబ్ధి పొందారని, అసలు వారికి ఏయే మార్గాల్లో డబ్బు వచ్చిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

# గొర్రెల ఫాంలో అగ్ని ప్రమాదం

- 500 మూగజీవాలు సజీవ దహనం





**వరంగల్ ఎంజీఎం, మార్చి 21(జనంసాక్షి):** గొర్రెల ఫాం (షెడ్డు) కు నిప్పంటుకొని మూగజీవాలు సజీవ దహనమైన ఘటన గురువారం రాత్రి 9 గంటల సమయంలో వరంగల్ నగరంలోని ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్ సమీపంలో జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు. అప్పటికే సుమారు 500 గొర్రెలు మంటలలో చిక్కుకొని సజీవ దహనం అయ్యాయి. సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నం అక్కడికి చేరుకొని జరిగిన సంఘటనను పరిశీలించారు. శుక్రవారం సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన ఘటనను తెలుసుకొని జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఖిలావరంగల్ పడమర కోటకు చెందిన గొర్రెల షెడ్డు యజమాని దుగ్గిరాల లక్ష్మణ్ అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతిరోజు రాత్రి 8:30 గంటలకు షెడ్డు వద్ద నుండి ఖిలావరంగల్ లోని తమ ఇంటికి వెళ్లి భోజనం చేసి తిరిగి 10 గంటలకు వచ్చి జీవాల వద్దనే పడుకుంటామని తెలిపారు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి కూడా 8:30 గంటలకు భోజనానికి వెళ్లానని 9:30 ప్రాంతంలో ఒక వ్యక్తి ఫోన్ చేసి గొర్రెల షెడ్డుకు నిప్పంటుకుందని చెప్పగానే పరుగున వచ్చి చూసేసరికి గొర్రెలన్నీ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యాయని తెలిపారు. షెడ్డుకు విద్యుత్తు సౌకర్యము కూడా లేదని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పనిగానే అనుమానంగా ఉందని రోదిస్తూ తెలిపారు. సుమారు 45 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇన్వర్టర్ సహాయముతో నడుస్తున్న నాలుగు కెమెరాలు, హార్డ్ డిస్క్ కూడా పూర్తిగా దగ్ధమయ్యాయని అన్నారు. 2 సంవత్సరాల క్రితం సుమారు 2 ఎకరాల స్థలాన్ని లీజుకు తీసుకొని గొర్రెల షెడ్డును నిర్మించి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, గత సంవత్సరము ఇదే సమయంలో దొంగలు పడి 10 గొర్రెలను ఎత్తుకుపోయినట్లు వారు తెలిపారు. స్థానిక కార్పొరేటర్లు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, బోగి సువర్ణ సురేష్, ఖిలావరంగల్ తహశీల్దార్ బండి నాగేశ్వర్ రావు, విద్యుత్ శాఖ డిఈ మల్లికార్జున్, జిల్లా పశువైద్య శాఖ ఏహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ ఝాన్సీ, చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ సాగర్ల శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఎవరైనా కావాలనే చేశారా? మద్యం మత్తులో ఉండి చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజావాణిలో 298 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య



**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 298 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 43, విద్యుత్ శాఖకు సంబంధించి 25, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 56, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 106 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 88 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నా రెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దరఖాస్థులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబందిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు.

## మూసీ ప్రక్షాళనకు నిధుల విడుదల చేయండి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**న్యూఢిల్లీ, మార్చి 21 (జనంసాక్షి) :** మూసీ ప్రక్షాళన, మురుగునీటి శుద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. పార్లమెంట్ లో మాట్లాడిన ఆయన.. శుభ్రమైన తాగునీటి కోసం తెలంగాణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టణీకరణ వేగంగా పెరిగిపోతుండటంతో.. నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇక, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత మౌలిక సదుపాయాలు, సేవలను అందించడంలో ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సవాళ్లను గుర్తించి కేంద్రం స్మార్ట్ సిటీ–స్, అమృత్ పథకాల కింద నిధులు ఇవ్వడం ఎంతో ప్రశంసనీయమైందన్నారు.

## కాంగ్రెస్ డిఎన్ఏలో అవినీతి..
# మోసం కాంగ్రెస్ నీతి

- అబద్ధాలు చెప్పడంలో రేవంత్ రెడ్డి గిన్నిస్ రికార్డు
- కెసిఆర్‌ను నిందించడానికి ఆర్థిక పరిస్థితి బాగా లేదని అబద్ధాలు
- శాసన మండలిలో ధ్వజమెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ డిఎన్ఏ లోనే అవినీతి ఉందని, మోసం అనేది కాంగ్రెస్ పార్టీ నీతి అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం కేసీఆర్ గారిని నిందించడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని అబద్ధాలు చెబుతున్నారని, అబద్ధాల విషయంలో ముఖ్యమంత్రికి గిన్నిస్ రికార్డు వస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు అబద్ధాలు చెప్పడం మానకపోతే సభలో ప్రివిలేజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. 420 హామీలు ఇచ్చి, గాంధీ కుటుంబాన్ని తీసుకొచ్చి సంతకాలు పెట్టిచ్చి గ్యారంటీలు ఇప్పిచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ నాయకులు ఓట్లు వేయించుకున్నారని, ఇంత చేసినా బీఆర్ఎస్ పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీకి ఒక్క శాతం మాత్రమే ఎక్కువ ఓట్లు వచ్చాయని, బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరస్కరించలేదు తేల్చి చెప్పారు. బడ్జెట్ 2025–26 పై శాసనమండలిలో జరిగిన చర్చలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను, బడ్జెట్లో లోటుపాట్లను సమర్ధవంతంగా ఎండగట్టారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయానికి చుట్టపు లాగా వచ్చిపోతున్నారు. ప్రజావాణి వింటానని చెప్పి కేవలం ఒక్కసారి మాత్రమే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చారు. ప్రజల్ని రోజూ కలుస్తానని చెప్పినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు ప్రజలను కలవడానికి ఇష్టపడడం లేదు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో కూర్చొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మార్కు కరప్షన్ కి, కన్నింగ్ నెస్ కి నిదర్శనం ఈ బడ్జెట్" అని మండిపడ్డారు.

# 60 గంటల్లో 600 మంది హత్య!

ఎండి మునీర్ సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ, సామాజిక విశ్లేషకులు



గంటకు 10 మంది చొప్పున పాలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ సైన్యం గజాలో ఏకపక్ష యుద్ధంతో పాలస్తీనియుల ప్రాణాలను తీస్తున్నది ఇలా గడిచిన 60 గంటల్లో మొత్తం 600 మంది పసిపిల్లలు మహిళలు యువకులు పెద్దలు ఇజ్రాయిల్ సైన్యం దాడిలో తమ ఊపిరి కోల్పోయారు. యుద్ధం పట్ల స్వదేశం అయినా ఇజ్రాయిల్ ప్రజలు కూడా అసంతృప్తిగా ఉన్నప్పటికీ వారు నిరసనలు తెలుపుతున్నప్పటికీ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యహు తన రాక్షసత్వాన్ని మాత్రం విడనాడడం లేదు. మొత్తం గజాను మట్టిపాలు చేసి పాలస్తీనియుల ఉనికి లేకుండా చేయడం కోసం హమాస్ అణిచివేత పేరిట తన ఏకపక్షయుద్ధాన్ని అమాయక ప్రజలపై కొనసాగిస్తూనే ఉన్నాడు. గ్లోబల్ న్యూస్ నెట్ వర్క్ ఇజ్రాయిల్ లో నేతన్యహుకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలు చేస్తున్నారు.హమాస్ వద్ద ఉన్న ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.గజాలో నేతన్యహు మరణ హోమం సృష్టిస్తున్నాడు.గంటకు 10 మంది మృతులు 60 గంటలలో 600 మంది హత్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరం! రంజాన్ ఉపవాసాల సందర్భంగా యుద్ధ విరమణ అనుకుంటే ఏకపక్షంగా న నేతన్యాహు సైనికుల దాడి( ఇజ్రాయిల్) తమకు తెలుసునని అమెరికా ప్రకటన చేస్తుంది.అంటే ఇదంతా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు తెలిసే జరుగుతుందన్న మాట! హమాస్ ను అణచివేస్తున్న పేరిట అమాయక పాలస్తీనియులను చంపేస్తున్నారు. ఇప్పటికే 60,000 మందికి పైగా పాలస్తీనియులు హత్యకు గురయ్యారు. 85% మొత్తం గజాలో ఇండ్లు, ఇతర పక్కా భవనాలన్నీ కూడా నేలమట్టమయ్యాయి.అక్కడి వనరులను లాక్కోవాలని వాటిపై ఆధిపత్యం చలాయించాలని అమెరికా కుట్ర! ఇజ్రాయిల్ లో నేతన్యహు ప్రధానమంత్రిగా కొనసాగాలంటే అతను చేసిన అవినీతి అక్రమాల పై విచారణ జరగవద్దంటే, అతను జైలుకు వెళ్ళవద్దంటే యుద్ధం కొనసాగించాలి!తన స్వార్థం కోసం ఇజ్రాయిల్ ను ఫణంగా పెట్టి అమాయక పాలస్తీనియుల మీద హత్యాకాండను కొనసాగించాలి!అక్కడి ప్రజలే ఇప్పుడు తిరగబడి భారీ ర్యాలీల నిర్వహిస్తున్నారు. రేపు ఎక్కడ ప్రతీకార చర్యగా హమాస్ ఇజ్రాయిల్ పై దాడి చేస్తుందో లేక మద్దతు తీవ్రవాద సంఘాలు ,ఇజ్రాయిల్ పై దాడి చేస్తాయో, అని అక్కడి ప్రజలు ఆందోళన చెందే పరిస్థితి వచ్చింది.యుద్ధం ఆపడం కోసం ప్రయత్నం చేసిన యూరోప్ దేశాలు, ప్రత్యేకంగా అరబ్ దేశాలు,ప్రస్తుతం ఒక్కటే నేతన్యాహు కు బుద్ధి చెప్పాల్సిన పరిస్థితి ఉంది. రంజాన్ వేళ అమాయకుల ప్రాణాలను బలిగొనడం ఎంతవరకు సమంజసం? ప్రపంచమంతా ఈ దాడి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తుంది. నిన్నటిదాకా చిన్న చిన్న బుట్ట బొమ్మలతో ఆటాడుకున్న తమ పసిపిల్ల లు సైతం ఇజ్రాయిల్ సైన్యం దాడిలో ప్రాణాలు కోల్పోవడం వారి మృతదేహాలను పట్టుకొని కుటుంబ సభ్యులు ముఖ్యంగా తల్లిదండ్రులు తమ గుండెలకు అద్దుకొని విలపిస్తున్న దృశ్యాలు ఇప్పుడు చూసిన వారి హృదయాలు సైతం ద్రవించే విధంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. గ్లోబల్ న్యూస్ నెట్ వర్క్ ఇజ్రాయిల్ లో నేతన్యహు పై ప్రజల తిరుగుబాటు పై వీడియో న్యూస్ ను ప్రసారం చేసింది. మరోవైపు అల్ జజీరా గ్రౌండ్ రియాలిటీని గజాపై దాడి వార్తలను ప్రసారం చేసింది. ఇజ్రాయిల్ సైనికుల అ మానవీయ దాడులను ప్రపంచానికి తెలియజేస్తున్నది. యుద్ధ విరమణ నియమాలను ఏమాత్రం పాటించని నేతన్యహు తన స్వీయ రక్షణ కోసం తన ప్రధానమంత్రి పదవి యుద్ధం ఆగితే పోతుందనే దురుద్దేశంతో ఇలా అమాయకపాలస్తీనియులను దారుణంగా చంపడానికి సిద్ధం అయిపోవడం ఆందోళన కలిగించే విషయం!

# నాలుగుసార్లు గెలిచి ఏం లాభం?

- బడ్జెట్ కాపీలు చదివి మాట్లాడాలి...జిల్లాకు కేటాయింపులు తెలుసుకో!
- గంగులకు కాంగ్రెస్ నేత పురుమల్ల సూచన



**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి) :** వరుసగా నాలుగు సార్లు గెలిచానని గొప్పలు చెప్పుకోవడం కాదు బడ్జెట్ లో ఏ జిల్లాకు ఎన్ని నిధులు కేటాయిస్తారో తెలుసుకున్న తర్వాత స్పందించాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ పై కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన విమర్శలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తిప్పికొడుతూ బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మరుసటి రోజు సెలవు దినం బడ్జెట్ కాపీలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవడానికేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో రాష్ట్రం అవినీతిమయంగా మారిందన్న విషయం మరిచిపోవద్దన్నారు. అన్ని రంగాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిధులను కేటాయించారని, బడ్జెట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నిధులు కేటాయించారని కావాలంటే మరోసారి చదువుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2685 కోట్ల కేటాయించారని, శ్రీపాద ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ ఫ్లడ్ కెనాల్ కు రూ.548 కోట్లు కేటాయించారని ఉమ్మడి జిల్లాకు సంబంధించినవి కావా అని ప్రశ్నించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కింద 101 కోట్లు కేటాయించారని, శాతవాహన యూనివర్సిటీకి 35 కోట్లు కేటాయించారని, ఇవి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లేవా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు విద్య, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్కరకు రాకుండా పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దాని మరమ్మత్తుల కోసం 2685 కోట్లు బడ్జెట్లో కేటాయించిన సంగతి తెలుసుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచంలోనే అద్భుత ప్రాజెక్టు కట్టామని గొప్పలు చెప్పుకున్న టిఆర్ఎస్ నాయకుల అవినీతి వల్లే కాళేశ్వరం నిరుపయోగంగా మారిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి రూ.249 కోట్లు, ఎస్సారెస్పీ వరద కాల్వకు రూ.299 కోట్లు కేటాయించిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కేటాయించిన నిధులతో పెండింగ్ లో ఉన్న స్టేజీ 2 పనులు పూర్తయ్యే అవకాశ ముందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ టు ఫేజ్ వన్ పనులు త్వరితగతిన పూర్తిచేసి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో 1,51,400 ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ఈ నిధులు కేటాయించారని పురుమల్ల శ్రీనివాస్ వివరించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ఈ నెలాఖరుతో ముగియనున్నదని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ గా 101 కోట్లు కేటాయించిందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పరిధిలో ఇంకా 14పనులు నిర్మాణంలో ఉన్నందున వాటిని పూర్తి చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారన్నారు. అలాగే స్పోర్ట్స్ స్కూల్ కు 20 కోట్లు కేటాయించారని తెలిపారు.

### పొన్నంను విమర్శించే స్థాయి లేదు..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు ఎంపీగా ఉద్యమించి నేడు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే అర్హత, స్థాయి, రెండూ గంగుల కమలాకర్ కు లేవని పురుమల్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీసీ సామాజికవర్గానికి మేలు జరగాలనే ఏకైక లక్ష్యంగా కులగణన సర్వేను, బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయడంలో పొన్నం ప్రభాకర్ ముఖ్య భూమిక పోషించారని వివరించారు. మంత్రి గా ఐదేళ్ళు ఉన్న గంగుల కమలాకర్ ఏనాడైనా తన శాఖ గురించి మాట్లాడారా అని నిలదీశారు. బడ్జెట్ లో బీసీ సంక్షేమానికి 11,405 కోట్లు కేటాయించారని, గత సంవత్సరం 9200 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు పెరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని ఆయన స్పష్టం చేశారు.

## బీజాపూర్ కాంకేర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ బూటకం

- పౌరహక్కుల సంఘం

**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** బీజాపూర్ కాంకేర్ అడవుల్లో ఎన్ కౌంటర్ 30 మంది మృతి ఘటన ఓ బూటకమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు తెలిపారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బస్తర్‌కు చెందిన మావోయిస్టులు ఉన్నారనే సాకుతో దంతెవాడ సుక్మా, బీజాపూరిల్లాల నుండి సుమారు 2000 మంది పోలీసు బలగాలు ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపి 26 మందిని హత్యచేశారని, అక్కడ వాళ్ళు ఉన్నారనే సమాచారం అందితే వాళ్ళను సరండర్ చేసుకోవడానికి చేసుకొనే ప్రయత్నాలు కాకుండా, వాళ్ళు 10, 20 సంఖ్యలో ఉంటే వాళ్ళను రెండు మూడు వేల మంది బలగాలుగా చుట్టుముట్టి అతి కిరాతకంగా హత్య చేసే ప్రక్రియ 1 జనవరి 2024 నుండి ఆపరేషన్ కగార్లో భాగంగా సాగుతున్నదని, దీన్ని ఆనాటి నుండి ఈనాటి సుమారు 487 మందిని ఎన్ కౌంటర్ పేరుతో హత్య చేశారు. ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే అని 50 ఏళ్ళకుపైగా అన్ని హక్కుల సంఘాలు దేశ పోరాడుతూనే ఉన్నాయని, ఇప్పుడున్నటువంటి మోడీ, అమిత్ ప్రభుత్వం నక్సల్, ముక్తి భారత్ పేరుతో మధ్యభారతాన్ని 7 లక్షలపై బలగాలతో నింపేసి ఒక సరిహద్దులో యుద్ధ వాతావరణాన్ని కల్పించారని, ఏడాది కాలంగా నెత్తుటి ధారలు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. నెత్తుటి ధార ఆగాలన్నా, ఆదివాసుల జీవించే హక్కు రక్షించబడాలన్నా వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని ఇప్పటికే ఆదివాసీలను ఎన్ కౌంటర్ పేరతో హత్య చేసి వచ్చేఏడాది 31 మార్చి 2026 కల్లా వేలాది ఆదివాసీలను చంపేసి నక్సల్ ముక్తి భారత్ అని ప్రకటించి కార్పొరేట్లకు దేశంలోని సహజ వనరులను అందించాలనే ప్రయత్నం చేస్తున్నదని, కానీ ప్రజలుగా నక్సల్ ముక్తి భారత్ కోరుకవడం లేదని, కార్పొరేట్ల ముక్తి భారత్‌ను కోరుకుంటున్నారని, దీనికి ఉదాహరనే 2003లో అలిపిరిలో చంద్రబాబు నాయుడుపై జరిగిన బాంబు దాడి ఘటనలో 6 నెలల ముందుగానే ఎన్నికలకు వెళ్ళి ప్రజలకు హింసా రాజకీయాలు కావాలా? పార్లమెంటు రాజకీయాలు కావాలా అని రిఫరెండం లాగా ఎన్నికలకు వెళితే ప్రజలు మాకు మార్పు వచ్చే రాజకీయాలే కావాలంటూ చంద్రబాబు నాయుడుని దారుణంగా ఓడగొట్టారని తెలిపారు. మధ్యభారతంలో ఉన్న 7 లక్షల సాయుధ మిలిట్రీ బలగాలను తొలగించాలని, క్యాంపులను ఎత్తివేయాలని ఆదివాసీలకు హక్కుకు అవకాశం కల్పించాలని వారి ప్రధానమైన 1996 పేసా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఇద్దరు బాలికలు అదృశ్యం

**హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) :** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మచ్చబోల్లారంకు చెందిన ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం అయ్యారు. తమ కుమార్తెలు రెండు రోజుల నుంచి కనబడడం లేదని బాలికల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. బాలికల పేరెంట్స్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇన్ స్టా గ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువకులు బాలికలిద్దరితో కలసి ఓయో రూమ్‌లో గడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఒకరు ఈసీఐఎల్, మరొకరు దమ్మాయి గూడకు చెందిన వారిగా సమాచారం. కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు ఈ నెల 11న హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక తనకు పరిచయమున్న 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కొద్ది రోజులకు పోలీసులు వెతికి పట్టుకున్నారు. భరోసా సెంటర్?కు తరలించి విచారించడంతో బాలిక ప్రెగ్నెంట్ అని తేలింది. నిందితుడిపై పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ తరహా కేసులు గణనీయంగా పెరుగుతుండడం ప్రస్తుతం ఆందోళన కలిగిస్తోంది. తెలిసీ తెలియని వయసులో ప్రేమ పేరుతో ఆడపిల్లలు తల్లిదండ్రులకు దూరమవుతున్నారు. వీరిలో చాలా మందిని పోలీసులే గుర్తిస్తున్నారు. మరికొందరు వారంతటవారే ఇంటికి వచ్చేస్తున్నారు. మరికొంతమంది అయితే తిరిగి రావడానికి భయపడి ఆత్మహత్యలు చేసుకుంటు న్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ వార్తల్లో చూస్తున్నాం. యువతులు తమకు సన్నిహితంగా మెలిగే వారితో ఆకర్షణకు లోనవడం.. ప్రేమ పేరుతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు.

# ఆశలను చిదిమేసిన మృత్యువు

- తొలిరోజే ఉద్యోగానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- మృతి చెందిన యువకుడు



**హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) :** విధి ఆడే ఆటలో ఓటమి ఎప్పుడూ మనిషిదేనేమో. ఈ ఘటన గురించి చదివితే మీ గుండె తరుక్కుపోవడం ఖాయం. జాబ్ వచ్చింది.. ఇక తల్లీతండ్రులను మంచిగా చూసుకోవచ్చు అనుకున్న ఆ కుర్రాడు.. ఆఫీసుకు వెళ్లిన తొలి రోజే కనుమరుగు అయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నార్సింగ్‌లో తొలిరోజు ఉద్యోగం చేసి ఇంటికి వస్తుండగా యువ ఇంజనీర్ నవీన్ చారి మృతి చెందిన ఘటన అందర్నీ కలచివేస్తుంది. నార్సింగి కోకాపేట్ టీ గ్రీల్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వెహికల్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో నవీన్ చారి చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ చారీ మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన అతడు జాబ్ ప్రయత్నంలో ఉన్నాడు. దీనిలో భాగంగానే హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో ఇటీవల జాబ్ కొట్టాడు. దీంతో ఎంతో హ్యాపీగా తొలిరోజు ఆఫీసుకి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా అనుకోని ప్రమాదంతో నవీన్ చారి మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. నవీన్ చారి మృతితో అతని స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# సమాజంలో అడుగంటుతున్న సామాజిక సంబంధం!



సమాజంలో మానవ సంబంధాలు పూర్తిగా ఇచ్చినమవుతున్నాయి. ముఖ్యంగా కుటుంబాలలో నెలకొంటున్న వ్యత్యాసాలు రక్త సంబంధాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు ఇటీవల జరిపిన ఒక సర్వే ద్వారా వెల్లడయింది. కేవలం తనకు తానుగా జీవించాలని, ఒంటరిగా జీవించాలని, తల్లిదండ్రులను వదిలిపెట్టి జీవించాలని చాలామంది యువత ఆలోచనల్లో ఉన్నారు. ఈ మార్పు ప్రపంచ మానవాళిలో కనపడుతుంది. సామాజిక సంబంధం అనేది సామాజిక శాస్త్రాలలో విశ్లేషణ యొక్క ప్రాథమిక యూనిట్, సమూహాలలో ,లేదా మధ్య రెండు లేదా అంతకంటే ఎక్కువ స్పష్టమైన వ్యక్తుల మధ్య ఏదైనా స్వచ్ఛంద లేదా అసంకల్పిత వ్యక్తుల మధ్య సంబంధాన్ని వివరిస్తుంది. సమూహం ఒక భాష లేదా బంధుత్వ సమూహం, ఒక సామాజిక సంస్థ లేదా సంస్థ, ఒక ఆర్థిక తరగతి, ఒక దేశం లేదా లింగం కావచ్చు. సామాజిక సంబంధాలు మానవ ప్రవర్తనా జీవావరణ శాస్త్రం నుండి ఉద్భవించాయి, ఒక సమిష్టిగా, ఒకదానికొకటి, మొత్తం సామాజిక పర్యావరణ వ్యవస్థకు సంబంధించి బాగా అర్థం చేసుకోగల ఒక పొందికైన సామాజిక నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. సామాజిక సంబంధాల స్వభావంపై ప్రారంభ విచారణలు మాక్స్ వెబర్ వంటి సామాజిక శాస్త్రవేత్తల సామాజిక చర్య సిద్ధాంతంలో ప్రదర్శించబడ్డాయి, ఇక్కడ సానుకూల (అనుబంధ), ప్రతికూల (అఘోరమైన) పరస్పర చర్యలతో కూడిన సామాజిక సంబంధాలు వ్యతిరేక ప్రభావాలను సూచిస్తాయి. సామాజిక పరస్పర చర్యలను వర్గీకరించడం వలన పరిశీలనాత్మక,ఇతర సామాజిక పరిశోధనలు ప్రారంభమవుతాయి, ఉదాహరణకు జెమీన్‌షాఫ్ట్, గెసెల్స్‌చాఫ్ట్ (అక్షరాలా 'సంఘం, సమాజం'), సామూహిక స్పృహ మొదలైనవి. సామాజిక సంబంధాలలో మంచి అభ్యాసాల మాన్యువల్‌లను కలిగి ఉన్న పురాతన రచనలలో సూడో–ఫోసిలైడ్స్ ముఖ్యమైంది.

సామాజిక ప్రవర్తనపై ఇటీవలి పరిశోధనలు నవజాత శిశువులు సహజంగానే సామాజిక ప్రవర్తన వైపు ఆకర్షితులవుతారని నిరూపించాయి. బాధ్యతాయుతమైన సామాజిక కోతులుగా, మానవులు చాలా అభిరుచితో జన్మించారు, సామాజిక సంస్థ, భాష, నైతిక చట్రాల సాంస్కృతిక ప్రసారం కోసం ప్రసవానంతర అభివృద్ధి యొక్క ఎక్కువ కాలం అవసరం. భాషా, మానవ శాస్త్ర చట్రాలలో, ఇది సంస్కృతి యొక్క బంధుత్వ పరిభాషలో ప్రతిబింబిస్తుంది, డిఫాల్ట్ తల్లి–బిడ్డ సంబంధం పిండ ప్రక్రియలో భాగంగా ఉద్భవిస్తుంది.

**2.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ:**


ఉమ్మడి కుటుంబంలో కనీసం మూడు తరాలవారు ఉండేవారు. ముందు తరం వారి నడవడిక, పద్ధతులను తరవాత తరం అనుసరించేది ముఖ్యంగా పిల్లలకు మానవత్వ విలువలు, నైతిక ప్రవర్తన, సంస్కృతి, సంప్రదాయాలను పెద్దలు కథల రూపంలో చెప్పేవారు. రామాయణ భారతాల వంటి పురాణేతిహాసాలను విడమరచి చెప్పడం వల్ల పిల్లల్లో మంచి చెడుల విచక్షణ కలిగేది.కాలం మారింది. ఇప్పుడు పిల్లలు పాఠ్యపుస్తకాలకు, యువత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన విషయాలకు పరిమితమవుతున్నారు. పో పోటీ పరీక్షల అభ్యర్థులు మాత్రమే గ్రంథాలయాలకు వెళ్తున్నారు. అరకొర జ్ఞానంతో, తమకు తోచినట్లు వాణిజ్య విజయాలు కాంక్షించి తీసే చలన చిత్రాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు పాఠ్య పుస్తకాల్లో మానవతా విలువలకు తగినంత ప్రాధాన్యం ఇవ్వటం లేదని చాలామంది భావిస్తున్నారు. ప్రాచీన భారతదేశ సంస్కృతి, చరిత్ర, పురాణాలు అవసరమా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అవి అవసరమే. మనిషి వ్యక్తిత్వాన్ని అవి తీర్చిదిద్దుతాయి. ఎలా జీవించాలో, ఎలా. ఆ పరమాత్మకు నచ్చుతుందో నేర్పుతాయి.

ఆదికావ్యమైన రామాయణంలో కుటుంబ వ్యవస్థ, మానవీయ విలువలను వివరించారు. తండ్రి మాట నిలబెట్టడానికి శ్రీరాముడు వనవాసం చేశాడు. బహుభార్యత్వాన్ని నిరసించి ఏకపత్నీవ్రతం ఆచరించాడు. జాతి, కుల తారతమ్యం లేకుండా గుహుడు, సుగ్రీవుడు, విభీషణుడు, జాంబవంతుడుబీ హనుమంతుడు, శబరి... తదితరులతో కలిసి జీవించాడు. శత్రువుతో సైతం ఎలా ప్రవర్తించాలో తెలుపుతూ, నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వడం రామాయణం గొప్పదనం. స్త్రీలు ఇంటి గడప దాటరాదనే ఆంక్షను నిరసించి సీత రాముడితో వనవాసం చేసింది. అహంకారం, గర్వం, అసూయా ద్వేషాలతో ఎలా పతనం చెందుతారో మహాభారతం వివరించింది. భగవంతుడిపై నమ్మకం భక్తికి నిదర్శనం. అనేక మంది భక్తుల కథలను భాగవతం పేర్కొని మనిషి దైవత్వ గుణాలను సంతరించుకోవాలని బోధించింది. యువతలో నైరాశ్యం తొలిగి ఆత్మవిశ్వాసం పెంపొందించే ఎన్నో కథనాలు పురాణాల్లో ఉన్నాయి. అపజయంతో కుంగిపోకుండా ఓటమిని గెలుపునకు పునాదిగా మలచుకోవచ్చనటానికి పాండవులే నిదర్శనం.

నిరంతర కృషి, దీక్ష, పట్టుదల విజయానికి సోపానాలు. వివేకానంద స్వామి భారత దేశమంతా పర్యటించి యువతకు ధైర్యాన్నిచ్చే సందేశాలు అందించినా ఎవరూ పట్టించుకోలేదు. చివరికి ఆయన సర్వ మత సమ్మేళనంలో చేసిన 'సోదర సోదరీమణులారా' అనే సంబోధన ప్రపంచాన్ని ప్రేమతో కదిలించింది. ఎన్ని అవమానాలు ఎదురైనా సాధన కొనసాగించే వారు తప్పక లక్ష్యాన్ని చేరుకుంటారు. శిశువుకు తొలి గురువు తల్లి ఆమె మాటలు, పాటలు, ప్రవర్తన బిడ్డ గ్రహిస్తుంది. అనుకరించి నేర్చుకుంటుంది. తండ్రి, గురువు తరవాత స్థానాలు ఆక్రమిస్తారు. అడుగడుగునా సంస్కృతి, సంప్రదాయాలను బోధిస్తే ప్రతి విద్యార్థి సద్గుణ సంపన్నుడైన ఉత్తమ పౌరుడై దేశ భవిష్యత్తుకు బాటలు వేస్తాడు. ధర్మశాస్త్రాలు ఇప్పుడే కాదు. అవి ఎప్పటికీ అనుసరణీయమే!

3.సామాజిక సంబంధాలు వాటి నిర్దిష్ట లక్షణాలకు సంబంధించి అలాగే జీవిత కాలం అంతటా వ్యక్తికి వాటి ప్రాముఖ్యతకు సంబంధించి పెద్ద వైవిధ్యాన్ని చూపుతాయి. ఈ వైవిధ్యం ఉన్నప్పటికీ, అన్ని రకాల సామాజిక సంబంధాలు వ్యక్తిగత అభివృద్ధికి కీలకమైన చోదకాలుగా పనిచేస్తాయి. అయితే, జీవిత కాల పరికల్పనకు అనుగుణంగా, ఇదిప్రతి రకమైన సంబంధం వ్యక్తిత్వ వికాసానికి చాలా ముఖ్యమైన కాలాన్ని కలిగి ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ కాలాలు, రచయితలు ప్రధానంగా సంబంధాల పరివర్తనల ద్వారా నిర్వచించబడిన వయస్సు–శ్రేణి జీవిత పరివర్తనలతో ముడిపడి ఉంటాయి. అయితే, మధ్య యుక్తవయస్సు తర్వాత డైనమిక్ వ్యక్తిత్వ–సంబంధ లావాదేవీల పరిస్థితులు, పరిణామాలను కొన్ని అధ్యయనాలు మాత్రమే ప్రస్తావించాయి. అందువల్ల, పూర్తి జీవిత కాలంలో వివిధ రకాల సంబంధాల యొక్క మారుతున్న ప్రభావాలను మరింత క్షుణ్ణంగా అన్వేషించడానికి మరింత పరిశోధన అవసరం.సామాజిక సంబంధాలు చాలా కాలంగా ఆరోగ్య ఫలితాలతో ముడిపడి ఉన్నాయి. ఈ అనుబంధాన్ని అర్థం చేసుకోవడానికి వివిధ విభాగాలు వివిధ సైద్ధాంతిక మరియు పద్ధతి విధానాల నుండి ఈ అనుబంధం యొక్క అనుభావిక అవగాహనను సంప్రదించాయి. ఈ వ్యాసం ఈ విధానాల చారిత్రక నేపథ్యాన్ని, సోషల్ నెట్‌వర్క్‌లను మరణాలతో అనుసంధానించే ఆధారాలను, ఇది ఎలా సంభవిస్తుందో వివరించే సైద్ధాంతిక నమూనాలను సంగ్రహిస్తుంది, సోషల్ నెట్‌వర్క్‌లు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ప్రవర్తనా, మానసిక, జీవ మార్గాలను సమీక్షిస్తుంది మరియు భవిష్యత్ పరిశోధన, జోక్యాలకు వీటిని ఎలా అన్వయించవచ్చనే దానిపై సిఫార్సులను అందిస్తుంది.

సామాజిక సంబంధాల భావనను అభివృద్ధికి సందర్భాలుగా కూడా మనం తీసుకుంటాముబీ అంటే, ఒకరి మార్పు మరియు అభివృద్ధిపై ఇతరుల ప్రభావం యొక్క భావనలు. బ్రోన్‌ఫెన్‌బ్రెన్నర్, ఇతరులు పర్యావరణం యొక్క క్రమానుగత సంస్థ యొక్క నమూనాలను వివరించినట్లే, హిండే, స్టీవెన్సన్–హిండే (1987) సామాజిక సంబంధాలలో పిల్లల అభివృద్ధిని (ఎ) పిల్లల, వారు పాల్గొనే సామాజిక పరస్పర చర్యల మధ్య సంబంధాలుబీ (బి) సామాజిక పరస్పర చర్యలకుషౌవారు ఉన్న సంబంధాల మధ్య సంబంధాల పరంగా భావన చేశారు . హిండే, స్టీవెన్సన్–హిండే తదుపరి పరస్పర చర్యలు సంబంధాల పనితీరుకు దోహదపడే పరస్పర చర్యలు, సంబంధాల పనితీరు చరిత్రను కూడా నొక్కి చెప్పారు. అంతేకాకుండా, ఈ ప్రక్రియలన్నీ పిల్లల పరస్పర చర్యలు, వారి సామాజిక నెట్‌వర్క్‌లలో ఇతరులతో సంబంధాలను ప్రభావితం చేస్తున్నట్లుగా, వాటి ద్వారా ప్రభావితమవుతాయని భావన చేయబడ్డాయి, వారి పరస్పర చర్యలు, సంబంధాలు వారి స్వంత సామాజిక సంబంధాలతో ఉన్న ఇతర వ్యక్తులచే ప్రభావితమవుతాయి. అందువల్ల, క్రమానుగతంగా వ్యవస్థీకృతమైన సామాజిక సంబంధాల యొక్క ఈ భావన మన లావాదేవీ కుటుంబ డైనమిక్స్ ఫ్రేమ్‌వర్క్‌తో సరిపోతుంది, డైడ్‌లు, త్రయాలలో పరస్పర చర్యలు ఉంటాయి, వారు కుటుంబాలలో గూడు కట్టబడి ఉంటారు. ఏది ఏమైనా ఆధునిక ప్రపంచంలో మానవ విలువలు రోజురోజుకు దిగుజారిపోతున్నాయి. దీనంతటికీ వలస జీవన విధానం ప్రధానంగా ప్రభావం చూపుతుంది. ఇది మరింత కుదిరితే సమాజంలో మానవ సంబంధాలు అనేది లేకుండా పోయే ప్రమాదం లేకపోలేదు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైన తర్వాత మానవ సంబంధాలకు పెద్ద ప్రమాదం ఏర్పడింది. కుటుంబ పెద్దలను పోషించడం, స్వయంగా చూడడం అనుబంధాలు లేకుండా పోయాయి. పిల్లల కోసం తల్లిదండ్రులు రాత్రి పగలు కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తుల కోసం అన్నదమ్ములు అక్క చెల్లెలు ఆస్తుల కోసం తల్లి తండ్రి చనిపోతే ఆస్తి పంపకాల పేరుతో నాలుగైదు రోజుల వరకు దహన సంస్కారాలు చేయకుండా కొట్లాడుకున్న రోజులు ఇటీవల జరిగిన సంఘటన. కేవలం ఆర్థిక సంబంధాల కోసమే జీవిస్తున్నారు తప్ప రక్త సంబంధం పూర్తిగా అడుగంటి పోతున్నాయి. ఇప్పటికే సమాజంలో చాలావరకు మానవ విలువలు సంబంధాలు లేకుండా పోయి ఆటవిక జీవన వ్యవస్థ కనపడుతుంది.




డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం




## అప్పు...తప్పు... నిప్పు...ఒప్పు...

అప్పు...ఒక అగ్నిప్రమాదం...
తప్పు...ఒక తప్పటడుగు...
నిప్పు...ఒక నిర్దాక్షిణ్యపు శిక్ష...
ఒప్పు...ఒక శాంతియుత ఒప్పందం..!
అప్పు...
అప్పు చేయనివాడు అవనిలో
కాగడా పట్టి వెతికినా కానరాడు...
అవసరానికి అప్పు అండగా ...
తోడు నీడగా నడిచినా...
కడకది బాదుడే భరించలేని బరువే..!
తప్పు...
తీరం చేరక తెగిపడే తపన...
వెంటాడే నిట్టూర్పుల నిశ్శబ్దం...
తెలిసి తెలిసి చేయకు తప్పు...చేస్తే
ఒప్పుకో అదే మనశ్శాంతికి మందు..!
నిప్పు...
తీరని అప్పు ఆరని నిప్పే...
అది నిప్పు కణికలపై నడకే...
ఆవహించేది అవమానమే...
ఆపై జరిగేది ఆత్మ దహనమే..!
ఒప్పు...
చేసిన నేరాన్ని ఒప్పుకున్నా...
చేసిన అప్పును తీర్చినా గౌరవమే...
అది మానవతకు ఒక ఆమోదముద్రే..!
ఓ మనిషీ...ఒక్కమాట...
నీ మనసులో ప్రశాంతత ప్రహించనియ్...
పేదవాడిగా జన్మించడం కాదు శాపం...
పేదవాడిగా మరణించడమే మహాపాపం..!
అవసరాల కోసం
అప్పు చేయడం కాదు నేరం
పీకలదాకా అప్పులు చేసి విదేశాలలో
విహారయాత్రలు చేయడం...
విలాసవంతమైన జీవితం గడపడం...
"తీరని అప్పు...ఒక ఆరని నిప్పని"...
తెలుసుకోకపోవడం ఒక నేరం
మహాఘోరం..!

రచన: కవి రత్న, సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్





# ఇజ్రాయిల్ నరమేధాన్ని నిలువరించాలి

రక్తపు రుచి మరిగిన 'ఫాసిస్ట్ ఇజ్రాయిల్ దేశం' అమెరికా అండతో పాలస్తీనా ప్రజానీకంపై నరమేధాన్ని నిరాటకంగా కొనసాగిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతోంది. భారీగా పౌర మరణాలకు మరియు మరచిపోలేని నెత్తుటి గాయాలకు ఇజ్రాయిల్ కారణమవుతూనే ఉంది. యావత్ ప్రపంచం ఆక్షేపిస్తున్నా కూడా ఇజ్రాయిల్ ఏకపక్షంగా యుద్ధన్మాదంతో ముందుకెళుతోంది. 'హమాస్ అంతమే లక్ష్యం' అని పేర్కొంటూ ఇజ్రాయిల్ మారణ హోమాన్ని సమర్థించుకుంటోంది. ఈ రకంగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులతో నేడు గాజా ఒక 'మృత్యుకూపం'గా మారిపోయింది. లక్షలాది మంది ప్రజానీకం అనేక సమస్యలతో విలవిలలాడుతుండడం హృదయవిదారకరం. శాంతిభద్రతా పరిస్థితులు రోజురోజుకు మరింతగా క్షీణిస్తుండడంతో నేడు గాజా అంతటా అమానవీయవీయ విషమ పరిస్థితులు నెలకొని ఉండడం కడు విషాదకరం.

2025 జనవరి 19 నాడు హమాస్తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత ఆ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ ఇజ్రాయిల్ సైనిక దళాలు మళ్ళీ గాజాపై భీకర దాడులకి పాల్పడుతూ మృత్యుకూపంగా మార్చడం ఏమాత్రం సహేతుకం కాదు. పవిత్ర రంజాన్ మాసంలోనే ఇజ్రాయిల్ సైనిక దళాలు ఈ దాడులకి పాల్పడడాన్ని చాలా సునిశితంగా గమనించవచ్చు. 'కాల్పుల విరమణకి సజావుగా కట్టుబడి ఉండాలి 'అని అంతర్జాతీయం గాను ఒత్తిడి వస్తున్ననూ కూడా వాటన్నింటిని తోసిపుచ్చుతూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు యుద్ధోన్మాదంతో దుందుకుడుగా వ్యవహరిస్తుండడం ఏమాత్రం సహేతుకం కాదు.

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉండగానే కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యలోనే తూట్లు పొడిచి ఈ నెల 18 నాడు గాజాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడడం అత్యంత హేయమైన చర్యకు నిదర్శనం కాగలదు. అలా విచక్షణారహితంగా రెండు రోజుల పాటు వైమానిక దాడులు చేసిన ఇజ్రాయిల్ సైనిక దళాలు తాజాగా గాజాపై భూతల దాడులను తిరిగి కొనసాగిస్తూ అత్యంత పాశవికంగా వ్యవహరిస్తున్న తీరు కడు ఆక్షేపనీయం. గత మూడు రోజులుగా ఇజ్రాయిల్ సైనిక దళాలు కొనసాగిస్తున్న వైమానిక మరియు భూతల దాడులతో 200 మందికి పైగా చిన్నారులతో పాటు మొత్తం 506 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం విచారకరం.

గాజాలో 2023, అక్టోబరు 7 నుండి నేటి వరకు ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 61,700 మందికి పైగా పాలస్తీనా ప్రజలు చనిపోగా 1,12,000 మందికి పైగా ప్రజలు గాయపడడం ఇజ్రాయిల్ నరహంతక యుద్ధోన్మాదానికి పరాకాష్టగా నిలుస్తుంది. వీరిలో మూడింట రెండొంతుల మంది మహిళలు మరియు బాలలు ఉండడం గమనార్హం. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద క్రూరత్వాలకు గాజా ప్రజలు బలి కావడం కడు విషాదకరం.

నేడు గాజా ప్రజానీకం కడు దయనీయ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతూనే బిక్కుబిక్కుమంటూ యుద్ధం నడుమ దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ప్రజలు తీవ్రమైన ఆహార కొరతతో ఇబ్బంది పడుతున్నారు. గాజాలో మానవతా సాయం సరిగా అందకపోవడంతో చాలా మంది ఆకలితో అలమటిస్తూ మృత్యువు లోగిళ్లకు బలైపోవడం కడు విచారకరం. గాజా ప్రజలకు మానవతాసాయాన్ని అందించేందుకు ఇజ్రాయిల్ ఆంక్షలు సైతం అడ్డుగా ఉండడాన్ని అంతర్జాతీయ సమాజం చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తూనే ఉంది. ఏది ఏమైననూ నేడు 'ఇజ్రాయిల్ క్రమంగా ప్రపంచ దేశాల మద్దతును కోల్పోతూనే ఉంది' అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఒంటెద్దు పోకడలతో దుందుకుడుగా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్ భవిష్యత్తులోనూ ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం లేకపోలేదు.

ఫాసిస్ట్ ఇజ్రాయిల్ కాల్పుల విరమణకి మధ్యలోనే తూట్లు పొడిచి ఈ రకంగా మరోసారి అమానుష మారణకాండకు పాల్పడుతుండం ఏమాత్రం మానవీయం కాదు. 'గాజాలో మానవ హననానికి స్వస్తి పలకాలి' అని గతంలో అంతర్జాతీయ న్యాయస్థానం ఇజ్రాయిల్ను ఆదేశించిననూ ఆ ఆదేశాన్ని ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టడం ఏమాత్రం సహేతుకం కాదు. అందువలన ఇకనైననూ ఇజ్రాయిల్ తన ఫాసిస్ట్ యుద్ధోన్మాద విధానాలను విడనాడాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్య సమితి ( ఐరాస ) భద్రతా మండలి ఆమోదించిన తీర్మానానికి ఇజ్రాయిల్ కట్టుబడి ఉండాల్సిన అవసరం నేడు తప్పకుండా ఉంది. తద్వారా గాజాలో కాల్పుల విరమణ సజావుగా జరిగి అంతిమంగా నరమేధాన్ని నిలువరించి శాంతిని నెలకొల్పవచ్చు. ఏది ఏమైననూ గాజాలో ఇజ్రాయిల్ నరమేధాన్ని నిలువరించేంత వరకు అంతర్జాతీయంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు నిరవధికంగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

### న్యూడ్ కాల్స్ నేరస్థులు ఏమయ్యేరు..!?

న్యూడ్ కాల్స్ నేరంలో
మహిళల జీవితాలతో
ఆటలాడుకున్న లఫంగలు
దొరబాబులై
తిరుగులాడుతున్నారు
విజ్ఞతా గద్వాలలో..
కేసులకు చిక్కలేదో..??
చట్టానికి కనపడలేదో..!!
కావాల్సినోళ్లకు
ఆప్తులైపోయారో..!??
రాబోయే ఎన్నికల్లో
వీళ్లందర్నీ
ఓట్లకోసం మళ్ళీ వొచ్చి
మళ్ళో సారి నేతలు
కానిద్దామా...
నడిగడ్డ ఆడపిల్లల్ని
ఇలాగే బలికానిద్దామా!?

ఇక్బాల్
పాలమూరు అధ్యయన వేదిక
గద్వాల జిల్లా
శాఖ



### ఎవరైనా....వద్దనకు

ఎవరైనా నీ హృదయాన్ని
కరిగిస్తామంటే కాదనకు
ఎవరైనా నీ గుండెను
రగిలిస్తామంటే వద్దనకు
ఎవరైనా నీ తలను
తొలుస్తామంటే అభ్యంతరంచెప్పకు
ఎవరైనా నీ మనసును
మదిస్తామంటే నివారించకు
ఎవరైనా నీ నోటిలో
మాటలుపెడతామంటే
వ్యతిరేకించకు
ఎవరైనా నీ కళ్ళకు
అందాలుచూపుతామంటే
అడ్డుచెప్పకు
ఎవరైనా నీ చెవుల్లో
ఊదుతామంటే అక్షేపించకు
ఎవరైనా నీ ఉల్లానికి
ఉత్సాహమిస్తామంటే
ఎవరైనా నీ మీద
విజయంసాధిస్తామంటే కోపగించకు
దేనిలో ఏముందో?
ఏపుట్టలో ఏపాముందో?
ఎవరిలో ఏశక్తి ఉన్నదో?
ఎవ్వరిలో ఏయుక్తి ఉన్నదో?

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

# 16.35 కోట్ల బ్యాంకింగ్ ఫ్రాడ్




అవును మన దేశం లో పెట్టుబడి దారుల 16.35 లక్షల కోట్లు బ్యాంకింగ్ ఫ్రాడ్ జరిగింది.(రుణమాఫీ)ఒక సామాన్యుడు బ్యాంకు నుంచి రుణం తీసుకుంటే ఒక ఈఎంఐ వీలు కాక ఆ నెల కట్టకపోతే బ్యాంకు నుంచి అతనికి పదిసార్లు ఫోన్ వస్తుంది 11వసారి ఇంటికి వచ్చి తలుపు కొడతారు ఆ తర్వాత ఇంట్లో ఉన్న సామాను గుంజుకుని పోతారు, లేదా ఏదైనా వాహ నం రుణం ద్వారా తీసుకొని ఉంటే ఆ వాహనాన్ని తీసుకొని వెళ్ళిపోతారు. నానా హంగామా చేస్తారు. పోలీస్ కేసులు కూడా రైతులు కూడా రుణం తీసుకుంటే సమయానికి కట్టకుండా వారిని కూడా ఇలాగే ఇబ్బంది పెడతారు ట్రాక్టర్లను గుంజుకుని వెళ్తారు. అవమానాలకు గురి చేస్తారు. దేశంలో రైతులు ఆత్మహత్యలు రుణం చెల్లించని కారణంగానే రుణ భారం పెరిగి పంటలకు గిట్టుబాటు ధర లభించక, పంటలు పండగ నష్టం వచ్చినప్పుడు ఇలాంటి దురదృష్ట సంఘటనలు ఈఎంఐ చెల్లించకపోవడం జరుగుతూ ఉంటాయి. దేశవ్యాప్తంగా ఈ పరిస్థితి ఉన్నది. ఇలాంటి తరుణంలో పెద్దపెద్ద పారిశ్రామికవేత్తల ముసుగులో రాజకీయ నాయకులు భారీగా వేల, లక్షల కోట్లలో రుణాలు తీసుకుంటారు.

**జీఎస్టీ , పన్నుల్లో వారికే వారికే వెసలు బాట్లు**

ఇతర పన్నులులో వారికే వెసులుబాటు ఉంటుంది. ఇలాంటి వారే అసలు రుణాలు ఎగవేత దారులుగా ఉన్నారు. విదేశాలకు పారిపోయిన వారిలో వీరే 80 శాతం ఉన్నారు. మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నల్లధనం వెలికి తీసి అలాంటి వారి వద్ద నుంచి మొత్తం వసూలు చేసి అటు విదేశాలకు పారిపోయిన వారిని కూడా ఇండియాకు తీసుకువచ్చి ఆ డబ్బునంత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అలాగే అందులో నుంచి 15 లక్షల చొప్పున దేశంలోనే నిరుపేద మధ్యతరగతి కుటుంబాల ఖాతాలలో జమ చేస్తామని హామీ ఇచ్చారు.

**హామీలన్నీ వట్టి ముచ్చటే**

ఇతర హామీల మాదిరే ఈ హామీ డస్ట్‌బిన్‌లోకి వెళ్ళిపోయింది. ఏడాది రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టించి ఇస్తామని పేర్కొన్న ఇచ్చిన హామీ సైతం అలాగే అయిపోయింది. ప్రధానమంత్రి హామీలన్నీ ఒల్లెక్కల మాటలు అయిపోయాయి అంతా జుమ్లే బాజీ అయిపోయింది. ఏదో మాట వరసకు అలా అన్నారు అని,ఈ హామీలపై ఒకసారి మన హోం మంత్రి అమిత్‌షా పేర్కొనడం మనం విన్నాం. ఈ విషయాలన్నీ చాలా సందర్భాలలో చర్చకు వచ్చాయి ఇందులో ప్రతి విషయం మనం మాట్లాడుకున్నాం. దేశ ప్రజలందరూ ఇదంతా వట్టిదే అని తెలిసినంక ఊరుకుండిపోయారు. నిలదీసుడులేదు.

**ప్రశ్నించే గుణం ఏది.**

ప్రభుత్వాన్ని ప్రశ్నించే గుణం ఎప్పుడో పోయింది.హిందూ ముస్లిం సిగ్గ సాయి మందిర్, మజీద్, చర్చ్, గురుద్వారా లాంటి వాటి లో గొడవలు, సృష్టించే వారి అసలు అవసరంలేని దేశానికి కూడు, ఉపాధి, గుడ్డ, వైద్యం, విద్య లాంటివి అంది ంచని విషయాల మీద కేంద్రీకరించడం జరుగుతుంది. అవే ఇప్పుడు ప్రధానమై పోయాయి.

**పాలకుల మీద ఏది దృష్టి.**

అందుకే అసలు పాలకులు ఏం చేస్తున్నారు, అసలు దేశం ఏమైపోతుంది 16.35 లక్షల కోట్లు ముంచిన వారికి ప్రభుత్వం వత్తాసు పలకడం ఏమిటి అనే విషయాలను ఏమాత్రం గ్రహించడం లేదు ఇక అసలు విషయానికి వద్దాం. మన దేశంలో బ్యాంకింగ్ ఫ్రాడ్ పీఎం నరేంద్ర మోడీ కాలం లో 16.35 లక్షల కోట్లు జరిగింది. గత పది ఏండ్ల లో ఇది ఎనిమిదింతల బ్యాంకింగ్ ఫ్రాడ్ జరిగింది. ఆర్బీఐ నిబంధనల ప్రకారం పరిమిత కాలం దాటితే రుణం తీసుకుని చెల్లించని వారి ఈ మొత్తం వసూలు కానీ ఖాతాలో వేస్తారు.

**పది ఏండ్లలో వసూలు చేసింది ఎంత?**

వసూలు అయితే ఇది మాఫీ చేసినట్లు కాదని వసూళ్లు ఉంటాయని ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పేర్కొంటారు. మరి గత పది న్నర సంవత్సరాల నుంచి మాఫీ(బ్యాడ్ లోన్)చేస్తూ వస్తున్న మొత్తంలో ఇప్పటిదాకా రికవరీ చేసింది ఎంతో ఒకసారి విన్నవిస్తే మంచిది. ఎందుకంటే 2023 24 నాటికి మొత్తం 16.35 లక్షల కోట్ల మాఫీ చేయడం జరిగింది.

**18 వేలనుంచి లక్షల కోట్ల దాకా ఎగవేత! మాఫీ!**

అదే 2014లో 18 వేల కోట్లు ఉన్న మాఫీ రాను రాను లక్షల కోట్ల మాఫీ ప్రతి సంవత్సరం ఎలా చేసుకుంటూ వచ్చారు. దీనికి సమాధానం లేదు. బ్యాంకు లెక్కలను ఎక్కడికక్కడ సరి చేయడం కోసం ఈ రుణం ఇచ్చిన డబ్బులను బ్యాంక్ అధికారులు ప్రభుత్వ ఆదేశం మేరకు బాడ్ లోన్ కింద జమ చేస్తూ ఉంటారు. వసూలు కూడా చేస్తాము, వదిలి పెట్టబోము అని ప్రభుత్వం పేర్కొంటుంది. ఏది నిజం ఏది అబద్ధం ప్రజలే నిర్ణయించాలి.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# ఆడుకుంటున్న చిన్నారి పైనుంచి దూసుకెళ్లిన ఆటో

- అనుమతులు లేని నిర్మాణానికి ఓ చిన్నారి బలి
- అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి.
- అధికారుల పట్టింపు ఏది..

**శంషాబాద్, మార్చి 21 (జనంసాక్షి) :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాల్లగూడ ఇందిరానగర్ దొడ్డిలో దారుణం చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా మరికల్ మండలం, పెద్ద కుంట పల్లి గ్రామానికి చెందిన రేణుక శివకుమార్ దంపతులకు కీర్తి 18 నెలల పాపతో సంవత్సరం క్రితం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాల్లగూడలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు కూతురు కీర్తిని వెంట వేసుకొని పారపని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం యధావిధిగా భార్యాభర్తలు స్లాబ్ పని చేసుకుంటున్నారు. సాయిగణేష్ స్టీల్ సంబంధించిన సిమెంట్ లోడ్ తోవచ్చిన టాటా ఎసివాహనం నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఆడుకుంటున్న 18 నెలల కీర్తి చిన్నారి పైనుంచి తీసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి డెడ్ బాడీని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

మాజీ కౌన్సిలర్ కొండా ప్రవీణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ. 111 జీవోలో అనుమతులు లేని నిర్మాణానికి 18 నెలల పాప బలైందన్నారు. అనుమతులు లేని నిర్మాణాలు జాగ్రత్తలు తీసుకోకుండా చిన్నారిని బలవంతంగా చిదిమేశారు. ఈపాపం ఊరికేనే పోదు. నిర్మాణాలను



ప్రోత్సహిస్తున్న మున్సిపల్ అధికారులకు తగులుతుందన్నారు.

సిపిఐ కార్యదర్శి నర్రాగిరి మాట్లాడుతూ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై ట్రిబుల్ వన్ జీరో పరిధిలో అక్రమ నిర్మాణాలను పోత్సహిస్తున్నారు. బుధవారం నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్ కాలి బూడిదయ్యింది. నేడు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఓ పసికందు బలైంది అన్నారు. లంచాలు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి.

# తబితకు రవాణా సౌకర్యం కల్పించలేని అధికారులు

- పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి వీల్ చైర్ కల్పించలేని దుస్థితి
- తండ్రి సహకారంతో తెలుగు పరీక్ష రాసిన తబిత

**వికారాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** ప్రయాణం ఒక్క నరకం.. పగోడికి కూడా ఇలాంటి దుస్థితి రాకూడదు. టెన్షన్‌తో పరీక్ష రాయడం ఒక ఎత్తయితే పరీక్ష కేంద్రంలోకి చేరుకోవడం కోసం నరకయాతన పడవలసి వస్తుంది. పేదోళ్ల బతుకులు ఇంతే అంటూ విద్యార్థి తబిత కన్నీళ్లు పెట్టుకుంది. కొత్తగడి గురుకుల పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి వేధింపులకు తట్టుకోలేక భవనం పైనుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విద్యార్థి తబిత విషయం పాఠకులకు విధితమే. శుక్రవారం నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన కారణంగా జడ్.పి.హెచ్.ఎస్ అలంపల్లిలో ఉన్న పరీక్ష కేంద్రంలో విద్యార్థి తబిత తెలుగు పరీక్ష రాసింది. కానీ మొదటి రోజే పది పరీక్షలు రాయడానికి తాను నరకయాతన పడినట్లు తెలియజేసింది. ఉదయం ఐదు గంటలకు నిద్ర లేచి పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి బయలుదేరితే పరీక్ష సమయం తొమ్మిది గంటలకు చేరుకోవలసిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఒకవైపు అప్పుచేసి ఆసుపత్రి ఖర్చులు కుప్పల పెరిగిపోతున్నాయని. మరోవైపు పది పరీక్ష రాయడానికి రవాణా సౌకర్యం కోసం ఆర్థిక స్తోమత లేక దాదాపు 50 కిలోమీటర్లు బైకుపై ప్రయాణించి పరీక్ష కేంద్రానికి చేరుకోవలసిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తన తండ్రి యాదయ్య బైకుపై కూర్చోబెట్టుకొని విరిగిన కాలు నేలకు తగలకుండా



తన కాళ్లకు టవల్తో కట్టుకొని అతి కష్టంపై గతుకుల రోడ్లపై ప్రయాణించవలసి పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి అధికారులు తనకు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గురుకులం సంఘటన వెలుగులోకి ఇచ్చిన తర్వాత హడావుడి చేసిన అధికారులు తన బాగోగుల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పది పరీక్షల టైంలో రవాణా సౌకర్యంతో పాటు పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి వీల్ చైర్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పి తర్వాత పట్టించుకోవడంలేదని అన్నారు. మధ్యాహ్నం 12:30 తర్వాత పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తామని ఎర్రటి ఎండలో 50 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వస్తుందని అన్నారు. పరీక్ష హాల్లోకి తన తండ్రి తనను తీసుకువెళ్లడం తలక మించిన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసింది. సంఘటన జరిగినప్పుడే అధికారులు స్పందిస్తారని తర్వాత పేదల గురించి పట్టించుకోరని తమ బతుకులు ఇంతేనని కన్నీళ్లు పెట్టుకుంది. మిగతా పది పరీక్షలు ఎలా రాయాలోనని టెన్షన్ పెరిగిందని తెలియ చేసింది. ఇప్పటికైనా అధికారులు గాయపడిన విద్యార్థి తబితకు పది పరీక్షలు రాయడానికి వీలు కల్పించే విధంగా రవాణా సౌకర్యం కల్పిస్తారని ఆశిద్దాం....


## తల్లి కొడుకుపై మిస్సింగ్ కేసు నమోదు



**చేవెళ్ల, మార్చి 21 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో శుక్రవారం నుండి తల్లి కొడుకు కనిపించకుండా పోయారు. భర్త యంజాల మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చేవెళ్ళ పోలీసులు. చేవెళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యంజాల కామిని భర్త గురువారం మార్చి 20న మధ్యాహ్నం సమయంలో జాకెట్ కుట్టించుకొని వస్తానని ఇంట్లో చెప్పి రెండు సంవత్సరాల కుమారుడిని తీసుకొని వెళ్లిపోయిందని చీకటైన ఇంటికి తిరిగి రాలేదని యామిని భర్త మార్చి21న ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ళ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## పట్టపగలు మహిళ మెడలో నుండి పుస్తెలతాడు లాక్కెళ్లిన దుండగుడు

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సిఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై అబ్దుల్ రావుఫ్



**బొంరాస్‌పేట, మార్చి 21 (జనం సాక్షి) :** పట్టపగలే దుండగుడు ఓ మహిళ మెడలో నుండి పుస్తెలతాడు లాకెళ్లిన సంఘటన మండల పరిధిలోని తుంకీమెట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ శ్రీధర్ రెడ్డి ఎస్ఐ అబ్దుల్ రావుఫ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.ఎస్సై రావుఫ్ తెలిపిన వివరాల ప్రకారం తుంకిమెట్ల గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మచారి ఇంట్లో అతని భార్య సుస్మిత ఉండగా గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి స్ప్రే చల్లి ఆమె మెడలో నుండి బంగారు పుస్తెలతాడు లాక్కొని వెళ్లినట్లు తెలిపారు.అట్టి పుస్తెలతాడు విలువ సుమారు 2.30 తులాలుగా ఉంటుందని బావ వడ్ల శేఖర్ చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- మోమిన్‌పేట సిఐ జి. వెంకట్



**మోమిన్‌పేట, మార్చి 21 (జనం సాక్షి) :** రేపటి నుండి ప్రారంభం కానున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల దృష్ట్యా జి వెంకట్ సీఐ మోమిన్పేట్, వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి సూచనలు:- మేరకు మోమిన్ పెట్, మర్పల్లి, నవాబ్ పెట్ మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా రేపటి నుండి ప్రారంభం అవనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లని కొంతమంది వ్యక్తులు ఆసరాగా చేసుకుని అక్రమంగా బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఇట్టి విషయంపై మోమిన్ పెట్ సీఐ జి వెంకట్ గారు ప్రత్యేక దృష్టి సారించి మోమిన్ పెట్, మర్పల్లి, నవాబ్ పెట్ మండల పరిధిలో సాధారణ దుస్తులు లో ఉన్న పోలీస్ వారిచే స్పెషల్ టీంలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రికెట్ బెట్టింగ్ కు అలవాటు పడి ఎంతోమంది తమ కుటుంబాన్ని రోడ్డున పడేలా చేస్తున్నారని బెట్టింగ్ పాల్పడే వారిని మరియు బెట్టింగ్ నిర్వహించే వారిని టెక్నికల్ మరియు స్పెషల్ టీం లా సహకారంతో గుర్తించి ఇట్టి వ్యక్తులపైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసుకుంటామని చెప్పడం జరిగింది. అదేవిధంగా కొంతమంది ప్రభుత్వం నిషేధించిన బెట్టింగ్ యాప్లని వినియోగిస్తున్నారని మరియు ఆన్లైన్ లో బెట్టింగ్ యాప్ ల ద్వారా బెట్టింగ్ కి పాల్పడుతున్నారని ఇటీవల ఇట్టి బెట్టింగ్ యాప్ లని ప్రమోట్ చేసిన వారిపై కేసుల నమోదు అయినాయని, అదేవిధంగా ఇట్టి బెట్టింగ్ యాప్ ల ద్వారా బెట్టింగ్ కి పాల్పడే వారి పైన కూడా కేసులు నమోదు అవుతాయని చెప్పడం జరిగింది. ఇట్టి బెట్టింగ్ కి పాల్పడే వారి యొక్క వివరాలు తెలిసినట్టయితే 100 నెంబర్ కి గాని ,సి ఐ మోమిన్ పేట్ 8712670036 నెంబర్ కి గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు. మీ యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడును.

# కొత్తబావి కట్టడాలను కబ్జా బకాసురుల నుండి కాపాడాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**గద్వాల నడిగడ్డ, మార్చి 21 (జనం సాక్షి) :** గద్వాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా రాజుల కాలం నాటి సంస్థానాధిశులకు చెందిన కొత్త బావి ని సంరక్షించాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ సంతోష్ ప్రజాసంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు.అన్య క్రాంతంనికి గురైన విషయాన్ని బావిని తమ ఆధీనంలోకి తీసుకొని ప్రభుత్వ అనుమతి లేకుండా బావి చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించ తలపెట్టిన సందర్భంలో గతంలో మున్సిపల్ కమిషనర్ కి జనవరి మాసంలో కలెక్టర్ దృష్టికి తీసుకొని పోగా నేటి వరకు ఎటువంటి ప్రభుత్వ పరంగా కార్యాచరణ స్పందించకపోవడం వలన మాజీ మున్సిపాలిటీ చైర్మన్ జి. వేణుగోపాల్ స్థానిక రాజకీయ నాయకుల అండతో బావిని మట్టితో కూల్చడానికి కార్యాచరణ రూపొందించడాని అక్రమ మట్టితో బావిని పూడ్చుచున్నాడనీ, విషయం ద్వారా తెలియజేస్తూ సంస్థానా దిశల కాలంనాటి కట్టడాలను బావులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారన్నారు తక్షణమే రాజుల కాలం నాటి చరిత్రాత్మకమైన కట్టడాలను కబ్జాదారుల నుండి రక్షించాలని అన్నారు. లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ అక్రమ కట్టడాన్ని నిలిపివేసి చుట్టు ఫెన్సింగ్ చేపిస్తానని హామీ ఇవ్వడం జరిగిందనారు.అనంతరం ఇదే విషయంలో



భాగంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్చార్జి సరిత తిరుపతయ్యకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు,సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు మోహన్ రావు, వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శంకర ప్రభాకర్,పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శుభాన్, తెలంగాణ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజ్, టియన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పేరు సుభాన్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్, ఏఐఎస్ఎఫ్ ప్రవిన్, బి ఆర్ ఎస్ వాల్మీకి, కోళ్ల హుస్సేన్, సిపిఐ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య మిషన్ పథకాన్ని రెగ్యులర్ చేయాలి

**మక్తల్, మార్చి 21 (జనంసాక్షి) :** దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం జాతీయ ఆరోగ్య మిషన్ పథకాన్ని రెగ్యులరైజ్ చేసి ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని నారాయణపేట జిల్లా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రాజ్, కర్ని పి హెచ్ సి అధ్యక్షురాలు యశోద డిమాండ్ చేశారు. శుక్రవారం మక్తల్ మండలంలోని కర్ని పి.హెచ్.సి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆశ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో జాతీయ స్థాయిలో ఆందోళనలు చేస్తున్నామన్నారు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం పెన్షన్ సామాజిక భద్రత ప్రయోజనాలను ఆశా కార్యకర్తలు కల్పించాలన్నారు. కరోనా కట్టడిలో ఆశ కార్యకర్తలు తగిన రక్షణ కవచాలు లేకున్నా తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ ప్రజల ప్రాణాలను కాపాడినారన్నారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశా కార్యాకర్తలను గ్లోబల్ లీడర్ గా గుర్తించిందన్నారు. జాతీయ ఆరోగ్యం కమీషన్ పరిధిలో దేశ వ్యాప్త 10 లక్షలు 9 వేల మంది ఆశలు పనిచేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం జాతీయ ఆరోగ్య మిషన్ ను శాశ్వత ఆరోగ్య కార్యక్రమం పథకంగా మార్చాలని




డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఒకే విధమైన పని పరిస్థితులను అమలులోకి తీసుకురావాలన్నారు. వేతనంతో కూడుకున్న ప్రసూతి సెలవులు 20 రోజుల క్యాజువల్ లీవులు వైద్య సెలవులు అమలు చేయాలన్నారు. సీనియార్టీ ప్రకారం ఆశలను ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుపతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు అనిత, సుజాత, అనురాధ, యు సావిత్రమ్మ, రాజేశ్వరి, ఆశ కళావతి, పుష్ప రవీంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నిండి ప్రాణం బలి

- తాగుబోతుల అడ్డాగా మారిన కర్ని సబ్ స్టేషన్
- పట్టించుకోని అధికారులు
- మృతదేహంతో సబ్ స్టేషన్ ముట్టడించిన మృతుడి బాధితులు
- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

**మక్తల్, మార్చి 21 (జనంసాక్షి) :** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఒక నిండు ప్రాణం బలి అయిన సంఘటన మక్తల్ మున్సిపాలిటీలోని ఆరవ వార్డు చందాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. చందాపూర్ గ్రామానికి చెందిన చిన్న పి.వెంకటేష్ విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తుంటారు. అదే గ్రామానికి చెందిన సిరిపే మహేష్ వయస్సు 23 సం!! అనే యువకుడు కాంట్రాక్టర్ చిన్న పి.వెంకటేష్ కింద పని చేయడానికి మండల పరిధిలోని కర్ని గ్రామ శివారులో పర్మన్ దొడ్డి గ్రామానికి చెందిన ఒక వ్యవసాయ రైతు పొలంలో విద్యుత్ పనులు



చేస్తుండగా లైన్మెన్ నింగప్ప చెప్పక ముందే కర్ని సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ తాగిన మత్తు మైకంలో ఎల్ సి రిటర్న్ చేయడంతో స్తంభంపై ఉన్న సిరిపే మహేష్ విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని మృతుని కుటుంబ బాధితులు మండలంలోని సబ్ స్టేషన్ ముట్టడించి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మృతుని కుటుంబంతో విద్యుత్ శాఖ సంఘాలు మాట్లాడి ధర్నాను విరమింపచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తము మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి పోలప్ప తల్లి భీమమ్మ, ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని యస్ ఐ వై. భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- చీపునుంతల గ్రామంలో శ్రీ శివ సీతరామంజనేయ
- స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం
- పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**తలకొండపల్లి, మార్చి 21 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు.మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ శివ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, గోలి శ్రీనివాస్ రెడ్డి,లను ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి,వైస్ చైర్మన్ వెంకటేష్,నరోత్తం రెడ్డి,శాలువతో సన్మానించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానవులకు మానసిక ప్రశాంతత ఉంటుందని తెలిపారు.గ్రామస్తులంతా సమన్వయంతో గ్రామంలో ఉన్న పురాతన ఆలయాన్ని పునర్నిర్మించి ఐక్యత చాటుకున్నారని తెలిపారు.ప్రజలంతా కుల మతాలకు అతీతంగా ఉండి హైందవ ధర్మాన్ని కాపాడాలని అన్నారు.దైవ నిర్ణయం లేనిదే ఏ కార్యమైనా సాధ్యం కాదని,ప్రజలందరూ దైవారాధన తప్పకుండా చేయాలని తెలిపారు.తదానంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సువర్ణ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్, బాల కుమార్ గౌడ్, శేఖర్ గౌడ్, నీలకంఠం మహేష్,



బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి రెడ్డి ప్రదీప్ రెడ్డి, గుమ్మడి రాజు, శ్రీనివాస్ గుప్తా, పర్వతాలుయాదవ్, గిరి, మల్లేష్, చెన్నయ్య, సుదర్శన్ గౌడ్, రాజు యాదవ్, అభినవ్ తదితరులు ఉన్నారు.


# ఎఫ్‌వై26లో గోద్రేజ్ జెర్సీ లక్ష్యం రూ.1000 కోట్లు

- సంస్థ సీఈవో భూపేంద్ర సూరి




**మొయినాబాద్, మార్చి 21 (జనం సాక్షి) :** దక్షిణ భారత్‌లో పాల ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న గోద్రేజ్ జెర్సీ 2025%-%26 ఆర్థిక సంవత్సరం (ఎఫ్ వై26)లో రూ. 1000 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ సంస్థ సీఈవో భూపేంద్ర సూరి తెలిపారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ లో సంస్థ మార్కెటింగ్ చీఫ్ శంతను రాజ్ తో కలిసి గోద్రేజ్ జెర్సీ 3%ఇ%3 లీప్ ఫ్రాగ్ వ్యూహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాదం మిల్క్, పనీర్, పెరుగుకు సంబంధించి ఉత్పత్తి ఆవిష్కరణ, మార్కెట్ విస్తరణ, మరిన్ని గృహాల్లోకి చేరడమే ఈ వ్యూహమని, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా మార్కెట్ వాటాను పెంచడమే తమ లక్ష్యమని చెప్పారు. బాదం మిల్క్ ఉత్పత్తికి ప్రముఖ నటుడు దగ్గుబాటి రానా బ్రాండ్ అంబాసిడర్గా ఉన్నారని, పనీర్ కోసం చెఫ్ తేజతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వివరించారు. అంతేకాదు రెండు తెలుగు రాష్ట్రాల్లో నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నామని, వచ్చే ఏడాదిలోపు 20,000 అవుట్ లెట్ లు లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. గోద్రేజ్ జెర్సీ పనీర్ ప్యాక్ పై క్యూఆర్ కోడ్ ద్వారా వివిధ వంటకాల సమాచారాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు.

## జీఎస్టీ కార్యాలయంలో సిబిఐ అధికారుల సోదాలు



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** సెంట్రల్ జీఎస్టీ మెదక్ రేంజ్ సూపరింటెండెంట్ సీబీఐ ఏసీబీ అధికారులకు చిక్కాడు. హైదరాబాద్ లోని సీబీఐ, ఏసీబీ అధికారి ధనుంజయ్ బృందం శు క్రవారం మెదక్ ఆటో నగర్ లోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జీఎస్టీ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవి రంజాన్ అగర్వాల్ ను అవినీతికి పాల్పడటం తో అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కేంద్ర కార్యాలయం తలుపులు మూసి వేసి విచారణ జరిపారు. డబ్బులు తీసుకుంటూ చిక్కడా అనే విషయాలు అధికారులు వెల్లడించలేదు. బాధితుల వివరాలు కూడా సీబీఐ అధికారులు గోప్యంగా ఉంచారు. ఆరు గంటల విచారణ అనంతరం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో అరెస్టు సమాచారం ఇచ్చి అదుపులోకి తీసుకొని హైదరాబాద్ లోని నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు అధికారులు చెప్పారు. అధికారి కుటుంబీకులకు సైతం సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. ఏ విషయం లో ఏసీబీ కి చిక్కాడు.. బాధితులు ఎవరు అనే పూర్తి సమాచారం మాత్రం చెప్పేందుకు సీబీఐ, ఏసీబీ అధికారులు నిరాకరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22 మార్చి 2025

# తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగించాలి

- అమృత జల్ 2.0 పథకం కింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలి
- పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి
- నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 21 (జనం సాక్షి) :** సంగారెడ్డి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లతో కలిసి పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ లోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో నీటి అవసరాలకు అనుగుణంగా తగినన్ని వాటర్ ట్యాంకులను సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రత్యామ్నాయ నీటి వనరులను ఉపయోగించి పట్టణం , గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించాలని ,జిల్లా లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించడమే కాకుండా, నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అమృత జల్ 2.0 పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో డ్రైవర్స్ కాలనీ లోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ పరిశీలించారు. పట్టణ ప్రజలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా చేసే విధానాన్ని, రాజంపేట ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి వాటర్ క్లీనింగ్ ప్రక్రియ, నీటి నిల్వ వివరాలను అడిగితెలుసుకున్నారు. మిక్సింగ్, క్లోరినేషన్ ప్లాంట్ల నిర్వహణపై సమగ్ర అవగాహన కలిగివుండాలని అన్నారు. సంగారెడ్డి పట్టణంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా, వేసవి కాలంలో పట్టణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరాతో పాటు పట్టణంలోని పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, ఈ ఈ విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ఎస్‌సివికె చవాన్, మునిసిపల్ డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి ఇంతియాజ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణ మోహన్, ఏఈ రఘువీర్, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోతంశెట్టిపల్లి టీజంక్షన్ వద్ద ఈదురు గాలుల బీభత్సం

- విరిగిన కరెంటు స్తంభాలు
- తీవ్ర ఆస్తి నష్టం... కారుపై పడిన విద్యుత్ స్తంభాలు



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి ఏడుపాయల టీ జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసుకున్న హోటల్లు, తినుబండారాల దుకాణాల రేకుల డబ్బాలు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. కరెంటు స్తంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. దుకాణాలు హోటల్లో ముందు పోతంశెట్టిపల్లి వైన్స్ ముందు నిలిపించిన కార్లపై విద్యుత్ స్తంభాలు పడడంతో కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈదురుగాలుల వర్షానికి కొల్చారం మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. టి జంక్షన్ సమీపంలోని ఆర్ఆర్ హోటల్, హర్షిత హోటల్ దుర్గ భవాని హోటల్ సమీపంలో రేకుల షెడ్డులు పూర్తిగా ఈదురుగాళ్లకు ఎగిరిపోయాయి. అకాల వర్షానికి ఈదురుగాళ్ల కారణంగా నష్టపోయిన చిన్న చిన్న వ్యాపారులకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- సిఐటియు మండల నాయకులు జక్కుల ఆశన్న



**వీపనగండ్ల, మార్చి 21 (జనం సాక్షి) :** బిల్డింగ్ నిర్మాణ కార్మికుల సమస్యల పైన పోరాటం చేయడానికి సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న సిఐటియు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీపనగండ్ల మండల సిఐటియు నాయకులు జక్కుల ఆశన్న మాట్లాడుతూ శాంతియుతంగా బిల్డింగ్ కార్మికుల సమస్యల పైన ఉద్యమించడానికి వెళ్తున్న మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. బిల్డింగ్ నిర్మాణ కార్మికులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబంలో చదువుతున్న వారి పిల్లలకు స్కాలర్షిప్ మంజూరు చేయాలని, పెండింగ్ లో ఉన్న 11 లక్షల లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవన కార్మిక డిమాండ్లను అమలు చేయకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మరోసారి లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో వెంకటేష్ గౌడ్, రామన్ గౌడ్, లక్ష్మణ్, బత్తుల రాముడు, దయ్యపు రఘు తదితర కార్యకర్తలు ఉన్నారు.

# భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

- డీఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్యానాయక్ తండాలో భార్యను హత్య చేసిన నిందితుడు భర్తను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని డిఎస్పి నల్లపు లింగయ్య తెలిపారు.శుక్రవారం మధ్యాహ్నం పత్రిక విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి వివరాలు వివరించారు. డిఎస్పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ నారాయణపేట మండల, పరిధిలోని రెద్య నాయక్ తాండలో ఈ నెల 20న జరిగిన హత్యకు సంబంధిం చిన నిందితుడు వినోద్ నాయక్ నిందితుడి మేనమామ కూతురు అయిన శారు రాథోడ్ మిదితండకు చెందిన అమ్మాయితో దాదాపు రెండు నెలల క్రితం పెద్దలు వివాహం చేశారు. కానీ నిందితుడినికి శారు రాథోడ్ తో పెళ్లి ఇష్టం లేదు.తన తల్లి యొక్క అన్న కూతురు కనుక వద్దు అని ఎదురు చెప్పకుండా పెళ్లి చేసుకున్నాడు.అప్పడి నుండి ఇద్దరు దూరంగానే ఉంటున్నారు. కాని నిందితు డినికి వేరే అమ్మయిని పెళ్లి చేసుకోవాలని ఆలోచన మనసులో బలంగా ఉండెను. ఎలాగైనా శారు రాథోడ్ ని అడ్డు తొలగించుకోని వేరే అమ్మయిని పెళ్లిచేసుకోవాలని 19న రాత్రి అందాజ 8 గంటల సమయంలో నిందితుడు తన భార్య శారురాథోడ్ తో ఎలాంటి కారణం లేకుండా గొడవ పెట్టుకొని, ఆమెను కొట్టినాదని వివరించారు. తర్వాత నిందుతుని తల్లిదండ్రులు వచ్చి ఎందుకు గొడవ పెట్టుకొ ని కొడ్డుతున్నావు అని అడుగాగ, నిందితుడు ఇంట్లో నుంచి బయటకి వెళ్ళిపోయాడు. తర్వాత అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో నిందితుడు తిరిగి ఇంటికి వచ్చి, ఎలాగైనా తన భర్యను చంపాలనే ఉద్దేశ్యంతో తన భార్యతో మళ్ళి గొడవ పెట్టుకొని, ముందే వేసుకొన్న పథకం ప్రకారం ఆమె గొంతును తన రెండు చేతులతో గట్టిగ నొక్కగా ఊరిపి ఆడక కొద్ది సేపు తర్వాత ఆమె చనిపా యిందనీ తెలిపారు. ఈ నేరం తన మిధకు రాకుండా ఆమె చనిపొయిన తరవాత చిరెతో వూరివేసుకోన్నట్లు నమ్మించ డానికి ఏదో పురుగుల మందు తాగి మరణించింది అని నమ్మించడానికి ప్రయ త్నం చేశాదని కానీ అది కుదరక పోవడంతో అక్కడి నుండి పారిపోయాడనీ తెలిపారు. నిందితుడు శుక్రవారం నారాయణపేట పట్టణంలో బారంబవి దగ్గర ఉండగా అతని అదుపులోకి తీసుకొని మృతురాలిని చంపడానికి ఉపయోగించిన చీరను స్వాధీనం చేసుకోనీ నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని డిఎస్పి లింగయ్య తెలిపారు.ఈ కేసు ఇన్వెస్టిగేషన్ ఇన్చార్జ్ ఆఫీసర్ మరికల్ సీఐ రాజేందర్ రెడ్డినీ, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లునీ, పోలీస్ సిబ్బందిని డిఎస్పి అభినందించారు.

# బస్సు ప్రమాదంలో డీలర్ మృతి



**పెబ్బేరు, మార్చి 21 (జనం సాక్షి) :** ప్రయాణిస్తున్న బస్సులో నుంచి కింద పడి అదే బస్సు టైరు బాడీ పైకి ఎక్కడంతో వ్యక్తి స్పాట్ డెడ్ అయిన ఘటన శుక్రవారం పెబ్బేరు పట్టణ శివారులోని ఎస్సీ కాలనీ వద్ద జరిగింది. పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మున్సిపాలిటీలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ హనుమంతు వనపర్తికి వెళ్లి కోదాడ డిపోకు చెందిన బస్సులో పెబ్బేరుకు వస్తున్నాడు. పట్టణ శివారులోని ఎస్సీ కాలనీ రాగానే బస్సు దిగేందుకు ఫుట్ స్టే వద్ద నిలబడ్డాడు. ముందర వెళ్తున్న లారీని క్రాస్ చేస్తున్న సమయంలో బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఫుట్ స్టే వద్ద నిలబడిన హనుమంతు ఒక్కసారిగా బస్సు ముందుకు పడటంతో ఆ బస్సు ముందరి టైరు కడుపు భాగం పైకి ఎక్కి కొంత దూరం లాక్కెళ్లింది. దీంతో ఆ వ్యక్తి స్పాట్లోనే చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని డెడ్బాడీని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

# పరీక్షలు బాగా రాయండి



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలోని కొల్చారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పదవ తరగతి పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యార్థులు తొలి రోజంతటి ఉత్సాహంతో మిగిలిన అన్ని పరీక్షలను కూడా సమర్థవంతంగా వ్రాయాలని ఆకాంక్షించారు. అలాగే పరీక్షలు నిర్వహణ నిబంధనలను పకడ్బందీగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. మిగిలిన పరీక్షలు విద్యార్థులు ఏ విధమైన ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో వ్రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, పర్యవేక్షణ, విద్యార్థులకు తాగునీరు, లైటింగ్, ఫర్నిచర్, టాయిలెట్ సదుపాయాల ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు 10402 హాజరు కావాల్సి ఉండగా, 10,373 మంది హాజరయ్యారని, వివిధ కారణాల చేత 29 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాధికార సంస్థ ద్వారా న్యాయ సలహాలు పొందండి

- డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** న్యాయ సాధికార సంస్థ ద్వారా న్యాయ సలహాలు పొంది న్యాయం దక్కించుకోవాలని నారాయణపేట జిల్లా డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి తెలిపారు.శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వింధ్య నాయక్ ఆదేశాల మేరకు చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షతన ఉక్తూర్ మండలం పగిడిమారి , ఓబులాపూర్ గ్రామల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె సురేష్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన పౌరులకు న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా రెండు ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని అవి ఏమనగా ఉచితంగా న్యాయవాదిని నియమించుకునే ఏర్పాటు ఎటువంటి క్రిమినల్ కేసైనా ఎటువంటి ఫీజు చెల్లించ కుండా ఉచితంగా న్యాయ వాదిని నియమించుకుని అట్టి కేసును వాదించుకునే అవ కాశం ప్రస్తుతం మనకు అందు బాటులో ఉందని తెలియజే శారు దానితోపాటు 15100 ఈ నంబరు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ దీనికి ఎప్పు డైనా గానీ ఫోన్ చేసి ఉచితం గా న్యాయ సహాయము గాని న్యాయ సలహాలు గానీ పొందవచ్చని తెలియజేశారు దానితోపాటు వికలాంగులకు ఉపాధి అవకాశాలకు కావల సిన సమాచారం కోసం కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఈ సేవలు వినియోగించుకోగలరని తెలియజేశారు ఈ సమావే శంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కే సురేష్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లా డుతూ ప్రజలకు ఉన్న ప్రాథ మిక హక్కులు ప్రాథమిక విధులు వాటి యొక్క ఆచర ణ విధానాల గురించి తెలియ జేసి వాటిని ఏరకంగా మన ము వాడుకోవచ్చని విషయా ల గురించి తెలియజేశారు ఈ సమావేశంలో పి ఎల్ వీ బాలరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము కొనే ప్రతి ఒక్క వస్తువుకు రసీదు తీసు కోవాలని ఒకవేళ తీసుకున్న వస్తువు సరిగ్గా పని చేయక పోతేవినియోగదారుల సంఘంలో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో ఏఈఓ, పోలీస్ అధికారులు, పిఎల్‌వీలు పాల్గొన్నారు.

# రిలయన్స్ స్మార్ట్ ఐస్‌క్రీమ్‌లో పురుగులు

- నాసిరకం వస్తువులు అమ్ముతున్నారన్న ఆరోపణ
- ప్రశ్నిస్తే కస్టమర్‌పై రిలయన్స్ స్మార్ట్ ఉద్యోగి దౌర్జన్యం



**సదాశివపేట, మార్చి 21 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ లొ ఓ వ్యక్తి ఐస్ క్రీం కొనగా అందులో పురుగులు రావడంతో మేనేజర్ వద్దకు వెళ్లి సదరు వ్యక్తి ప్రశ్నించగా పొరపాటు అయింది మరొకటి తీసుకెళ్లాలని సూచించగా అక్కడే ఉన్న రిలయన్స్ స్మార్ట్ క్యాషియర్ కస్టమర్ ను బూతులు తిడుతూ దౌర్జన్యం చేసిన ఘటన సదాశివపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆత్మకూరు గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి సదాశివపేట పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ లో ఐస్ క్రీమ్ కొని ఓపెన్ చేసి చూడగా ఐస్ క్రీమ్ లో పురుగులు కనిపించడంతో ఇదేమిటి అని మార్ట్ మేనేజర్ ను ప్రశ్నించగా, మేనేజర్ పొరపాటుగా వచ్చిందని , ఇంకోటి తీసుకొని వెళ్లాలని సూచించారు. అంతలోనే అక్కడనే ఉన్న మార్ట్ లో పనిచేసే ఉద్యోగి కలగజేసుకొని కస్టమర్పై దుర్భాషలాడాడు. ఏం చేసుకుంటావో చేసుకో, ఎవరికైనా చెప్పుకో అంటూ వస్తువు కొన్న బిల్లును చింపిపారేసి కస్టమర్ పై దౌర్జన్యం చేస్తూ దాడి చేసి బయటకు నెట్టారని బాధితుడి వాపోయాడు.దీని పై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. ఇది ఇలా ఉండగా రిలయన్స్ స్మార్ట్ షాపులో నాసిరకం వస్తువులు అమ్ముతున్నారని ఆరోపణలు కూడా నిందిస్తున్నాయి.

# పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాలి



**వనపర్తి బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి) :** జిల్లాలో వివిధ శాఖల పరిధిలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులను మార్చి చివరి తేదీ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, ఈడబ్ల్యూ ఐడిసి శాఖల పరిధిలో పెండింగ్లో ఉన్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఈడబ్ల్యూఐడిసి శాఖల పరిధిలో పెండింగ్లో ఉన్న పనులను మార్చి చివరి తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ ఫండ్స్ కింద పంచాయతీ రాజ్ శాఖకు కేటాయించిన 44 పాఠశాలల్లో, ఈడబ్ల్యూఐడీ సిటీ కేటాయించిన 20 అంగన్వాడీ భవనాల్లో, ఆర్ అండ్ బి కి కేటాయించిన నాలుగు అంగన్వాడి భవనాల్లో మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, పంచాయతీరాజ్ శాఖ, ఆర్ అండ్ బి శాఖల పరిధిలో ఎఫ్ డి ఆర్ నిధులతో చేపట్టిన సిసి రోడ్ల పనులు కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేయడమే కాకుండా వాటికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను కూడా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక మన ఊరు మనబడి కి సంబంధించి తుది దశకు చేరుకుని బిల్లులు రాక పెండింగ్లో నిలిచిపోయిన పాఠశాల భవనాలను గుర్తించి వాటిని వేగంగా వాడుకలోకి తెచ్చేలా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, ఆర్అండ్‌బి డిఈ సీతారామస్వామి, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ, ఆయా శాఖల డిఈలు, ఏఈలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలలో నూతన బోధనా పద్ధతులు అవసరం

- అంగన్వాడి టీచర్లు అవలంబిస్తున్న నూతన బోధనా పద్ధతుల పై చర్చ
- సదస్సుకు హాజరైన జిల్లాలోని ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టుల టీచర్లు



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 21 (జనం సాక్షి) :** అంగన్వాడి కేంద్రాలలో నూతన బోధనా పద్ధతులు అవలంబించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ లొ ఐసిడిఎస్, అజీమ్ ప్రేమ్ జి ఫౌండేషన్ల ఆధ్వర్యంలో 9 వ పూర్వ బాల్య సంరక్షణ విద్యపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు, కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిదవ పూర్వ బాల్య సంరక్షణ, విద్య వార్షిక సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టుల నుంచి సుమారు 350 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ టీచర్లు అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతుల పరిశీలనను వాటి ఆధారాలు అనుభవాలను ఇతరులతో పంచుకోవడానికి, ఆయా విషయాలపై చర్చించడానికి అంగన్వాడీ టీచర్లు అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో, గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సదస్సులో చర్చించిన విషయాలు నూతన పాఠ్యప్రణాళిక అమలు చేయడంలో అంగన్వాడి టీచర్లు పాటిస్తున్న ఉత్తమమైన పద్ధతులు వాటి వలన పిల్లల అభివృద్ధిలో కలిగిన మార్పులు ఆధారంగా నూతన సిలబస్ ను, ప్రీస్కూల్ కార్యక్రమాల నిర్వహణలో అంగన్వాడీ టీచర్లు గమనించిన మార్పుల ను ఈ సదస్సులో చర్చించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల మధ్య సమన్వయం కొరకు పాటించిన ఉత్తమ పద్ధతులు దాని ఫలితంగా పూర్వ ప్రాథమిక విద్య నిర్వహణలో, వచ్చిన మార్పులు, ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని అధిగమించడానికి అవలంబించిన పద్ధతులను చర్చించడం జరిగిందన్నారు. 5 ఐసిడిఎస్ ప్రాజెక్టు నుండి టీచర్లు రాసిన వ్యాసాలు నుండి ఎనిమిది మంది టీచర్లు తమ వ్యాస రూప ప్రతిపాదనల పేపర్ ప్రజెంటేషన్ చేశారు.18 మంది టీచర్లు పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు .నలుగురు టీచర్లు చర్చా కార్యక్రమం ద్వారా తాము అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను ఇతర టీచర్లతో పంచుకున్నారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ ఆన్లైన్ ద్వారా వర్చువల్ పద్ధతిలో తమ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమములో ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్జేడి మోతి, జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జిల్లాలోని సి డి పి ఓ లు, సూపర్ వైజర్స్, ఐదు ఐసిడిస్ ప్రాజెక్ట్స్ నుండి అంగన్వాడి టీచర్లు, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సభ్యులు , సిబ్బంది పాల్గొన్నారు.

శనివారం
22 మార్చి 2025
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# 800 కోట్లు కరీంనగర్‌కు కేటాయిస్తే గంగులకు కళ్లు కనిపిస్తలేవా?

**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి)**



బడ్జెట్ లో కరీంనగర్ కు దాదాపు ఎనిమిది వందల కోట్లు కేటాయించినా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కరీంనగర్ కు గుండు సున్నా అని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కు 179 కోట్లు, శాతవాహన యూనివర్సిటీకి 35 కోట్లు, వరంగల్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్ కు 41 కోట్లు, శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ కు 548 కోట్లు కేటాయించడం జరిగిందని మానేర్ రివర్ ఫ్రంట్ కు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాలేదని అందుకే కేటాయించలేదని గంగుల కమలాకర్ కళ్లున్న కబోదిలాగా మాట్లాడుతున్నారని నరేందర్ రెడ్డి విమర్శించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీళ్లిచ్చే విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, గతంలో తాగునీటికి సాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డప్పుడు మేము ధర్నాలు చేసినా పట్టించుకోలేదని కరీంనగర్ లో త్రాగు నీటికి ఇబ్బంది కలిగి పంప్ హౌస్ లో బూస్టర్లకు నీళ్లు అందని పరిస్థితి ఉంటే మున్సిపల్ ముందు ధర్నాలు చేశామని ఆరోజు పట్టించుకోని గంగుల ఇప్పుడు ఆ అవసరం ఏర్పడకున్నా విమర్శించడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. స్మార్ట్ సిటీ పనులలో అవినీతి, కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన నెలకే అప్రోచ్ రోడ్డు కుంగడం, కేబుల్ బ్రిడ్జి కి ఆరు కోట్లతో పెట్టిన డైనమిక్ లైట్లు పనిచేయకపోవడం, సుందరీకరణ పేరుతో కోట్లు ఖర్చు చేయడం ఇవన్నీ మీవల్లే సాధ్యమైందని నరేందర్ రెడ్డి దుయ్యబట్టారు. గతంలో పింకు చొక్కా వాళ్ళకే బిసి బంధు, దళిత బంధు ఇచ్చారని, ఇప్పుడు రాజీవ్ యువ వికాసం ద్వారా అర్హులైన వారందరికీ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రవణ్ నాయక్, కాంరెడ్డి రాంరెడ్డి, స్వామి గౌడ్, దన్న సింగ్, ఆర్ష మల్లేశం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, దండి రవీందర్, కీర్తి కుమార్, తిరుపతి, మామిడి సత్యనారాయణ రెడ్డి, అనిల్ కుమార్, హనీఫ్, సాయిరాం, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ నిధులతోనే కరీంనగర్ పట్టణ ముఖచిత్రం మారింది

**బిజెపి కరీంనగర్ నగర విస్తృత స్థాయి సమావేశంలో నేతల వ్యాఖ్యలు**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి) :**



కేంద్రమిచ్చిన స్మార్ట్ సిటీ హెూదాతో కరీంనగర్ రూపురేఖలు, ముఖచిత్రం మారిపోయిందని, దాదాపు 800 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, కరీంనగర్ ని అభివృద్ధి చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కే దక్కుతుందని బిజెపి నేతలు వ్యాఖ్యానించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్లోని ఎస్బిఎస్ ఫంక్షన్ హాల్ లో కరీంనగర్ పట్టణ నాయకుల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, డి.శంకర్, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, మాజీ డిప్యూటీ మేయర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, కోమల ఆంజనే యులు, బంగారు రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ లు మాట్లాడి, కరీంనగర్ పట్టణ బిజెపి శ్రేణులకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్ ఎలక్షన్లు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కరీంనగర్ పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు , డ్రైనేజీలు , నూతన నిర్మాణా లను స్మార్ట్ సిటీ కింద చెప్పటం జరిగిందని, పదేళ్లుగా కరీంనగర్ లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్రం ఇచ్చిన నిధులతో నేనని, ఈ నిధులను సాధించడం కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసం బిజెపి కట్టుబడి ఉందని ప్రధానంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఇటీవలే కేంద్రమంత్రి కట్టర్ చేతుల మీదుగా అమృత్ పథకం కింద కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ లో 24 గంటల మంచినీటి సదుపాయాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని, త్వరలో కరీంనగర్ పట్టణ వ్యాప్తంగా ప్రజలకు 24 గంటల మంచినీటి సౌకర్యాన్ని అందించడం కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తగిన కృషి చేస్తున్నారన్నారు. ఇన్నేళ్లుగా కరీంనగర్ పట్టణ అభివృద్ధి బిజెపి కంకణం కట్టుకుని పనిచేస్తుంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వం , నేటి ప్రభుత్వం చేతులు ముడుచు కొని కూర్చుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి ఇవ్వలేదని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించడం లేదని , ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ఇది తేటతెల్లమైందని, రోజురోజుకీ కాంగ్రెస్ గ్రాఫ్ దారుణంగా పడిపోతుందన్నారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్ ఓ ఔటెటెడ్ పార్టీగా మారిందని, ప్రజలంతా బిజెపి మోడీ నాయకత్వాన్ని, పాలనను కోరుకుంటున్నారన్నారు. కరీంనగర్లో బిజెపి బలంగా ఉందని, స్థానికంగా కేంద్ర మంత్రి ఉన్నారని , జరగబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్ లో బిజెపి శక్తి చాటి చెప్పడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పై కాషాయ జెండా రెపరెపలాడే లక్ష్యంతో బిజెపి శ్రేణులంతా పనిచేయా లన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, తాజా మాజీ కార్పొరేటర్లు, కరీంనగర్ జోన్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, పోలింగ్ బూత్ బాధ్యులు, పట్టణ ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అన్ని కష్టాలే

**ఎండిన పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

**ఎండిపోయిన పంటలకు ఎకరానికి 20 వేలు చెల్లించాలి**

**స్టేషన్ ఘన్పూర్, మార్చి 21 (జనం సాక్షి)**



: బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న10 సంవత్సరా ల్లో కెసిఆర్ నాయకత్వంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన ప్రాణాలిక లేక దేవాదుల ద్వారా సాగునీరు అందక వరి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా ఎండిపో తున్న స్థానికఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులను పట్టిం చుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్య మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తాటికొండ గ్రామ పరిధిలోని ఎండిపోయిన వరి పంటలను పరిశీలించా రు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు సాగునీరు అందించక కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని అన్నారు. తాటికొండ పరిస ర ప్రాంతాల్లో పొలాలు ఎండిపోయి దిక్కుతోచని స్థితి లో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిం దని అన్నారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజ్ వద్ద ఎప్ప టికీ 7 టీఎంసీల నీళు ఉంటాయని ప్రభుత్వం,ఎమ్మెల్యే కడియం శ్రీహరి సరైన ప్రణాళికతో ఫేస్1, ఫేస్ 2 మోట ర్లు ఆన్ చేస్తే రిజర్వాయర్లతోపాటు, అన్ని చెరువులు నింపుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతుల కోసం ఆలోచించింది లేదని, సాగునీటి కోసం అధికారులతో సమీక్షనిర్వహించింది లేదన్నారు. వల్లపు రాయి చెరువులో నీళ్లు ఉన్నప్పటికీ కడియం అనుచరులు మాత్రమే వాడుకుంటున్నారని, మిగతా వారికి ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్న పంట పొలాలైన ఎండిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేయాలని లేని యెడల పంప్ హౌస్ ముట్టడిస్తామని తెలిపారు. అభివృద్ధి కోస మే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లానని చెప్తున్న కడియం శ్రీహరి తన కూతురు కోసం వెళ్లాడు తప్ప, నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు .ప్రభుత్వం,వ్యవసాయ శాఖ అధికారులచే ప్రత్యేక సర్వే

చేయించి ఎండిపోయిన పంటలకు ఎకరాకు 20 వేలు నష్టపరిహారం చెల్లించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారపాక రవి, ఆకుల కుమార్, మాచర్ల గణేష్ గౌడ్, అక్కెనపల్లి బాలరాజు, తాటికొండ సురేష్ కుమార్, లకావత్ చిరంజీవి, మారేపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, చింత శ్రీనివాస్, పి శ్రీనివాస్, అక్కెనపల్లి వెంకటయ్య, అక్కెనపల్లి సత్యం,గౌరేష్, సంపత్,నారబోయిన శ్రీను, మేకల వెంకటయ్య, మేకల అనిల్,మారపాక ప్రశాంత్, బాలు, జయపాల్, రవీందర్, శ్రీకాంత్, అశోక్, తదిత రులు పాల్గొన్నారు.

# రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా దొండపాటి, కొండపర్తి

**రఘునాథపాలెం (జనంసాక్షి)**




తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు ఎన్నికయ్యారు. ఈ నెల 20న వైరాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. 19 మంది ఆఫీస్ బేరర్లు, 71 మంది జిల్లా కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు లు తిరిగి ఎన్నికయ్యారు. సనాతన కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో జన్మించిన దొండపాటి రమేష్ విద్యార్థి యువజన సంఘాలలో పనిచేశారు. కొణిజర్ల నుండి రికార్డు మెజార్టీతో జెడ్పిటిసిగా ఎన్నికయ్యారు. సిపిఐ జిల్లా కౌన్సిల్గా పనిచేస్తున్న రమేష్ అధ్యక్షునిగా ఎన్నిక కావడం ఇది రెండవసారి. కొండపర్తి గోవిందరావు చింతకాని మండలం రాఘవాపురం గ్రామంలో కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించారు. విద్యార్థి, యువజన సంఘాల్లో పనిచేసిన ఆయన గత పంచాయతీ ఎన్నికల్లో రాఘవాపురం నుంచి ఏకగ్రీవంగా సర్పంచ్గా ఎన్నికయ్యారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా పని చేస్తున్నారు. దొండపాటి రమేష్, గోవిందరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షులుగా ఏపూరి రవీంద్రబాబు, కార్యనిర్వహక అధ్యక్షునిగా కూచిపూడి రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జక్కుల రామారావు, ఉపాధ్యక్షులుగా అమరనేని వీరభద్రం, బానోత్ రాంకోటి, భాస్కర్, శ్రీనివాస్, పాసంగుల చందర్రావు, చావా మురళి, నల్లమోతు నర్సింహారావు లు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా మిడికంటి వెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఏలూరి భాస్కర్, బాగం ప్రసాద్, మందడపు రాణి, బానోత్ రవి, మామిడి సుదర్శన్ రెడ్డి, పి. వెంకటనర్సయ్య, కోశాధికారిగా దొబ్బల వెంగళరావు ఎన్నికయ్యారు.



# నిర్ణీత గడువులోగా వస్త్ర ఉత్పత్తులు పూర్తి చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (జనంసాక్షి)**

: రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం కేటాయించిన ఆర్డర్లను నిర్ణిత సమయంలో వస్త్ర ఉత్పత్తులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆర్డర్ల పురోగతిపై సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సమగ్ర శిక్ష శాఖ, సంక్షేమ శాఖలకు సంబంధించి ప్రభుత్వం వస్త్ర పరిశ్రమకు అందించిన ఆర్డర్ల వస్త్ర ఉత్పత్తిని నిర్ణీత సమయంలో పూర్తిచేసి సప్లై చేయాలని కలెక్టర్ సూచించారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలకు ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి సంబంధిత ఆర్డర్ ను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కేటాయించడం జరిగిందన్నారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద చీరల పంపిణీ కోసం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు వచ్చిన ఆర్డర్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయంలో గడువులోగా ఉత్పత్తి చేసి సప్లై చేయాలన్నారు.ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ అధికారి రాఘవరావు, టెస్కో ప్రతినిధి శంకరయ్య,వస్త్ర పరిశ్రమ వ్యాపారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కళల వైభవాన్ని విశ్లేషించి చెప్పాలి





**సందడిగా అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ (భగత్నగర్) వార్షికోత్సవ వేడుకలు**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :**

విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాలని, వాటి పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ప్రోత్సాహకాలను అందించాలని తద్వారా వారు అందులో పట్టు సాధిస్తారని ప్రముఖ గ్రంధకర్త కెప్టెన్.డా.బి. మధుసుధన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి లతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ మైదానంలో "ఫ్లిక్కర్" పేరుతో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల భగత్నగర్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరై సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి చదువుల తల్లి జ్ఞానసరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... విద్యార్థులకు కళల వైభవాన్ని విశ్లేషించి చెప్పాలని తద్వారా వారికి కళల పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. మన దేశచరిత్ర విభిన్న కళలకు విశిష్టమైనదని గుర్తుచేస్తూ మనదేశంలో ఉన్నటువంటి కళలు సాంప్రదాయాలు మరేదేశంలో అవలంబించరని చెప్పారు. నేడు అల్ఫోర్స్ తెలంగాణ విద్యారంగానికి తలమానికమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని తెలుపుతూ వారి విద్యావిదా నాలు చాలా మార్గదర్శకమని కొనియాడారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అల్ఫోర్స్ గత 35 సం.లుగా తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తు తలమానికంగా నిలుస్తున్నారని ముఖ్యంగా విద్యార్థులందరు ఉత్తమం ఉత్తమంగా స్థిరపడేలా అత్యుత్తమ శిక్షణనందిస్తున్నామని, ఇటీవల కాలంలో ప్రకటించిన ప్రతిష్టాత్మక పరీక్ష అయిన గేట్-2025లో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించిన యస్.హర్షిత్ రెడ్డి. ఆల్ ఇండియా 60 ర్యాంకు సాధించిడం చాలా గొప్ప విషయమని తెలుపుతూ గ్రూప్ 1, 2 , 3 ఫలితాల్లో సైతం చాలా మంది అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం మా విద్య విదానానికి నిదర్శనమని తెలుపుతూ భవిష్యత్తులో సైతం అల్ఫోర్స్ అగ్రగామిగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి గువ్వాగోరింక, మనసా తెలుసా, బుల్లెట్బండి, ఐఆమ్ పర్ఫెక్ట్ - మిస్టర్ పర్ఫెక్ట్, సాహెూ సాహెూ పలు నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా బయెూ మందులు విక్రయం

**వ్యక్తిపై కేసు నమోదు.. రూ. 6 లక్షల బయోమందులు స్వాధీనం**

**ఏటూరునాగారం, మార్చి 21 (జనంసాక్షి)**



నకిలీ విత్తనాలు, అనుమతులు లేకుండా బయో మందులు విక్రయిస్తున్న వారిపై పోలీసు యంత్రాంగం ఉక్కు పాదం మోపే దిశగా చర్యలు చేపట్టింది. కాగా ములుగు జిల్లా ఎస్పీ శబరిష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు ఎస్సై తాజుద్దీన్ గురువారం రోజున పోలీస్, అగ్రికల్చర్ శాఖ అధికారులు సంయుక్తంగా అనుమతులు లేకుండా బయో మందులు నిలువ చేసి ఉంచిన ఒక ఇంటి లో అర్ధ రాత్రి సమయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 6 లక్షల విలువ గల బయోమందులను స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కాగా ఇందుకు సంబంధించిన వివరాలను ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తన కార్యాలయంలో శుక్రవారం రోజున మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కందిచర్ల గ్రామంకు చెందిన రావూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘనపురం కాలనీలోని (ఇంటి నెంబరు.12-364) అనే ఇంటిలో అద్దెకు ఉంటూ ఎలాంటి అనుమతులు లేకుండా బయోమందులు నిల్వచేసి వెంకటాపురం చర్ల ప్రాంతాలలో విక్రయాలు జరుపుతున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు గురువారం రోజు అర్ధ రాత్రి సమయంలో పోలీస్, అగ్రికల్చర్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించి అనుమతులు లేకుండా నిలువ చేసి ఉంచిన 410 లీటర్ల ద్రవపదార్థం, 30 కేజీల ఘనపదార్థం గల బయోమందులను పట్టుకోవడం జరిగిందన్నారు. వెంటనే పంచనామా నిర్వహించి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న బయోమందులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, అలాగే అనుమతులు లేకుండా విక్రయిస్తున్న వ్యక్తిపై శాఖా పరమైన కేసు నమోదు చేయడం జరిగిందని ఏఎస్పీ తెలిపారు. ఈ ఆకస్మిక

దాడులలో అనుమతులు లేకుండా బయోమందులు విక్రయిస్తున్న వ్యక్తి వద్ద నుండి వ్యానును స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన బయో మందుల విలువ 6 లక్షలు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు.

# "రెనే"లో చర్మ, కాస్మొటిక్ వైద్య సేవలు ప్రారంభం

**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి) :**



శుక్రవారం రోజు స్థానిక రెనే హాస్పిటల్లో హైదరాబాద్ కు చెందిన డా. రీతూ రావు చర్మ, కాస్మొటిక్ వైద్య సేవల విభాగాన్ని సీనియర్ ఇన్ఫర్టిలిటీ వైద్యురాలు, రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.బంగారి రజనీ ప్రియదర్శిని ప్రారంభించారు. డా.బంగారి రజనీ ప్రియ దర్శిని మాట్లాడుతూ... నేడు చాలా మంది ఎదుర్కొంటున్న కాస్మొటిక్ , చర్మ సమస్యలకు హైదరాబాద్ కి వెళ్ళాల్సి వస్తుందని, ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ఈ వైద్యాన్ని అందరికీ అందుబాటు లోకి తక్కువ ఖర్చులో అందించే విధంగా సామాన్యునికి కూడా అసమాన వైద్యం అన్న రెనే హాస్పిటల్ ఉద్దేశ్యంలో భాగంగా హైదరాబాద్ కు చెందిన డా.రీతూ రావు వైద్య సేవలు మన రెనే హాస్పిటల్లో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సదవకాశాన్ని ఉమ్మడి తెలంగాణా ప్రజలందరూ వినియోగించుకోవాలని అన్నారు. కాస్మోడర్మటాలజిస్ట్ డా.రీతూ రావు మాట్లాడుతూ... నేడు ఎంతో మంది చిన్న వయసులోనే కాస్మొటిక్ సమస్యలు అంటే జుట్టు రాలిపోవడం, బట్టతల రావడం, పలు రకాల చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని వారు హైదరాబాద్ లాంటి పట్టణాలకు వచ్చి వైద్యం చేయించుకునే సమయం, స్థోమత లేని కారణంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకి చెందిన ఆడబిడ్డగా తను ఇక్కడి ప్రజలకు కాస్మొటిక్ వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ప్రతి నెల నాల్గవ శుక్రవారం స్థానిక రెనే హాస్పిటల్ లో అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా ఫాగ్సీ అధ్యక్షురాలు, సీనియర్ స్త్రీల వైద్య నిపుణురాలు డా.స్వాతీ అనూప్ రావు , ఇండియన్ మెడికల్ అసోసియేన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ జనరల్ సర్జన్ డా.అనూప్ రావు, తెలంగాణా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డా.బి.ఎన్.రావు, రెనే హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్రా చారి, గుండె వైద్య నిపుణులు డా.దినకర్, సీనియర్ ఫీజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, డీన్ డా. మునీష్, డా.కృష్ణా రెడ్డి, డా. లతీశ్ రెడ్డి, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బంధన్ బ్యాంకులో భారీ కుంభకోణం

- ఆరు లక్షల వరకు స్వాహా చేసిన బ్యాంకు మేనేజర్, సిబ్బంది



**దేవరకొండ, మార్చి 21 (జనం సాక్షి) :** దేవరకొండ బంధన్ బ్యాంక్ లో భారీ కుంభకోణం జరిగింది. బ్యాంకు మేనేజర్ హేమంతా షి సిబ్బందితో కలిసి ఘరానా మోసానికి పాల్పడ్డారు. పెద్ద మొత్తంలో నగదు కాజేశారు. బీదవారు, కూలీనాలి చేసి బ్రతికే నిరుపేదలు వారం వారం కట్టే కిస్తులు కాజేసినట్లు తెలుస్తోంది. కోల్కతాలో హెడ్ ఆఫీస్ ఉన్న బంధన్ బ్యాంకు దేవర కొండ శాఖలో మొత్తం 104 గ్రూపులు, 1309 మంది సభ్యులు పొదుపు చేసుకున్నారు. బ్యాంకు నుంచి తమ వ్యక్తిగత అవసరాల కోసం రుణాలు తీసుకొని వారం వారం డబ్బులు చెల్లించేవారు. ఈ క్రమంలో నవంబర్ 23న బంధన్ బ్యాంక్ శాఖలో కొండమల్లేపల్లి చెందిన సాయి తేజ మహిళా సంఘం పేరుతో ఒక్కొక్కరు రూ. 50,000 చొప్పున లోను తీసుకున్నారు. 5000 రూపాయలు ఖర్చులకు పోను 18 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 45 వేల రూపాయలను బ్యాంకు సిబ్బంది.చెల్లించారు. తీసుకున్న డబ్బులకు గాను ఒక్కో సభ్యురాలు వారానికి రూ.1400 చొప్పున 48 వారాలు బ్యాంకు కట్టాల్సి ఉంది. బ్యాంకు నిబంధన ప్రకారం బాధితులు బ్యాంకు రికవరీ ఏజెంట్ అంజికి పూర్తి డబ్బులు చెల్లించారు. తిరిగి తమకు కొత్తలోను ఇవ్వాలని ఆరు నెలలుగా మహిళలు తిరుగుతున్నారు. మహిళలు బ్యాంకుకు వెళ్లి విచారించగా వారి పేర్లపై అప్పు ఉన్నట్లు ప్రస్తుత అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళలు తమ దగ్గర డబ్బులు వసూలు చేసిన అంజిని నిలదీయగా తాను వసూలు చేసిన డబ్బులను బ్యాంకు మేనేజర్ హేమంత షి కి అప్పగించానని అతను డబ్బులు వాడుకున్నారని రికవరీ ఏజెంట్ అంజి తెలిపాడు. అనుమానం వచ్చిన ఏరియా మేనేజర్ నేరుగా రుణం తీసుకున్న వారి వద్ద వెళ్లి విచారణ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రుణ గ్రహీతలు కట్టిన డబ్బులు మేనేజర్ మరియు సిబ్బంది కాజేశారని బయటికి పొక్కడంతో ఆందోళనతో ఖాతాదారులు బ్యాంకు క్యూ కట్టారు. బ్యాంకు సిబ్బంది చేసిన ఘరానా మోసం కారణంగా బంధన్ బ్యాంక్ కి ఖాతాదారులకు బంధాలు తెగిపోయాయని , బంధన్ బ్యాంక్ కి ప్రజలు,ఖాతాదారులు రైతులు నమ్మే పరిస్థితులు లేవని ఖాతాదారులు వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకున్న అధికారులు**

దేవరకొండ శాఖలో అవకతవకలు జరిగాయని గుర్తించిన బ్యాంకు ఉన్నతాధికారులు 20 రోజుల క్రితం బ్యాంకుకు వచ్చి అవకతవకలు జరిగాయని నిర్ధారించి బ్యాంక్ మేనేజర్ హేమంత్ షి, క్యాషియర్ శ్రవణ్, సిబ్బంది రమావత్ పవార్, వంగూరి ఆంజనేయులు, రమావత్ చింటూ లను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. తమకు కొత్తలోనూ ఇవ్వకపోవడంతో పాటు బ్యాంకులో రూ.1,80,000 అప్పు ఉందని బ్యాంకు అధి కారులు చెబుతున్నారని మహిళలు ఆరోపించారు. బ్యాంకులో అవకతవకలు జరిగాయని సిబ్బంది తమకు చెప్పకుండా వారిని సస్పెండ్ చేయడంతో బ్యాంక్ మేనేజర్ హేమంత్ షి కోల్కతాకు పారిపోయాడని మహిళలు చెప్పారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు మేనేజర్ కు తమ సమస్య గురించి చెబితే తాను కొత్తగా వచ్చానని తనకేమీ తెలియదని చెబుతున్నారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేకూరేంతవరకు ఆందోళన చేస్తామని మహిళలు బ్యాంకు ఎదుట బైఠాయించారు.

## బీబీనగర్ తహశీల్దార్ శ్రీధర్ సస్పెండ్



**భువనగిరి కలెక్టరేట్, మార్చ్ 21 (జనం సాక్షి) :** బీబీనగర్ తహసిల్దార్ శ్రీధర్ ను కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేశారు. రెవెన్యూ అధికారులు, తప్పిదాలు చేసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఖాళీ స్థలానికి పాసు పుస్తకం జారీచేసిన విషయమై సస్పెన్షన్ వేటు పడింది. బీబీనగర్ మండలం, పడమటి సోమవారం గ్రామంలో ఖాళీ స్థలానికి పాసు బుక్ జారీ అయ్యాయని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా, పాస్ బుక్ లు జారీచేసిన తహశీల్దార్ శ్రీధర్ ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి చేశారు.

## దోమకొండ, బీబీపేట పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 21 (జనంసాక్షి) :** పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని,పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ ఉండాలని,పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, రిసెప్షన్, రికార్డ్, రైటర్ రూమును పరిశీలించారు ఎస్పీ రాజేష్ చంద్ర.ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ ఆప్స్ మరియు సైబర్ క్రైమ్స్ గురించి, ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,పోలీస్ స్టేషన్ రికార్డులను, సిబ్బంది విధులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లాలోని దోమకొండ, బీబీపేట పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పి సందర్శించడం జరిగింది. పోలీస్ స్టేషన్ లలో పని చేసే సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్, దోమకొండ యస్.హెచ్.ఓ స్రవంతి , బీబీపేట యస్.హెచ్.ఓ ప్రభాకర్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతుల పరిశీలన



**భువనగిరి కలెక్టరేట్, మార్చి 21 (జనం సాక్షి) :** పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించి, విద్యార్థులకు మనో ధైర్యాన్ని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన, పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో నిర్వహణ తీరును పరిశీలించారు. పట్టణం లోని గంజ్ ఉన్నత పాఠశాలలో, అన్ని గదులను కలెక్టర్ కలియ తిరిగి,ఎలక్ట్రిసిటీ, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణం గా పరిశీలించారు. పరీక్ష ల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెండెంట్కి పలు సూచనలు చేశారు. సజావుగా అన్ని పరీక్ష లు జరిగే లా మానటరింగ్ చేయాలన్నారు.

## తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 21 (జనం సాక్షి) :** ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలతో నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తో కలిసి కామారెడ్డి పట్టణం, నియోజకవర్గం లో త్రాగునీటి సమస్య పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ ఏరియాలో అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆయన సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా చేపట్టే పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏరియాలో రోజుకు రెండు సార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కల్లూరులో ప్రైవేటు ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



**కల్లూరు, మార్చి 21 (జనం సాక్షి) :** కల్లూరులోని చైతన్య ప్రైవేట్ హాస్పటల్ ను ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వి నవ్య కాంత్, పలువురు వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు రికార్డులు, ఐసియు రూమ్, వార్డులు,ల్యాబ్ తదితర వాటిని పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందించే సేవలు ,ఫీజుల పట్టికను ప్రదర్శించాలని అర్హత ఉన్న సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ కళావతి భాయ్ హాస్పిటల్ యాజమాన్యానికి సూచించారు. ల్యాబ్ లో అవసరం లేని పరీక్షలు చేయటం, రోగుల వద్ద అధిక ఫీజులు వసూలు వంటి పనులు చేపట్టవద్దన్నారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు అన్నిఅనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి అని, నిభందనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని చైతన్య హాస్పిటల్ నిర్వాహకులు వైద్యులు డాక్టర్ చైతన్యకి సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్, మాస్ మీడియా అధికారి సాంబ శివ రెడ్డి, డిపివో దుర్గ, హెల్త్ సూపర్వైజర్ గుండపనేని రామారావు పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటార్ల దొంగలను పట్టుకున్న పోలీసులు



**శంకరపట్నం, మార్చి 21 (జనంసాక్షి) :** జల్సాలకు అలవాటు పడి కొంతమంది యువకులు డబ్బులు సంపాదించడానికి వ్యవసాయ బావుల వద్ద ఉండే కరెంటు మోటార్స్ ను రాత్రి వేళల్లో ఎవరు లేని సమయాన దొంగతనాలు చెసిన సంఘటన కరీంనగర్ జిల్లా మండలంలో జరిగింది. గత కొన్ని నెలలుగా పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద కరెంటు మోటార్స్ ను దొంగలు ఎత్తుకెళ్తున్నారన్న మేరకు కేశవపట్నం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో నేరస్తులైన ఎండి ఆఫ్రోజ్, బిజిలి శ్రీను, కాంపెల్లి అనిల్ లను చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి మాట్లాడారు. ఇటీవల జరిగిన మోటార్ దొంగతనాల కేసులో నమ్మదగిన సమాచారం మేరకు బిజిలి శ్రీను ఇంటివద్ద తనిఖీ చేయగా ఆరు కరెంటు మోటార్స్ వాటిని అమ్మడానికి తీసుకెళ్తున్న మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఐ పులి వెంకట్, ఎస్సై కొత్తపల్లీ రవి పాల్గొన్నారు.

## 15 రోజుల్లో చెరుకు పెట్టే రైతుల వివరాలు ఇవ్వండి

- అధ్యయనం తర్వాత ఫ్యాక్టరీ ప్రారంభం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**బోధన్, మార్చి 21 (జనంసాక్షి) :** పదిహేను రోజుల్లో చెరుకు పంట పండించే రైతుల వివరాలు ఇవ్వాలని, అధ్యయనం తర్వాత చక్కర ఫ్యాక్టరీ ప్రారంభించడం జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సాలూర మండల పరిషత్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం బీసీ, ఎస్సీ రిజర్వేషన్ అమలు అయినందున విజయోత్సవ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరుకు పంట పండించే రైతుల వివరాలను 15 రోజుల్లో నివేదిక అందించాలని తద్వారా ఫాక్టరీనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే చెరుకు రైతులతో మహారాష్ట్రలోని చెరుకు ఫ్యాక్టరీనీ సందర్శించడం జరిగిందని అలాగే మేలు రకం వంగడాల అభివృద్ధి ద్వారా మెరుగైన ఉత్పత్తి సాధించే దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్లును అమలుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఫలాలను ప్రతీ ఒక్కరూ అనుభవించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. అనంతరం బీసీ, ఎస్సీ తదితర నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగా శంకర్, ఎంపీడీవో లు శ్రీనివాస్, గంగాధర్, ఎంపీఓ మధుకర్, కార్యదర్శి ప్రవీణ్, సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్ధన్, ఇల్తేపు శంకర్, నాగేశ్వర్ రావ్, అల్లె రమేష్, మందర్న రవి, మార్కెట్ కమిటీ ఇన్చార్జి చైర్మన్ చీల శంకర్, నాగురావ్, డీలర్ సాయిలు, నాయిని బలరాం, సాలుర సంఘ అధ్యక్షులు లింబూరు లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దల్లా సురేష్ మాదిగతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

## మూఢనమ్మకాలపై ప్రజలు చైతన్యవంతులు కావాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు




**జమ్మికుంట, మార్చి 21 (జనం సాక్షి) :** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో గత నెల రోజుల నుండి జరుగుతున్న సంఘటనలు (యాదృచ్ఛికంగా జరుగుతున్న మరణాలు) గ్రామంలో చేతబడి, బాణామతి జరుగుతుందని గ్రామానికి కీడు సోకిందని గ్రామ ప్రజలందరూ ఊరు విడిచి గ్రామ పొలిమేర లో ఉదయం నుండి రాత్రి వరకు ఉండడం గ్రామంలో జరుగుతున్న సంఘటనల మీద జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు సారధ్యంలో విలాసాగర్ గ్రామంలో గడప గడపకు చేతబడి బాణామతి వంటి మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఎంపీడీఓ బీమేష్ , జమ్మికుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ వరగంటి రవి, డాక్టర్ రాజేష్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ కార్తీక్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్, ఏ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ రత్న కుమారి, సదానందం, పంచాయితీ కార్యదర్శి విష్ణు, ఏఎన్ఎం లు సౌందర్య, హైమావతి, మనోవికాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచ్చయ్య, ఆశా కార్యకర్తలు మంజుల, రాజమ్మ, రాజేశ్వరి, సువర్ణ, మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి) :** నిరంతర సాధనతో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్, ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని స్విమ్మింగ్ పూల్ ఆధునికరించారు. క్రీడా పాఠశాలలో యోగా కేంద్రం నిర్మించారు. జిమ్నాస్టిక్స్, యోగ, అథ్లెటిక్స్, జూడో వంటి క్రీడల కోసం అవసరమైన పరికరాలను సమకూర్చారు. క్రీడాకారులకు వసతులు, సౌకర్యాలు కల్పించారు. ఆధునికరించిన తర్వాత స్విమ్మింగ్ పూల్, క్రీడా పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రాంతీయ పాఠశాల విద్యార్థుల అథ్లెటిక్స్, యోగ, జూడో, జిమ్నాస్టిక్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# కోరలు చాస్తున్న మైక్రో ఫైనాన్స్..

- రాత్రి 9 తర్వాత కూడా డబ్బులు కట్టమని వేధింపులు
- బూతు మాటలు తిడుతూ..ఇంటి చుట్టు తిరుగుతున్న రికవరీ సిబ్బంది
- నియంత్రణ చర్యలు లేకపోతే మళ్లీ ఆత్మహత్యలు..?




**మర్రిగూడ, మార్చి 21 (జనం సాక్షి) :** కోరలు చాస్తున్న మైక్రో ఫైనాన్స్.. చాప కింద నీరుల మళ్లీ విస్తరిస్తున్న మహమ్మారి... పేర్లు మార్చుకుంటూ కార్పొరేట్ స్థాయిలో మైక్రో ఫైనాన్స్ కొత్త అవతారం ఎత్తింది , రాత్రి 9 తర్వాత కూడా డబ్బులు కట్టమని గ్రామాలలో తిరుగుతూ ప్రజలని భయభ్రాంతులకు గురిచేస్తూ బజార్లో పరువు తీస్తున్న మైక్రో ఫైనాన్స్ సిబ్బంది, నోటికి వచ్చిన బూతులు తిడుతూ మెడ పట్టి మరి బలవంతంగా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్న మైక్రో ఫైనాన్స్ సిబ్బంది, వీరి ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది. నాంపల్లి మండల కేంద్రంలో గల ఎల్ అండ్ టి మైక్రో ఫైనాన్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని నాంపల్లి, మర్రిగూడ మండలంలో గల గ్రామాలలో ఐదు ఆరు మందిని1 గ్రూపులుగా చేసి ఒక్కరికి 48000 చొప్పున రుణాన్ని ఇస్తున్నారు, 3000 రూపాయలను ఇన్సూరెన్స్ తదితర ఖర్చులను తీసుకొని, 45 వేల రూపాయలను అకౌంట్ కు ట్రాన్స్ఫర్ చేస్తున్నారు, ప్రతినెల 2550 రూపాయలను 24 నెలలు కట్టే విధంగా అగ్రిమెంట్ చేసుకుని రుణాన్నిస్తున్నారు, కానీ ఒక్క నెల మీరు డబ్బులు కట్టకుంటే అంతే సంగతులు ఫోన్లోనే బూతు పురాణం మొదలుపెట్టి, బండ బూతులు తిడుతూ రాత్రి వేళలో కూడా ఇంటి చుట్టూ తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ బజార్లలో పరువు తీసి మానసికంగా హింసించి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్న రికవరీ సిబ్బంది, వీళ్ళ ఒత్తిడి భరించలేక పరువు భయంతో ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉన్నందున వీరిపై నియంత్రణ ఎంతైనా అవసరం ఉన్నదని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం



**మర్పల్లి, మార్చి 21 (జనంసాక్షి) :** పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని మర్పల్లి మండల విద్యాధికారి అంజిలయ్య అన్నారు. శుక్రవారం మర్పల్లి మండల పరిధిలోని గుర్రం గట్టు తండాలో ఎగ్జిటి టీచర్గా పని చేస్తున్న సిహెచ్. మొగులయ్య జూనియర్ లెక్చరర్గా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా మొగులయ్యకు వీడ్కోలు సమా వేశాన్ని నిర్వహించి పూల మాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ లోకేశ్వరి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.




## ఇన్సూరెన్స్ ప్రీమియంలపై
# త్వరలో తీపికబురు

**జనంసాక్షి:**దేశంలోని లక్షలాది మంది బీమా పాలసీదారులకు ఉపశమనం కలగనుంది. ఆరోగ్య బీమా, టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై వస్తు సేవల పన్ను జీఎస్టీ త్వరలో తగ్గే అవకాశం ఉంది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్ మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) తన సిఫారసులను సమర్పించడంతో జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం హెల్త్, టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 18% జీఎస్టీ విధిస్తున్నారు. ఇన్సూరెన్స్ అన్నది అత్యవసర సేవగా మారిన నేపథ్యంలో చాలా మంది వినియోగదారులకు జీఎస్టీ భారంగా మారింది. ప్రతిపాదిత తగ్గింపు బీమాను మరింత చౌకగా మార్చి తద్వారా ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే బీమా కవరేజీ తక్కువగా ఉన్న భారతదేశంలో బీమా వ్యాప్తిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. బీమాపై మంత్రుల బృందం (జీవోఎం) ఏప్రిల్ లో సమావేశమై తమ సిఫార్సులను ఖరారు చేయనుంది. తరువాత వాటిని జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం కోసం సమర్పించనుంది. బహుశా ఏప్రిల్ చివరిలో లేదా మే ప్రారంభంలో జరగనున్న తన తదుపరి సమావేశంలో కౌన్సిల్ ఈ విషయాన్ని చర్చించే అవకాశం ఉంది. ఈ నిర్ణయానికి రాష్ట్రాల నుండి విస్తృత మద్దతు లభించింది. బీమా రంగంలో జీఎస్టీ ఉపశమనం ఆవశ్యకతపై రాష్ట్రాల ప్రభుత్వాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. జీఎస్టీ తగ్గింపు వల్ల బీమా ప్రీమియంల మొత్తం తగ్గి తద్వారా నేరుగా పాలసీదారులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ చర్య మరింత మందిని ఆరోగ్య బీమా, టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. వారికి ఆర్థిక భద్రతను, నిశ్చింతను అందిస్తుంది. ఈ ప్రతిపాదనకు సవాళ్లు లేకపోలేదు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్స్ (ఐటీసీ) క్లెయిమ్ చేసుకునే సామర్థ్యంపై జీఎస్టీ మినహాయింపుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని బీమా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఖర్చులు అంతిమంగా వినియోగదారుల మీదే పడతాయి. దీంతో పన్ను తగ్గింపు ఉద్దేశిత ప్రయోజనాలు దెబ్బతినవచ్చు. ఈ అడ్డంకులు ఉన్నప్పటికీ, సగటు భారతీయుడికి బీమాను మరింత అందుబాటులో, చౌకగా చేసే దిశగా ఈ చొరవ ఒక సానుకూల అడుగును సూచిస్తుంది.






# స్టాక్ మార్కెట్‌కు బెస్ట్ వీక్!

## ఈ వారం మొత్తం మంచి లాభాలు..

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ మంచి లాభాలతో ముగిశాయి. బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు ర్యాలీని వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌కు పొడిగించాయి. ఈ ప్రక్రియలో నాలుగేళ్లలో బెస్ట్ వీక్‌ను నమోదు చేశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 77,042 వద్ద గరిష్టానికి చేరుకుంది. చివరికి 557 పాయింట్ల లాభంతో 76,906 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ బెంచ్మార్క్ ఈ వారంలో 3,077 శాతం లేదా 4.17 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ 160 పాయింట్ల లాభంతో 23,350 వద్ద ముగిసింది. నిఫ్టీ ఈ వారం 4.26 శాతం లేదా 953 పాయింట్లు పెరిగింది. 2021 ఫిబ్రవరి 7 తర్వాత ఇది గరిష్ట వారపు లాభం. సెన్సెక్స్ 30 షేర్లలో ఎన్టీపీసీ శుక్రవారం అత్యధికంగా 3.3 శాతం లాభపడింది. అదేసమయంలో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, లార్సెన్ అండ్ టుబ్రో, కోటక్ బ్యాంక్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు కూడాలాభాల్లో ముగిశాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా అత్యధికంగా 1 శాతానికి పైగా పడిపోయింది. టాటా స్టీల్, ఇన్ఫోసిస్, టైటాన్, బజాజ్ ఫిన్సర్వ్ షేర్లు కూడా నష్టాలను చూశాయి. విస్తృత మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1 శాతానికి పైగా, స్మాల్‌క్యాప్ 2 శాతానికి పైగా లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే బీఎస్‌ఈ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. పవర్, హెల్త్ కేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ లు లాభపడ్డాయి. మరోవైపు బీఎస్‌ఈ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 0.8 శాతం, మెటల్ ఇండెక్స్ 0.4 శాతం నష్టపోయాయి.

## మీ కలల సాకారం కోసం చోటి సిప్

### ప్రారంభించిన కోటక్ మ్యూచువల్ ఫండ్

**ముంబై, మార్చి 20 (జనంసాక్షి):**కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (కేఎంఏఎంసీ) / "కోటక్ మ్యూచువల్ ఫండ్") "చోటీ సిప్" సౌకర్యాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ అన్ని అర్హత కలిగిన పథకాలకు చోటీ సిప్ అందుబాటులో ఉంటుంది. సెబీ, ఎఎంఎఫ్ఐ ఇటీవల చోటీ సిప్ (స్మాల్ టికెట్ సిప్)ను ప్రవేశపెట్టాయి. ఇది మరింత మంది భారతీయులను సంపద సృష్టి ప్రయాణంలోకి తీసుకురావడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. కెఎంఎఎంసి మేనేజింగ్ డైరెక్టర్ నీలేష్ షా మాట్లాడుతూ, "భారతదేశ జనాభాలో దాదాపు 5.4 కోట్ల మంది ప్రత్యేక పెట్టుబడిదారులు మాత్రమే మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు – ఇది చొచ్చుకుపోవడానికి భారీ, ఉపయోగించబడని అవకాశాన్ని వదిలివేస్తుంది. భారతీయ పొదుపుదారులను ఆర్థిక స్వేచ్ఛకు దగ్గరగా తీసుకువస్తుంది. కొత్త పెట్టుబడిదారులను తీసుకురావడానికి, వారి మ్యూచువల్ ఫండ్ ప్రయాణాన్ని ప్రారంభించడానికి క్రమబద్ధమైన పెట్టుబడి ప్రణాళికలు (సిప్ లు) ఒక అద్భుతమైన మార్గం. చోటి సిప్ ప్రారంభంతో, ఒక కొత్త పెట్టుబడిదారుడు కనీసం రూ. 250తో వారి సంపద సృష్టి ప్రయాణాన్ని ప్రారంభించవచ్చు. దీనిని మనం 'చోటి రకం – బడా కదం' (స్వల్ప పెట్టుబడి %–% పెద్ద అడుగు) అని పిలవవచ్చు" అని అన్నారు. ఈ చొరవ కొత్త పెట్టుబడిదారులు సిప్ ద్వారా కనిష్ఠంగా రూ. 250తో పెట్టుబడి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. "చోటీ సిప్" (చిన్న సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రవేశ అడ్డంకిని తగ్గించడం ద్వారా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను అనేక మంది వినియోగదారులకు, ముఖ్యంగా మొదటిసారి పెట్టుబడిదారులకు మరింత అందుబాటులోకి తీసుకురావడం. పెట్టుబడిదారుడు ఇదివరకు, పరిశ్రమ స్థాయిలో ఏవైనా మ్యూచువల్ ఫండ్లలో (సిప్ లేదా లంప్సమ్) పెట్టుబడి పెట్టి ఉండకూడదు. పెట్టుబడిదారుడు గ్రోత్ ఆప్షన్‌లో పెట్టుబడి పెట్టాలి. నెలవారీగా కనీసం 60 వాయిదాలకు కట్టుబడి ఉండాలి. వాయిదాల చెల్లింపు ఎన్ఏసీహెచ్ లేదా యూపిఐ ఆటో–పే ద్వారా మాత్రమే చేయాలి. ఈ ప్లాన్ తమకు అనుకూలంగా ఉందో లేదో అనే సందేహం ఉంటే పెట్టుబడిదారులు తమ ఆర్థిక నిపుణులను మరియు పన్ను సలహాదారులను సంప్రదించాలి. కెఎంఎఎంసి ఎటువంటి రాబడి/భవిష్యత్ రాబడికి హామీ ఇవ్వదు లేదా వాగ్దానం చేయదు.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.15 | ₹ 4.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 82,900 | ₹ 90,440 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,14,000

## ఈ మొబైల్ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని ఆదేశాలు

**జనంసాక్షి:**యాక్టివ్‌గాలేని, రీ అసైన్ చేసిన మొబైల్ నంబర్లతో లింక్ అయిన యూపీఐ సేవలు ఏప్రిల్ 1 నుంచి పనిచేయవని నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) తెలిపింది. మోసాలు, అనధికార లావాదేవీలను నిరోధించడానికి ఇలాంటి నంబర్లను డీలింక్ చేయాలని ఎన్‌పీసీఐ బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లను (పీఎస్‌పీ) ఆదేశించింది. ఈమేరకు బ్యాంకులు, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్‌లు తమ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, భద్రతను పెంచడానికి వీలవుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. యూపీఐతో లింక్ చేసి ఇన్‌యాక్టివ్‌గా ఉన్న మొబైల్ నంబర్లతో సెక్యూరిటీ ప్రమాదాలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు వారి నంబర్లను మార్చినప్పుడు లేదా డీయాక్టివేట్ చేసినప్పుడు వారి యూపీఐ ఖాతాలు యాక్టివ్‌లోనే ఉంటాయి. దాంతో వీటిని దుర్వినియోగం చేసేందుకు అవకాశం ఉంది.



## ఆ తీర్పు ముమ్మాటికీ తప్పే!..
### సుప్రీం కోర్టుకు కేంద్ర మంత్రి విజ్ఞప్తి

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు జడ్జి రామ్ మనోహర్ మిశ్రా ఇచ్చిన తీర్పు ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు దారి తీసింది. మహిళలను అభ్యంతకరంగా తాకడం లైంగిక దాడి కిందని రాదంటూ ఓ మైనర్ బాలిక కేసులో ఆయన తీర్పు ఇవ్వడం తెలిసిందే. అయితే తీర్పు సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉన్నాయని అంటున్నారు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణ దేవి. అలహాబాద్ హైకోర్టు తీర్పు సమ్మతం కాదన్న మంత్రి అన్నపూర్ణ.. దానిని పరిశీలించాలని సుప్రీం కోర్టును కోరారు. అలాంటి తీర్పులతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ఆమె వ్యాఖ్యానించారు. 2021 నవంబరులో.. ఉత్తరప్రదేశ్‌లోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన మైనర్ కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగివస్తోంది. అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు లిఫ్ట్ పేరిట ఆ బాలికను తమతో బైక్‌లపై తీసుకొచ్చారు. మార్గమధ్యంలో ఆ యువకులు అమ్మాయిపై అత్యాచారానికి యత్నించారు. ఆమెను అసభ్యంగా తాకుతూ వేధింపులకు గురిచేశారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళ ఛాతీని తాకినంత మాత్రాన.. పైజామా తాడు తెంపినంత మాత్రాన అత్యాచార యత్నం కిందకు రాదంటూ పేర్కొన్నారు. తద్వారా నిందితులు చేసిన

# టెస్లా జోలికొస్తే ఖబడ్దార్..

### శిక్ష తప్పదు..ట్రంప్ హెచ్చరిక..

**సియాటెల్:** అమెరికాలో ప్రముక కుబేరుడు ఎలాన్ మస్క్ యాజమాన్యంలోని టెస్లా విద్యుత్ కార్ల సంస్థకు చెందిన ఆస్తులపై దాడులు క్రమంగా పెరుగు తున్నాయి. ఈ నేపథ్యంలో దాడులు చేసే వారికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. టెస్లాపై దాడులు చేస్తే 20 ఏళ్ల జైలు విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎలాన్ మస్క్ యాజమాన్యంలోని టెస్లా కార్ల సంస్థకు చెందిన ఆస్తులపై దాడులు పెరిగిపోతున్నాయి. అమెరికా, ఇతర దేశాల్లో టెస్లా షోరూమ్‌లు, విద్యుత్ చార్జింగ్ స్టేషన్లతోపాటు కార్లపైనా ఇటీవల దాడులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. టెస్లా కార్లపై దాడికి పాల్పడేవారికి 20 సంవత్సరాలు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అలాగే, దాడులను ప్రోత్సహిస్తున్న వారికి కూడా శిక్ష తప్పదని హెచ్చరిం చారు. టెస్లాపై దాడులకు దిగేవారు నరకాన్ని అనుభవించబోతున్నారని వార్నింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. బిలియనీర్ ఎలాన్ మస్క్‌ను ప్రభుత్వ సామర్థ్య పెంపుదల విభాగం (డోజ్) అధినేతగా ట్రంప్ నియమించినప్పటి నుంచీ టెస్లాపై దాడులు బాగా పెరిగిపోయాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాలన్న మస్క్ సలహా మేరకు ట్రంప్ ప్రభుత్వం ఎందరో ప్రభుత్వోద్యోగులకు ఉద్వాసన పలకడంతోపాటు అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. మస్క్ విధానాలను వ్యతిరేకిస్తున్న వారు.. ఉత్తర అమెరికా, యూరప్‌లలోని ఆయన కార్యాలయాలు, ఫ్యాక్టరీల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. మస్క్‌తో విభేదిస్తున్న పలువురు సెనేటర్లు వారికి మద్దతు పలికారు. తాము టెస్లా కార్లను అమ్మేస్తామని తెలిపారు. మార్చి 6వ తేదీన ఒరెగాన్ పోర్ట్‌లాండ్ సబర్బ్ అయిన టిగార్డ్‌లోని టెస్లా డీలర్‌షిప్‌పై కాల్పులు జరిగాయి. ఈ దాడిలో పలు ఈవీ వాహనాలు ధ్వంసం అయ్యాయి. కొలరాడో లవ్‌ల్యాండ్‌లోని షోరూమ్‌ను ఓ మహిళ ధ్వంసం చేసింది. ఆపై మస్క్ వ్యతిరేక రాతలు రాసి.. బొమ్మలు గీసింది బోస్టన్‌లోని టెస్లా ఛార్జింగ్ స్టేషన్‌కు దుండగుల నిప్పు సియాటెల్‌లో టెస్లా వాహనాలకు మంట పెట్టిన ఆగంతకులు వాషింగ్టన్ లీన్‌వుడ్‌లో టెస్లా సైబర్ ట్రక్కులపై స్వస్తిక్ గుర్తులతో పాటు మస్క్ వ్యతిరేక రాతలు మార్చి 13వ తేదీన.. ఒరెగాన్ టిగార్డ్ షోరూంపై మరోసారి కాల్పులు.. షోరూం ధ్వంసం వారం వ్యవధిలో రెండుసార్లు ఒరెగాన్ షోరూంపై దాడి జరిగింది. దీంతో ఎఫ్‌బీఐ, ఇతర దర్యాప్తు సంస్థల సమన్వయంతో పని చేస్తామని పోలీసులు ప్రకటించారు.




## జాతీయం అంతర్జాతీయం

### పవర్ కట్‌తో లండన్ హీథ్రో ఎయిర్‌పోర్టు మూసివేత



**లండన్:** భారీ అగ్నిప్రమాదంతో పవర్ కట్ చోటు చేసుకోగా హీథ్రో ఎయిర్‌పోర్టు మూతపడింది. రెండు రోజులపాటు విమానాశ్రయంలో రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన అధికారులు..ప్రయాణికులె వరూ ఎయిర్‌పోర్ట్ వైపు రాకూడదని విజ్ఞప్తి జారీ చేశారు. ఎయిర్‌పోర్టుకు విద్యుత్ సరఫరా చేసే ఓ ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం చెలరేగడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. లండన్ బరో ఆఫ్ హిల్లింగ్డన్‌లోని హయేస్‌లో ఉన్న ఓ సబ్‌స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో హీథ్రో ఎయిర్‌పోర్టుతో పాటు సుమారు 16 వేల నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విదుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో కార్యకలాపాలు నిలిచిపోగా.. అధికారులు ఎయిర్‌పోర్టు మూసేశారు. పలు విమానాలు దారి మళ్లగా.. తిరిగి సేవలను పునరుద్ధరించే అంశంపై నిర్వాహకులు స్పష్టమైన ప్రకటన మాత్రం చేయలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పవర్ కట్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోవడంపై జోకులు పేలుస్తున్నారు. మరోవైపు అగ్నిప్రమాదం కారణంగా చెలరేగిన పొగ, ధూళితో బరో ఆఫ్ హిల్లింగ్డన్ ప్రాంతమంతా ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఫైర్ ఇంజన్లను, సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

# సీఎం నితీష్ వింత చేష్టలు..

### ఆయన ఆరోగ్య పరిస్థితిపై అనుమానాలు

**పాట్నా:** బీహార్ సీఎం నితిష్ కుమార్ వివాదంలో చిక్కుకున్నారు. గురువారం పాట్నా లో జరిగిన స్పోర్ట్స్ ఈవెంట్ జరిగింది. ఆ ఈవెంట్‌కు హాజరైనవారందరూ జాతీయ గీతం ఆలాపన చేస్తుంటే సీఎం నితీష్ వింతగా ప్రవర్తించారు. పక్కన ఉన్న వారిని కదిలిస్తూ, వారితో మాట కలుపుతూ, అభివాదం చేస్తూ కనిపించారు. ప్రస్తుతం, ఆ ఘటన వీడియోలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో మన ముఖ్యమంత్రికి ఏమైంది? ఆయన బాగానే ఉన్నారు కదా? బాగుంటే ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారని బీహార్ ప్రజలు ప్రశ్నిస్తుంటే.. నెటిజన్లు మాత్రం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంతకి ఏమైందంటే? మార్చి 20 నుండి 25 వరకు పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సెపక్ తక్రా ప్రపంచ కప్ – 2025 పోటీలు ప్రారంభమయ్యాయి. గురువారం ఈ పోటీల్ని సీఎం నితీష్ కుమార్ ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమంలో ఆయన చేసిన చేష్టలతో ప్రతిపక్షాల నుంచే కాదు,రాష్ట్ర ప్రజల నుంచి విమర్శలు చేయించుకునేలా ప్రవర్తించారు. సెపక్ తక్రా ప్రపంచ కప్ – 2025 ప్రారంభ వేడుకల్లో జాతీయ గీత ఆలాపన కార్యక్రమం జరిగింది. అందరూ జాతీయ గీతం ఆలపిస్తుంటే వేదికపై ఉన్న సీఎం నితీష్ మాత్రం తన పక్కనే జాతీయ గీతం ఆలాపన చేస్తున్న ఐఏఎస్ అధికారి, సీఎం నితీష్‌కుమార్ ప్రిన్సిపల్ సెక్రటరీ దీపక్ కుమార్‌ను కదిలించారు. దీంతో ఐఏఎస్ దీపక్ కుమార్.. నితీష్‌ను వద్దని వారించే ప్రయత్నించారు. బదులుగా ఇక చాలు.. చాలు అని సంజ్ఞలు చేస్తూ కనిపిం చారు. ఈ ఘటనపై ఆర్‌జేడీ నేత,మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఎక్స్ వేదికగా స్పందించారు. సీఎం సార్ మీరు ఒక పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రన్న విషయం మరిచిపోకండి. మానసికంగా, శారీరకంగా స్థిరంగా లేరు. ఈ స్థితిలో ఉండటం రాష్ట్రానికి చాలా ఆందోళన కలిగించే విషయం. ఇలా పదే పదే బీహార్‌ను అవమా నించకండి. దయచేసి జాతీయగీతాన్నైనా గౌరవించండి. మీరు ప్రతిరోజూ యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులను అవమానిస్తారు. కొన్నిసార్లు మహాత్మా గాంధీ అమరవీరుల దినోత్సవం నాడు చప్పట్లు కొడతారు. అమరవీరులను అపహాస్యం చేస్తారు. కొన్నిసార్లు మీరు జాతీయ గీతంపై చప్పట్లు కొడతారు'అని దుయ్యబట్టారు.



## సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు
# శాలరీ డబుల్

**బెంగళూరు:** హనీ ట్రాప్ అంశం ఓవైపు కర్ణాటక అసెంబ్లీని కుదిపేస్తున్న వేళ.. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఈరోజు(శుక్రవారం) ఓ కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. సీఎం, ఎమ్మెల్యేల శాలరీని వంద శాతం హైక్ చేసే బిల్లుకు ఆమోద ముద్ర వేసింది. ఇందుకోసం రూ. 10 కోట్లు అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. తాజా శాలరీ హైక్ బిల్లు ఆమోదంతో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జీతం భారీగా పెరగనుంది. ప్రస్తుతం కర్ణాటక సీఎం జీతం రూ. 75 వేలు ఉండగా, అది ఇప్పుడు రూ. 1 లక్షా యాభై వేలకు చేరనుంది. ఇక మంత్రుల జీతం 108 శాతం హైక్ తో రూ. 60 వేల నుంచి లక్షా పాతికవేలకు చేరింది. ఇక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతం రూ. 40 వేల నుంచి రూ. 80 వేలకు చేరనుంది. ఇక వీరందరికీ వచ్చే పెన్షన్ కూడా పెరగనుంది. రూ. 50 వేల నుంచి రూ. 75 వేలకు వీరికి పెన్షన్ లభించనుంది. దీనిపై కర్ణాటక హోంమంత్రి జీ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. శాలరీ వంద శాతం హైక్ చేయడాన్ని సమర్థించారు. సామాన్యుడు ఎలా ఇబ్బందులు పడతాడో చట్ట సభల్లో ఉన్న తాము కూడా అలానే ఇబ్బందులు పడతామనే విషయం గ్రహించాలన్నారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు పరమేశ్వరన్. ఈరోజు చర్చకు వచ్చిన అంశాలతో పాటు పల్లు బిల్లులకు కర్ణాటక అసెంబ్లీ ఆమోదం తెలిపే క్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారుఆగ్రహంతో స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లిన బీజేపీ సభ్యులు తమ చేతుల్లోని ముస్లిం కోటా బిల్లుప్రతులను చించి స్పీకర్ ముఖంపైకి విసిరి కొట్టారు. దాంతో 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను సస్పెన్షన్ కు గురయ్యారు.



### గ్రామీణ రోడ్లకు టోల్ విధించే ఆలోచన లేదు

కాం ట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వారికి ఆరు నెలలు లేదా మూడు నెలలకు చెల్లిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామని తెలిపారు. భారాస హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కే రోడ్లు వేశారని చెప్పారు. ఆ మూడు చోట్ల రోడ్లకు చివరికి సింగరేణి నిధులు కూడా వాడారని పేర్కొన్నారు. ఛాలెంజ్ చేస్తున్నా.. రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. భారాస హయాంలో ఆర్‌అండ్‌బీ పనుల గురించి లెక్కలు తీద్దామన్నారు. రోడ్ల గురించి ఒకరోజు ప్రత్యేకంగా చర్చిద్దామని చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22 మార్చి 2025

# యూట్యూబ్ ఐడియా ఇచ్చే! లాకర్ తెరిచే..
# లాకర్లో నగలు డబ్బులు మాయం

ఆదిలాబాద్, ప్రతినిధి (జనంసాక్షి)



లాకర్ లో ఉన్న నగలు డబ్బులు దొంగలించటం కోసం యూట్యూబ్ చూసి లాకర్ తెరిచి అందులో ఉన్న నగలు డబ్బులను దొంగలించిన సంఘటనఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ డిఎస్పీ జీవన్ రెడ్డి, టూ టౌన్ సిఐ కరుణాకర్ రావులు కలిసి టూ టౌన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రిక్షా కాలనీలో నివాసం ఉంటున్న ఎరువుల వ్యాపారి జాబు తిరుపతి ఇంట్లో ఆంధ్ర ప్రదేశ్ నెల్లూరు జిల్లా కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన కోట మమత కొన్ని నెలల నుంచి పని మనిషిగా చేరి ఇంటి పనులు చేస్తుంది. ఐతే ఆమె గతంలో హైదరబాద్ లో పని చేసే క్రమంలో వెల్డింగ్ పనులు చేసే రంగా రెడ్డి జిల్లా ఘట్ కేసర్ కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ తో పరిచయం ఏర్పడింది. అతను కొద్ది రోజుల కిందట ఈమెకు ఫోన్ చేసి ఎక్కడ పని చేస్తున్నవంటూ అడగంతో అందుకు ఆమె వివరాలు చెప్పింది. తాను పని మనిషిగా చేస్తున్న ఇంట్లో నెంబర్ల ఆధారంగా తెరుచుకునే ఓ లాకర్ ఉందని అతనికి చెప్పింది. అందుకు బదులుగా అతను యూట్యూబ్లో ఆ లాకర్ ఎలా తెరుస్తుందో దానికి సంబంధించిన విషయం తెలుసుకుని దాన్ని తెరవడానికి నెంబర్లను ఆమెకు చెప్పాడు. దీంతో ఆమె ఆ నెంబర్ల ప్రకారం ఈ నెల 10న లాకార్ తెరిచి అందులో ఉన్న రెండు తులాల బ్రాస్ లెట్, మూడు తులాల బంగారు గొలుసులను దొంగలించి యదావిధిగా లాకర్ ను మూసివేసింది. 17వ తేదీన జాబు తిరుపతి లాకర్ తెరిచి చూడగా అందులో నగలు కనిపించలేదు. వెంటనే ఈ విషయం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. ఇచ్చిన పిర్యాదు ఆధారంగా గురువారం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించిన మమత, సయ్యద్ ఇర్ఫాన్ లను అదుపులోకి తీసుకుని విచారించగ దొంగతనం చేసినట్టు అంగీకరించారు. వారి వద్ద నుంచి రెండు తులాల బ్రాస్ లెట్, 13 గ్రాముల బంగారు గొలుసు 45 వేల రూపాయలను స్వాదీనం చేసుకున్నారు. వెంటనే వారిని రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ఇళ్ళల్లో పనిమనిషిగా పని చేయడానికి ఎవరినైనా నియమించుకుంటే వారి ప్రవర్తన ఇతర విషయాలు పరిశీలించి పనిలో పెట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో కీలకంగా విధులు నిర్వర్తించిన క్రైమ్ పార్టీ పోలీసులు, ఆర్ ఎస్ రమేష్ బబిత రుక్మారెడ్డిలను అభినందించారు.

# మంచిర్యాలలో 2 గంటలు ఆలస్యంగా పరీక్ష

**తెలుగు పేపరుకు బదులు హిందీ తెచ్చిన అధికారులు**

**తప్పిదం సవరించుకునే సరికి రెండు గంటలు ఆలస్యం**

**పరీక్ష నిర్వాహణలో నిర్లక్ష్యం వహించిన సిస్, డిఓల సస్పెండ్**

మంచిర్యాల ప్రతినిధి, మార్చి 21 (జనంసాక్షి)



విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్ష రాయడానికి పరీక్ష కేంద్రానికి వచ్చి తెలుగు పేపర్ కోసం ఎదురుచూస్తున్న సమయానికి ఇన్విజిలేటర్లు తెలుగు క్వశ్చన్ పేపర్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. ఉదయం 9:30 గంటలకు ఇవ్వాల్సిన తెలుగు పేపర్ 11 గంటలైనా ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఏమైందో అని ఆందోళనకు గురయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష పేపర్ కోసం ఎదురు చూస్తున్నప్పటికీ 11 గంటలైన పరీక్ష పేపర్ ఇన్విజిలేటర్లు చేతికి ఇవ్వలేకపోయారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు పరీక్ష నిర్వాహకులు చీఫ్ సూపరింటెంట్, (సీఎస్) డిపార్ట్మెంటల్ ఆఫీసర్ (డిఓ) పోలీస్ స్టేషన్ నుండి పేపర్లను పరీక్షా కేంద్రానికి తరలిస్తారు. పోలీస్ స్టేషన్ నుండి తెలుగు పేపర్ కు బదులు హిందీ పేపర్ తీసుకువచ్చారని తెలిసింది. పోలీసు స్టేషన్ లో పేపర్ ను పూర్తిస్థాయిలో పరిశీలించకుండా తెలుగు పరీక్ష పేపర్ బదులు హిందీ పేపర్ తీసుకురావడంతో ఈ గందరగోళానికి దారితీసింది. పేపర్ పరీక్ష కేంద్రానికి తీసుకువచ్చి పరిశీలించి చూసేసరికి హిందీ పేపర్ కావడంతో జరిగినా తప్పిదాన్ని గుర్తించిన చీఫ్ సూపరిండెంట్, (సీఎస్) డిపార్ట్మెంటల్ ఆఫీసర్ (డిఓ) జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారి, కలెక్టర్ పరీక్ష కేంద్రానికి వచ్చి జరిగిన తప్పిదాన్ని పరిశీలించి వెంటనే పోలీస్ స్టేషన్ వెళ్లి తెలుగు పేపర్ను పరీక్ష కేంద్రానికి తరలించేసరికి రెండు గంటలు ఆలస్యం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష నిర్వహణ విధుల్లో నిర్లక్ష్యం వహించిన చీఫ్ సూపరిండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్ ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. పరీక్షా సమయాన్ని ఆ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులకు రెండు గంటల సమయాన్ని అదనంగా కేటాయించారు. ఉదయం వచ్చిన విద్యార్థులకు పరీక్ష రాయడానికి అదనంగా సమయం కేటాయించడంతో పాటు విద్యార్థులకు బిస్కెట్, తాగునీరు పంపిణీ చేశారు.

# పదో తరగతి పరీక్షలకు 99.8 శాతం హాజరు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (జనంసాక్షి) :



రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలలో 6766 మంది విద్యార్థులకు గాను 6752 మంది విద్యార్థులు పరీక్షకు 99.8 శాతం హాజర య్యారు. జిల్లావ్యాప్తం గా మొదటిరోజు పరీక్షకు 14 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన క్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వేములవాడ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య పాఠశాలలోనీ పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

# అప్పు పుట్టట్లేదని పరువు తీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, (జనంసాక్షి)

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో మంథని ప్రాంతానికి మొండి చేయి చూపించారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పిస్తామని మాట ఇచ్చారని, కానీ బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయలేదన్నారు. ఒకవైపు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి స్వయంగా తమకు అప్పు పుట్టడం లేదని, తమను ఎవరూ నమ్మడం లేదంటూ మాట్లాడిన తీరు రాష్ట్ర పరువు పోయిందని ఆయన అన్నారు. అనంతరం మంథని పట్టణంలోని రాజాగృహా లో మంథని నియోజకవర్గంలోని అన్ని మండల నాయకులతో 23న కరీంనగర్ లో జరిగే భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సమావేశం గురించి నాయకులకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ దిశా నిర్దేశం చేశారు.

# పాదయాత్ర చేసినా..
## మీ దురాగతాలను మరువరు

హైదరాబాద్ (జనంసాక్షి) :



కెటీఆర్ పాదయాత్రను ఎద్దేవా చేసిన ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

ప్రజాభిమానం కోల్పోయి, అధికారానికి దూరమైన బిఆర్ఎస్ పార్టీ మనుగడ కోసం అడుగులు వేస్తోందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ గురువారం సూర్యపేటలో మాట్లాడిన తీరు సరికాదన్నారు. పదేళ్ల టీ ఆర్ ఎస్ అధికార కాలంలో ప్రజల సొమ్ముకు జవాబుదారీతనం లేకుండా వ్యవహరించారనీ, అందుకే ఇటీవల జరిగిన ప్రతి ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభవం ఎదురైందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాతైనా టిఆర్ఎస్ తన స్థాయిని గుర్తిస్తుందని ఆశించామని, అయితే మరింత బరితెగించి వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. కేటీ ఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ కి డబ్బు సంచులు మోస్తున్నారని, ఆయనను బి జె పి కాపాడుతోందని పేర్కొనడం అందు కు నిదర్శనం అన్నారు. కెసిఆర్ లేకపోతే తెలంగాణా లేదనడం కేటీర్ కరడుకట్టిన అహంకారానికి నిదర్శన మని డాక్టర్ నీలిమ విమర్శించారు. పథకం ప్రకారం బిఆర్ఎస్ బీజేపీకి దగ్గరవుతున్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎంఎల్సి ఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రత్యక్షంగా బిజెపికి మద్దతుగా నిలిచిన విషయం ప్రజలు మరచిపో లేదన్నారు. మూడు లక్షల కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ ప్రవేశపెడితే.. అందులోనూ తప్పులు వెతికిన ప్రతిపక్షాలకు విమర్శలు తప్ప ప్రజా సంక్షేమం పట్టడం లేదన్నారు. 15 నెలలుగా ప్రజలకు కనపడని కేసిఆర్ ప్రజా పాలన గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయంలో
# ఆంక్షలు ఎత్తివేయాలి
## డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

హైదరాబాద్ (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు కేంద్ర బిందువైన ఉస్మానియా యూనివర్సిటీలో నిర్భంద ఆంక్షలు ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను ఇచ్చి తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ మా ఏడవ గ్యారంటీ అని ప్రకటించి, నియంతృత్వ పోకడలు ఇక్కడ చెల్లవంటూ నాడు ప్రగతి భవన్ ముందు ముళ్ల కంచెలు తీసినం అని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేడు క్యాంపస్ లో నినాదాలు, పోరాటాలు, ధర్నాలు ఉండకూడదనీ అప్రజాస్వామిక, నియంతృత్వ సర్క్యులర్ ను జారీ చేశారు. ఈ సర్క్యులర్ అప్రజాస్వామ్యం, అనైతికం, తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గత వారం రోజులుగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్ట్ లు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కారించాలే తప్ప విద్యార్థుల గొంతు నొక్కె ప్రయత్నం చేయావద్దన్నారు. ప్రజాపాలన పేరుతో నియంతృత్వం అమలు చేసే సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే వివేక్ ఆదేశాలు..
## రైల్వేగేటు మరమ్మత్తులు నిలిపివేత



రామకృష్ణాపూర్, మార్చి 21 (జనంసాక్షి)

: హైదరాబాదు-న్యూఢిల్లీ రైల్వే ప్రధాన మార్గంలో మరమ్మత్తుల నిమిత్తం రైల్వే అధికారులు క్యాతన్ పల్లి రైల్వే గేటును ఈ నెల 19 నుండి 28 వరకు మూసివేయుటకు ఆదేశించారు. ఈ విషయం తెలుసుకున్న రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ ముఖ్య నాయకులు క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు వార్షిక పరీక్ష సమయంలో కలుగు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి విన్నవించగా, సంబంధిత రైల్వే జనరల్ మేనేజర్ తో మాట్లాడి రైల్వే గేటు యధాతధంగా నడిచే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రైల్వే గేటు పునః ప్రారంభం చేయించినందుకు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టిపిసిసి కార్యదర్శి పిన్నింటి రఘునాథ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్, ముఖ్య నాయకులు గాండ్ల సమ్మయ్య, మహంకాళి శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యేకి ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు

# ఆటోమేటిక్ వెపన్స్‌తో ఫైరింగ్ సాధన జిల్లా ఎస్పీ కిరణ్ కారే

భూపాలపల్లి , మార్చి 21 ( జనం సాక్షి ):



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మామునూరు బెటాలియన్ సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో జయశంకర్ జిల్లాలోని పోలీసు అధికారులు ఈ ఏడాదికి సంబంధించిన ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఈ సాధనలో ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పిస్టల్‌తో, ఎకె 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, వివిధ ఆటోమేటిక్ వెపన్లతో ఫైరింగ్ సాధన చేశారు. పోలీసు అధికారులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఫైరింగ్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని మంచి మెలకువలు నేర్చుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమైనవన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ ఏ సంపత్ రావు, డి.ఎస్.పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్లో
## అకాల వర్షానికి తడిసిన ధాన్యం



చొప్పదండి , మార్చి 21 (జనం సాక్షి):

మండలంలో శుక్ర వారం అకాల వర్షం కురవడంతో చొప్పదండి వ్యవసాయ మార్కెట్లోకి ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను క అమ్ముకొని నాలుగు పైసలు జమ చేసుకుందామనే సరికి అకాల వర్షం కురవడంతో రైతులు కన్నీరు మున్నీరు అయ్యారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యమును వెంట వెంటనే కొనుగోలు చేయడంతో పాటు వర్షానికి తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధర తో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు చొప్పదండి పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో రోడంత జలమయం గా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలో డివైడర్ ఏర్పాటుచేసి పనులు పూర్తి కాకపోవడంతో చిన్నపాటి వర్షపు నీటికే రోడ్ అంతా జలమయంగా అవడంతో ప్రయాణికులు ,ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డివైడర్ పనులు తొందరగా పూర్తి చేయించి ప్రజల, ప్రయాణికుల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.





# ఫికస్ గార్డెన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి

హైదరాబాద్, మార్చి 21 (జనంసాక్షి)



: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 51లో గల ఫికస్ గార్డెన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి యుబిడీ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ జోనల్ కమిషనర్, యు బి డి అడిషనల్ కమిషనర్, హార్టికల్చర్, డిప్యూటీ కమీషనర్లతో కలిసి గార్డెన్ మొత్తం కలియ తిరిగి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సుందరీకరణ పనులను పరిశీలించి గార్డెనింగ్ లో బాగా అనుభవం ఉన్న ఆర్కిటెక్ తో ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దుర్గం చెరువు పై భాగాన ఉన్న నేపథ్యంలో దుర్గం చెరువు వైపు నుండి కూడా ఫార్మేషన్ రోడ్డు కాంపౌండ్ వాల్ తో పాటు గేటు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్ నెంబర్ 47వైపు కూడా గేటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గార్డెన్ లో లైటింగ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి పార్కు అభివృద్ధి చేసిన తర్వాత నిర్వహణకు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కు గాని, వాకర్స్ అసోసియేషన్ కు బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ యుబిడీ సుభద్ర దేవి, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, హార్టికల్చర్ అధికారులు సునంద, చంద్రశేఖర్, ఈఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

పాలకుర్తి, మార్చి 21(జనంసాక్షి) :



వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఆర్డీవో పీడీ వసంత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాది పనికి వచ్చే కూలీలకు తాగునీటి తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనిలో అత్యధికంగా కూలీలకు పని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31 లోపు పీజు రాయితీ పొందాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, ఆర్ డబ్ల్యు ఎస్ ప్రశాంతి, ఎంపీవో రవీందర్, ఏపీవో మంజుల ఉన్నారు.

# ఎంపీ వద్దిరాజుకు రాష్ట్రపతి ముర్ము ఆహ్వానం

ఖమ్మం/ఢిల్లీ (జనంసాక్షి)



: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ,కే.ఆర్.సురేష్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు తదితర ఎంపీలతో కలిసి రాష్ట్రపతి భవన్ లో శుక్రవారం ఉదయం అల్పాహారం తీసుకున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న సందర్భంగా ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభల సభ్యులను ఆహ్వానించి అల్పాహార విందునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర రాజ్యసభలో తన సహచర సభ్యులు సురేష్ రెడ్డి, దామోదర్ రావులతో పాటు రాష్ట్రపతి ముర్మును కలిశారు. అల్పాహారం,తేనీరు తీసుకున్నారు.

# హ్యారీ బ్రూక్ నిషేధం

## ఐపీఎల్‌లో సమర్థించిన మైఖేల్ వాన్



ఐపీఎల్ 2025 మెగా వేలంలో దిల్లీ క్యాపిటల్స్ హ్యారీ బ్రూక్ రూ.6.25 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, అతను అకస్మాత్తుగా టోర్నమెంట్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. వేలంలో ఎంపికైన తర్వాత బ్రూక్ హాజరు కాకపోవడం వరుసగా ఇది రెండో సంవత్సరం. దీంతో బీసీసీఐ అతడు రెండు సీజన్ల పాటు ఐపీఎల్‌లో ఆడకుండా నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ సమర్థించాడు. సరైన కారణం లేకుండా హ్యారీ బ్రూక్ ఐపీఎల్‌కు హాజరు కానందువల్లే భారత క్రికెట్ బోర్డు ఈ చర్య తీసుకుందన్నాడు. ఆటగాళ్లకు నియమ నిబంధనల గురించి తెలిసే ఉంటుంది. ప్లేయర్లు ఆఖరి నిమిషంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే, ఫ్రాంచైజీల ప్రణాళికలు గందరగోళానికి గురవుతాయని వాపోయాడు.

'రూల్స్ ఎవరికైనా ఒకటే హ్యారీ బ్రూక్ వేలంలో పాల్గొనడానికి తన పేరు ఇచ్చాడు. ఇప్పుడేమో సరైన కారణం లేకుండానే ఐపీఎల్లో పాల్గొనకూడదనుకున్నాడు. అతడు గాయానికి కూడా గురికాలేదు. బ్రూక్ ఇంగ్లాండ్లోలో ఉండటానికే మొగ్గు చూపుతున్నాడు. అందుకే ఇక్కడికి రావడం లేదు. భవిష్యత్తులో అతడు వైట్‌బాల్ క్రికెట్లో ఇంగ్లాండ్‌కు కెప్టెన్ అయ్యే అవకాశం ఉంది. అందుకే అతడు తన జట్టుకు ఆడేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఇది ఇంగ్లాండ్ అభిమానులకు ఆనందకరమైన విషయమే. కానీ, అతడు ఆఖరి నిమిషంలో తప్పుకొని ఐపీఎల్ ఫ్రాంచైజీల ప్రణాళికలను గందరగోళానికి గురి చేయడం సరైంది కాదు' అని మైఖేల్ వాన్... క్లబ్ ప్రైరీ ఫైర్ పాడ్కాస్ట్లో అన్నాడు.

## ఐపీఎల్.. ఈ రికార్డు బద్దలవుతుందా?

ఐపీఎల్ అంటే భారీ సిక్సర్లు, కళ్లు చెదిరే క్యాచ్లు, అదిరిపోయే వికెట్లు మాత్రమే కాదు.. అంతకు మించి అనిపించే రికార్డులు కూడా. 17 సీజన్ల ఐపీఎల్లో ఇప్పటివరకు చాలా రికార్డులు నమోద య్యాయి. అలాంటివాటిలో గత కొన్నేళ్లుగా ఎవరూ టచ్ చేయని, సమీప భవిష్యత్తులో అవకాశం లేని రికార్డులు ఓ సిరీస్లో అందించే ప్రయత్నమే ఇది. ఐపీఎల్‌లో రికార్డులు అంటే గుర్తొచ్చే తొలి పేరు విరాట్ కోహ్లి. ఈ సిరీస్ ఆయనతోనే స్టార్ట్ చేస్తున్నాం. ఐపీఎల్ పరుగుల విషయంలో ఇప్పట్లో ఎవరూ దరి చేరలేని ఎత్తులో ఉన్నాడు. విరాట్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 252 మ్యాచ్లు ఆడి 8,004 పరుగులు చేశాడు. ఈ రికార్డును ఇప్పట్లో కొట్టే ప్లేయర్ దరిదాపుల్లో ఎవరైనా ఉన్నారా? కనిపించడం లేదు. టాప్-10 జాబితాలో రెండో స్థానంలో ఉన్న శిఖర్ ధావన్ (6769) దాదాపు ఐపీఎల్‌కి దూరమైనట్లే కాబట్టి అతడికి ఆ అవకాశం లేదు. ఈ అవకాశం ఉన్న మరో వ్యక్తి రోహిత్ శర్మ (6628). అయితే హిట్ మ్యాన్ వరుస సీజన్లలో భారీ పరుగులు చేయాలి. వయసు రీత్యా అతడు ఎక్కువ సీజన్లు కొనసాగే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లి రికార్డును ఇప్పట్లో కొట్టేవాళ్లే లేరు.



## ఉప్పల్ స్టేడియం భారీ బందోబస్త్

**పలు వస్తువులపై నిషేధం విధింపు**

ఐపీఎల్ 2025కు వేళైంది. మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ కేకేఆర్ వర్సెస్ ఆర్సీబీ మధ్య పోరు జరగగా.. రెండో రోజు ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాజయల్స్ మధ్య జరగనుంది. దీంతో హైదరాబాద్ రాచకొండ పోలీసులు.. ఉప్పల్ స్టేడియం మ్యాచ్ కోసం భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందిని మోహరించబోతున్నట్లు తెలిపారు. అలానే ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు. అలానే స్టేడియం ఎంట్రన్స్ దగ్గర స్నిఫర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయనున్నారు. మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.



## ఈసారి కూడా టైటిల్ మాదే

**కేకేఆర్ విజయవకాశాలపై వరుణ్ చక్రవర్తి**

రీసెంట్‌గా ఇంగ్లాండ్ టీ20, వన్డే సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుంగా రాణించిన వరుణ్ చక్రవర్తి.. ఇప్పుడు ఐపీఎల్ సమరానికి సిద్ధమవుతున్నాడు. తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసే అతడు.. కేకేఆర్ తరఫున బరిలోకి దిగబోతున్నాడు. గత సీజన్‌లోనూ కేకేఆర్ విజయంలో కీలకంగా వ్యవహరించిన అతడు.. ఈ సీజన్‌లోనూ కీలకంగా వ్యవహరిస్తాడని అంతా ఆశిస్తున్నారు. ఐపీఎల్ 2025 ఓపెనింగ్ మ్యాచ్ లో కేకేఆర్ వర్సెస్ ఆర్సీబీ తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో వరుణ్.. కేకేఆర్ విజయవకాశాలపై మాట్లాడాడు.

# కొలకత్తాలో భారీ వర్షాలు

- ఐపీఎల్ ఫస్ట్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం
- ఆరెంజ్ అలెర్ట్ ఇష్యూ చేసిన వాతావరణ శాఖ

ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా ఐపీఎల్ 2025 తొలి మ్యాచే జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 22న కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ జరిగబోదని తెలుస్తోంది. గురువారం నుంచి ఆదివారం వరకు భారీ వర్షాలు, పిడుగులతో కూడిన వర్షాలు పడనున్న నేపథ్యంలో శనివారం ఈ మ్యాచ్ జరిగే అవకాశాలు లేవని తెలుస్తోంది. మ్యాచ్ రోజు సాయంత్రం.. దాదాపు 90 శాతం భారీ వర్షం పడే అవకాశ మున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆరెంజ్ అలెర్ట్ ఇష్యూ చేసిన వాతావరణ శాఖ, దాన్ని యెల్లో అలెర్టుకు మార్చనుంది. ఇక ఇరుజట్ల మధ్య కనీసం ఫలితం తేలేంత సమయం కూడా మ్యాచ్ జరిగే అవకాశం లేదని సమాచారం. గత సీజన్‌లో విజేతగా నిలిచిన కోల్ కతా నైట్ రైడర్స్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. సొంతగడ్డ ఈడెన్ గార్డెన్స్ లో జరిగే తొలి మ్యాచే రద్దు కానుడటంపై ఆ జట్టులో కాస్త ఆందోళన నెలకొంది. అయితే ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్ కావడంతో అందరి దృష్టి ఈ మ్యాచ్ పైనే నెలకొంది. ఇప్పటికే ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు చేశారు. సింగర్ శ్రేయా ఘోషల్, నటి దిశా పటానీ, పాట, ఆటలతో అభిమానులను ఉర్రుతలూగించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే వాతావర ణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ ఏర్పాట్లపై నీలి నీడలు కమ్ముకు న్నాయి. ఇక మెగాటోర్నీలో మూడో టైటిల్ సాధించిన కోల్ కతా .. సొంతగడ్డపై శనివారం జరిగే మ్యాచ్‌లో శుభారంభం చేయాలని భావించి ంది. అయితే వరుణుడు మాత్రం మ్యాచ్ కు అడ్డింకిగా మారే అవకాశముం దని తెలుస్తోంది. మరోవైపు మూడుసార్లు రన్నరప్ ఆర్సీబీ కూడా ఈ మ్యాచ్ పై ఆశలు పెట్టుకుంది. తొలి మ్యాచ్ లో గెలిచి సత్తా చాటాలని ప్రణాళికలు రచిస్తోంది. అయితే తాజాగా రద్దు మాట వినిపస్తుండటంతో ఆ జట్టులోనూ గుబులు నెలకొంది. ఇక ఐపీఎల్లో కోల్ కతాకు కలిసి రావడం లేదు. తొలి మ్యాచ్ కు వరణుడి గండం ఉండటంతో వచ్చేనెల 6న జరిగే మ్యాచ్ కు వేరే స్టేట్ కు షిఫ్ట్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో కోల్‌కతా ఈ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే ఏప్రిల్ 6న శ్రీరామ నవమి ఉండటంతో మ్యాచ్ నిర్వహణ భద్రతా ఏర్పాట్లు తమ వల్ల కావని బెంగాల్ పోలీసులు చేతులెత్తేశారు. దీనిపై సమీక్షించిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీ.. మ్యాచ్ ను అసోం లోని గువాహటికి తరలించే అవకాశమున్నట్లు పేర్కొన్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో మ్యాచ్‌ను రీ షెడ్యూల్ చేసే అవకాశం లేదని, అందుచేత మ్యాచ్ ను తరలించనున్నట్లు తెలిపారు. నవమి రోజున బెంగాల్లో దాదాపు 20వేలకు పైగా ఊరేగింపులు జరుగుతాయని, ముందస్తుగా బీజేపీ నాయకుడు సువేందు అధికారి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ రోజు మ్యాచ్ భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. గతేడాది కూడా ఇలాంటి సమస్యే ఎదురైతే మ్యాచ్ రీ షెడ్యూల్ చేశారు. కానీ ఈసారి మ్యాచ్ ను షిఫ్ట్ చేయడానికే మొగ్గు చూపుతున్నారు.



## వివేక్ అడుగుజాడల్లో తనయ వంశీ!

చెన్నూరు ఎమ్మెల్యే మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి కి ప్రజలు అంటే ప్రాణం! ప్రజల కోసమే ఆయన ప్రజా రంగంలోకి వచ్చారు. మాజీ కేంద్రమంత్రి కాంగ్రెస్ పార్టీ దిగ్గజం కాక గడ్డం వెంకటస్వామి అడుగుజాడల్లో వివేక్ వెంకటస్వామి కొనసాగుతున్నారు. అవినీతి, అక్రమాలు అనేవి ఆయన దరికి రావు.



రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని దేశంలోనే ముఖ్యులయిన దళిత నాయకు ల్లో దేశం గర్వపడే విధంగా ఎదిగి వచ్చిన నాయకుడు దివంగత కాకా జీ వెంకట స్వామి! తండ్రి వివేక్‌కి ప్రజల సేవ చేయడంలో ఎంతైతే ఆరాటం ఉంటుందో అంత ఆరాటం పెద్దపల్లి నుంచి ఎంపీగా ఎంపికైన గడ్డం వంశీకి కూడా చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనకు పార్లమెంట్లో సమస్యలను చర్చించడానికి వచ్చిన ఏ ఒక్క అవకా శాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వా న్ని వంశీ పార్లమెంటులో అటు బయట నిలదీస్తున్నారు. సింగరేణి కార్మికుల పెన్ష న్ను పెంచాలని నూతన బొగ్గు బ్లాకులను కేటాయించాలని ,ఇలా చాలా సమస్యలను నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై కూడా అవగాహన కలిగి ఉన్న ఎంపీ పని విధానం నియోజకవర్గంలోని ప్రజలకు నచ్చేస్తుంది. పార్ల మెంటు బయట కూడా ఎల్ఐసి ఉద్యోగులు ఆందోళన నిర్వహిస్తే వారితో కలిసి కూర్చున్నాడు వారికి మద్దతు తెలిపాడు. వారి కోసం ప్రభు త్వాన్ని డిమాండ్ చేశాడు, ప్రశ్నించాడు! ప్రశ్నించే గుణం తాతా, తండ్రి నుంచి సంక్రమించిందని భావించవచ్చు! పేద బడుగు దళిత మైనారిటీ ఆదివాసి వెనుకబడిన తరగతులు వర్గాల ప్రజల ప్రతినిధిగా వంశీ పార్లమెంట్లో ప్రతి సమస్యను ఎత్తిచూపు తున్నారు. పరిష్కారం కోసం డిమాండ్ చేస్తున్నారు. మంత్రులను కూడా కలిసి తన నియోజకవర్గంలో రైళ్ల విషయమైనప్పటికీ ఏర్పోర్ట్ కు సంబంధించిన విషయమైనా ఏ విషయాన్ని కూడా ఆయన విస్మరించడం లేదు రోడ్డు రవాణాకు సంబంధించిన కొన్ని సమస్యలపై అవగాహనతో మంత్రులను కలిసి వినతి పత్రాలను అందజేయడం జరుగుతుంది. తోటి ఎంపీలతో కలిసి దేశవ్యాప్త సమస్యలపై కూడా ఆయన కేంద్రాన్ని నిలదీసే స్థాయికి ఎదిగాడని పేర్కొనవచ్చు! పెద్దపల్లి పార్ల మెంట్లో వంశీని ఎంపీగా గెలిపించి చాలా మంచి పని చేశామనే అభిప్రాయం ఓటర్లలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇంతే కాదు సమయం దొరికినప్పుడల్లా ప్రతి తన పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటిస్తూ ప్రజల్ని , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కలవడం, వారి సాధక బాధల్లో పాలు పంచుకోవడం, పరామర్శలు సమావేశాలలో మాట్లాడటం వారికి నేనున్నాననే భరోసా ఇవ్వడం చూస్తుంటే జేసే బాప్ వైసా బేటేసాబ్! అనక తప్పదు! ఆల్ ది బెస్ట్ ఎంపీ వంశీ గడ్డం! కీప్ ఇట్ అప్!





ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,







# బెట్టింగ్ వద్దు బ్రో

## నేటి నుండి ఐపీఎల్ ప్రారంభం

- పట్టణం నుంచి పల్లెల వరకూ జూదమే
- ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : గద్వాల డిఎస్పీ, మొగులయ్య



**రాజోలి, మార్చి 21 (జనంసాక్షి) :** నేటి నుండి ఐపీఎల్ సీజన్ మొదలై మే 25వ తేదీ వరకు కొనసాగునున్నాయి. ఈ ఐపీఎల్ రాకతో యువత జీవితాల్లో కొంపలు ముంచుతోంది. గత నెల క్రిందట జరిగిన ప్రపంచ కప్ ఛాంపియన్లో బెట్టింగ్ మోజులో పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వందల్లో మొదలు పెట్టి రూ.వేలు, లక్షల దాకా పందెం కాస్తున్నారు. డబ్బులు పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోతున్నారు. జూదం ద్వారా బాగుపడినవారు లేరని తెలిసినా ఊబిలోకి దిగుతున్నారు. గతంలో ప్రతి ప్రాంతంలోనూ పెద్ద మొత్తంలో బెట్టింగ్‌కు పాల్పడేవారు. కానీ ఇటీవల రూటు మార్చారు. గుట్టుగానే క్రికెట్ బెట్టింగ్ నడుపుతున్నా రు. పట్టణాల నుంచి మారుమూల గ్రామాల వరకు బెట్టింగ్ విస్తరించిం ది. ఫోర్, సిక్స్, ఔట్, ఏ బంతికి ఎన్ని పరుగులు చేస్తారు..? ఏ ఓవర్‌కు ఎన్ని రన్స్ వస్తాయి...? ఏ టీం గెలుస్తుంది? ఏ బ్యాట్స్‌మెన ఎన్ని రన్స్ చేస్తాడు..? ఏ బౌలర్ ఎన్ని వికెట్లు తీస్తాడు..? ఇలా మొదటి బంతి నుంచి 20 ఓవర్ల వరకూ, మ్యాచ్ ముగిసే వరకూ బెట్టింగ్ జరుగుతూనే ఉంటుంది.

**ఆన్లైన్ యాప్‌లో బెట్టింగ్..**

బెట్టింగ్‌లోనూ కాలం మారిందంటున్నారు యువకులు. అప్పట్లోలా 'ఇదిగో ఈ రూ.5వేలు ఉంచుకో.. పలానా టీమ్ వైపు బెట్ వేయి' అని ఎవరినో బతిమాలాడాల్సిన పనిలేదు. ఆన్లైన్ పుణ్యమా అని ఎన్నో యాప్స్, ఆనలైన గేమ్స్ అందుబాటులో ఉన్నాయి. అందులోనూ బెట్టింగ్ యాప్లో రూ.వేల వరకూ బెట్ వేసే అవకాశం ఉంది. దీంతో యువత యాప్స్ వైపు మొగ్గుచూపుతోంది. ఇళ్లల్లో ఇచ్చే పాకెట్ మనీతో పాటు స్పెషల్ కోర్సులు, ఇతర ఖర్చులని చెప్పి ఆ డబ్బంతా బెట్టింగ్‌కే తగలేస్తున్నారు.

**పోగొట్టుకున్న డబ్బుల కోసం అప్పులు**

బెట్టింగ్ ఉచ్చులో యువకులు చిక్కుకుంటున్నారు. ఒకప్పుడు బెట్టింగ్ అతికొద్దిమందికి మాత్రమే సంబంధించిన వ్యవహారంగా మాత్రమే ఉండే ది. ప్రస్తుతం ఈ ఉచ్చులో చిక్కుకోని వాళ్లంటూ లేరంటే అతిశ యోక్తి కాదేమో. ఈ బెట్టింగ్ జాఢ్యం గ్రామాలకు కూడా పాకేసింది. మ్యాచ్ ప్రారంభం కావడానికి ముందు నుంచే కుర్రాళు ..గ్రూపులుగా ఏర్పడి తమకు నచ్చిన టీమ్‌పై బెట్టింగ్ కాస్తున్నారు. బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బును ఎలాగైనా తిరిగి గెలుచుకోవాలన్న ఉద్దేశంతో...కొత్త అప్పుల కోసం వెతకడం మొదలు పెడుతున్నారు.

**బెట్టింగ్ జోలికి వద్దు**

వంద, వెయ్యితో ప్రారంభమయ్యే బెట్టింగ్ తర్వాత వేలల్లోకి వెళ్తుంది. అందుకోసం చేసిన అప్పులు తీర్చలేక కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. జూదం వల్ల బాగుపడిన వాళ్లు ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించుకోవాలని, క్రికెట్ మ్యాచ్‌లను ఆనందం కోసం మాత్రమే వీక్షించాలి తప్ప..జూదం కోసం కాదని పలువురు సూచిస్తున్నారు. ఈ ఐపీఎల్ సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా వుండాలని, యువత వీలైనంత వరకు ఇంట్లోనే వుండేలా చూడాలని చెబుతున్నారు. బెట్టింగ్ నిర్వాహకులపై పోలీసులు గట్టిగా దృష్టి పెట్టాలని పట్టణ, పల్లె వాసులు కోరుతున్నారు.

**క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు**

ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహించినా, బెట్టింగ్‌లకు పాల్పడినా, ఆడినా చర్యలు తప్పవు. సులభ సంపాదన కోసం యువత, విద్యార్థులు వీటిబారిన పడి మోసపోవద్దు. బెట్టింగ్ మోజులో పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. జిల్లాలో ఈ తరహా వ్యవహారాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఆన్లైన్ బెట్టింగ్ మాటున ప్రమాదకర మాల్వేర్ ఉంటుందని, ఈ నకిలీ లింకులతో వ్యక్తిగత సమాచారం సైబర్ మోసగాళ్లకు చేరే అవకాశం ఉంది. క్రికెట్ అభిమానులు ఆటను ఆస్వాదించాలే తప్ప, డబ్బు సంపాదించాలనే అత్యాశతో బెట్టింగ్‌కు పాల్పడొద్దు. క్రికెట్ బెట్టింగ్ జరిగితే కేసులు ఎదుర్కొంటూ జైలు పాలుకావల్సి వస్తుంది. అంతేకాకుండా జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉంది. బెట్టింగ్‌లను పూర్తిగా అరికట్టాలంటే యువకులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిని సారించాలి. ఎక్కడైనా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 100కి డయల్ చేసి సమాచారం అందించాలి. వినోదం కొరకు ఆడే ఆటను వినోదముగానే చూడాలి, అంతే కాని ఇలాంటి వాటిలో ఇరుక్కొని యువత జీవితాలను నాశనం చేసుకోకండి.

## పరీక్షల నిబంధనలకు తూట్లు

- ఇష్టరీతిగా వ్యవహరిస్తున్న విద్యాధికారులు
- జిల్లా కానీ జిల్లా నుండి డ్యూటీలు
- ఇది రంగారెడ్డి జిల్లా విద్యాధికారుల పనితీరు

**రంగారెడ్డి (జనంసాక్షి ) :** పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచే విధంగా ఇష్టరీతిగా వ్యవహరిస్తున్నారు క్రింది స్థాయి విద్యాధికారులు ఏకంగా జిల్లా కానీ జిల్లా నుండి డ్యూటీలు వేస్తూ పదో తరగతి పరీక్షల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ మండల కేంద్రంలోనీ ఓ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నుండి ఓ ఉపాధ్యాయుడిని నియమించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా పరిధి దాటి పదోతరగతి పరీక్షల్లో విధులు నిర్వహించేందుకు డ్యూటీ వెయ్యరాదనే నిబంధనలు ఉన్న కొందరు ఏ లబ్ధి కోసం డ్యూటీలు వేయించుకున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయ సంఘాల నేతలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు...

**రిలీవ్ చేశాం ..**

**ఆమనగల్ ఎంఈఓ పాండు..**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రాంతం నుండి రంగారెడ్డి జిల్లా ఆమనగల్ ప్రభుత్వ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించిన మాట వాస్తవమేనని అయితే అతన్ని సాయంత్రం లోపు వీధుల్లో నుండి రిలీవ్ చేశామని తెలిపారు..

## అకాల వర్షాలకు 200 విద్యుత్ స్తంభాల ధ్వంసం

**యుద్ధ ప్రాతిపదికన పనులు : విద్యుత్ ఎస్ ఈ శంకర్**



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి ):** మెదక్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షాల కు మెదక్, కొల్చారం,నర్సాపూర్, వెల్దుర్తి మండలాల్లో 200 విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు విద్యుత్ ఎస్‌ఈ శంకర్ తెలిపారు. తమ సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి యుద్ధ ప్రాతిపదికన మరమత్తు పనులు చేపట్టి కరెంటు సమస్యను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడికి సన్మానం

**రాజేంద్రనగర్,(జనంసాక్షి)** నూతనంగా బీజేపి రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఎన్నిక కావడంతో మర్యాదపూర్వకంగా కలిసిన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొండే మహేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బండ నరేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డిలు కలిసి ఘనంగా సత్కరించారు.

## తాగడానికి డబ్బులు ఇవ్వలేదని..


# భార్యను గొడ్డలితో నరికిన భర్త



**షాద్ నగర్ మార్చి 21 (జనంసాక్షి) :** మద్యం తాగడానికి డబ్బులివ్వలేదనే కారణంతో కట్టుకున్న బార్యనే కడతేర్చాడు. మద్యానికి బానిసై భార్యను చంపితే కాని వడ్డీ డబ్బులు తనకు చెందవని బావించిన వ్యక్తి దారుణంగా గొడ్డలితో తన భార్య గొంతు నరికి హత్యచేసి పరారైన ఘటన శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలంలో చోటుచేసుకుంది. పట్టణ సిఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఫరూఖ్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన చిన్నయ్యల పరుశరాములు అలియాస్ చిట్టయ్య మద్యానికి బానిసయ్యాడు ఆస్తి పంపకాల్లో తనకు వచ్చిన భూమిని అమ్మి ఇద్దరి కూతుళ్ల వివాహం చేసిన తరువాత మిగిలిన రు. 2లక్షల యాభై వేల ను పరుశరాములు భార్య జమున ఇతరులకు వడ్డీకి అప్పుగా ఇచ్చింది. తాగుడుకు బానిసైన పరశరాములు డబ్బు ఇవ్వాలని పలు మార్లు భార్యపై వత్తిడి తెచ్చినా ఆమె ఇవ్వకపోవడంతో ఆమెను చంపితే తనకే ఆ డబ్బు చెందుతుందని భావించాడు. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి తన భార్య జమున (33) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పరుశరాములు పక్కనే ఉన్న గొడ్డలిని తీసుకోని భార్య గొంతు నరికి వేశాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా అరుపులు బయటకు వినిపించాల్ను. దీంతో సమీప ఇంటిలో ఉన్న గ్రామస్థుడైన చీమల మల్లేష్ అక్కడికి వేల్లగా అతన్ని చూసిన పరుశరాములు పారిపోయాడు. విషయం ఏమయి ఉంటుందా అని ఇంటిలోపలికి వెల్లి చూడగా అప్పటికే జమున రక్తపుమడుగులో చనిపోయి పడివుంది. వెంటనే విషయాన్ని గ్రామస్థులకు తెలిపిన మల్లేష్ గ్రామస్తుల సహాయంతో షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని జమున మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించిన పోలీసులు నిందితున్ని ఇరవై నాలుగు గంటల లోపు పట్టుకుని రిమాండ్ కు తరలించారు. శంషాబాద్ డిసిపి బి.రాజేశ్ పర్యవేక్షణలో అడిషనల్ డిసిపి రామ్ కుమార్. ఏసిపి ఎన్ హెచ్ రంగస్వామి ఆద్వర్యంలో సీఐ విజయ్ కుమార్ సేతృత్వంలో ఎస్ఐ శరత్ కుమార్ , కానిస్టేబుల్లు నరేందర్, కనకరాజు, రాజేశ్ తదితరులు ఉన్నారు..

# భూసేకరణ ప్రక్రియలో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** నారాయణ పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ మరింత వేగం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబ ర్‌లో కలెక్టర్ రెవెన్యూ, నీటి పారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉట్కూర్ మండలంలోని దంతెన్‌పల్లి గ్రామంలో భూసేకరణ కు నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. అలాగే కోస్గి పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులపై కలెక్టర్ చర్చించారు. 22 మంది వేసిన రిట్ పిటిషన్ల పై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని కోర్టు ఆదేశాల మేరకు పిటిషనర్ల కు పరిష్కారం చూపాలని కలెక్టర్ తెలిపారు. నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ పనులు, కోస్గి రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలం, ఆర్డీఓ రామచంద్ర నాయక్, ఆర్ అండ్ బీ డీఈ రాములు, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నాగ రాజు, తదితరులున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 22 మార్చి 2025

# అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

- ప్రధాన రహదారిపై రాస్తారోకో
- బహుళ జాతి మొక్కజొన్న సాగు చేసి అప్పుల భారం
- మృతుని కుటుంబానికి నష్ట పరిహారం ఇస్తానన్న ఆర్గనైజర్
- రైతుల గోడు పట్టించుకోని అధికారులు





నూగూర్ వెంకటాపురం మార్చి 21(జనం సాక్షి): బహుళ జాతి మొక్కజొన్న హైటెక్ విత్తనం వేసి అప్పుల భారంతో ఆదివాసీ యువ రైతు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా,వెంకటాపురం మండలం,చిరుతపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనతో చిరుతపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారంగా,లేకం మధు అనే వ్యక్తి(26),తండ్రి వెంకన్న వెంకటాపురం గ్రామానికి చెందిన,హైటెక్ బహుళ జాతి కంపెనీ చెందిన ఆర్గనైజర్ మన్యం రాజాబాబు హైటెక్ మొక్కజొన్న సాగుచెయ్యమని,ఎకరాకు 4 నుండి 5 టన్నుల దిగుబడి వచ్చి అధిక లాభాలు వస్తాయని,మాయమాటలు చెప్పగా దీన్ని నమ్మివ్యవసాయం చేసి పంట నష్టం రావడం తో పురుగు మందు త్రాగి మృతి చెందాడు. లేకం మధు అనే రైతు రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని,అదే భూమిలో హైటెక్ అనే బహుళ జాతి విత్తన ఉత్పత్తి చేయగా,ఎకరానికి ఒకటన్ను చొప్పున రెండు టన్నులు రాగా ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టడంతో ఆ రైతు అప్పుల భారంతో ఏం చేయాలో తెలియని స్థితిలో గుర్తుతెలియని క్రిమి సంహారకం మందు తాగాడు. కుటుంబ సభ్యులుగమనించి ఏరియా ఆసుపత్రి తరలించారు, అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో ములుగు ఆసుపత్రి కి తరలించారు. అక్కడ పరిస్థితి పూర్తి విషమంగా మారడంతో వరంగల్ ఎం జీ ఎం ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 5గంటలకు మృతి చెందాడు. దీనితో అతని కుటుంబ తీవ్ర దిగ్భ్రాంధానికి గురయ్యారు. వారి ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం స్పందించి ఆర్గనైజర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని లేఖం మధు మృత దేహం తో ప్రధాన రహదారి పై రాస్తా రోకో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనితో ప్రధాన రహదారి పై ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసు కున్న పోలీస్ శాఖ అధికారులు సిఐ బండారి కుమార్, ఎస్సై కె తిరుపతి రావు, పోలీస్ సిబ్బంది, సీఆర్పీఫ్ సిబ్బంది తో ప్రజలకు, ఎవరి ఏ హాని జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. హైటెక్ బహుళ జాతి మొక్క జొన్న కంపెనీ ఆర్గనైజర్ వచ్చి నష్టం పరిహారం ఇస్తానని అనడం తో రాస్తా రోకో విరమింపజేశారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, గ్రామ ప్రజలు, ఆదివాసీ రైతులు, పాల్గొన్నారు.

# రోడ్లపై హరీష్ రావు గొప్పలు

- బిఆర్ఎస్ హయాంలో గ్రామాలకు పెద్ద ఎత్తున రోడ్లు
- వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక పిల్లను ఇవ్వడం లేదన్న స్పీకర్
- దిమ్మతిరిగి షాక్‌కు గురైన హరీష్ రావు
- గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకే రోడ్లు వేశారన్న కోమటిరెడ్డి



హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) : వికారాబాద్ జిల్లాలో రోడ్లు లేక, గ్రామాల్లో పిల్లలు ఇవ్వలేని దస్థితి ఉందని స్పీకర్ ప్రసాదరావు ముక్తసరిగా చేసిన వ్యాఖ్య..బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్ల గురించి మాట్లాడిన హరీష్ రావుకు షాక్ తగిలినట్లు అయ్యింది. బడ్జెట్ చర్చలో హరీష్ రావు మాట్లాడుతూ..బిఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామానికి, మండలానికి రోడ్డుల వేశామని అన్నారు. తమ ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు అధికంగా ఖర్చుచేసిందని అన్నారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీటుగా జవాబిచ్చారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దపేట తప్ప రాష్ట్రంలో ఎక్కడా రోడ్లు వేయలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో వేసినవే తప్ప పదేళ్లలో ఎక్కడా లేవన్నారు. అలాగే ఈ మూడు నియోజకవర్గాల కోసం అన్ని నిధులను వాడారని దుయ్యబట్టారు. ఇదే సందర్భంలో స్పీకర్ ప్రసాదరావు జోక్యం చేసుకుని..వికారబాద్ జిల్లాలో రోడ్లులేక పిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదని ముక్తసరిగా అన్నారు. ఈంతో హరీష్ రావుకు దిమ్మతిరిగినంత పనయ్యింది. రోడ్లపై మరోరోజు చర్చకు సిద్దమని చెప్పి తప్పించుకున్నారు. అంతకుముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని తెలిపారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వారికి ఆరు నెలలు లేదా మూడు నెలలకు చెల్లిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామని తెలిపారు. భారాస హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కే రోడ్లు వేశారని చెప్పారు. ఆ మూడు చోట్ల రోడ్లకు చివరికి సింగరేణి నిధులు కూడా వాడారని పేర్కొన్నారు. ఛాలెంజ్ చేస్తున్నా.. రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. భారాస హయాంలో ఆర్‌అండ్‌బీ పనుల గురించి లెక్కలు తీద్దామన్నారు. రోడ్ల గురించి ఒకరోజు ప్రత్యేకంగా చర్చిద్దామని హరీష్ చెప్పారు.

# కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



హైదరాబాద్, మార్చి 21 (జనంసాక్షి) : బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సన్నాహక సమావేశాలు, కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో బి.ఆర్.ఎస్ అధినేత , తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని మాజీ మంత్రి , సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి ), గ్యాదరి కిషోర్ కుమార్ (తుంగతుర్తి ), గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి (ఆలేరు ) శుక్రవారం ఎర్రవెల్లి లోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ , వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై పార్టీ అధినేత నాలుగు నియోజక వర్గాల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిగతా ఎనిమిది నియోజకవర్గాల ముఖ్యనాయకులతో సమావేశం ఉంటుందని పార్టీ అధినేత కేసీఆర్ తెలిపారు.

## ఉప్పల్ స్టేడియంలో రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణ



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 14 అడుగల కాంస్య విగ్రహం ఏఐసీసీ మాజీ కార్యదర్శి వి.హనుమంతరావు ఆధ్వర్యంలో తెలంగాణ ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, హెచ్ సీఏ అధ్యక్షులు జగన్మోహన్ రావు, హెచ్ సీఏ కార్యదర్శి జయరాజు పాల్గొన్నారు. హెచ్ సీఏ కార్యదర్శి జె.శ్రీనివాస్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి, టిపిసిసి కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

# మన్యంలో పేలిన ప్రెసర్ బాంబు



నూగూర్ వెంకటాపురం మార్చి 21(జనం సాక్షి): ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని వీరభద్రవరం గ్రామ సమీపంలో ముత్యం ధార సమీపంలోని మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి ఇప్పగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి అనే యువకుడి రెండు కాళ్ళు నుజ్జు నుజ్జు అయ్యాయి. అడవికి వెదురు బొంగుల కోసం నలుగురు వ్యక్తులు వెళ్లడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. వెదురు బొంగులను తీసుకొని తిరిగి వస్తుండగా ఘటన చోటు చేసుకుంది. వెళ్లి వస్తున్న నలుగురు వ్యక్తుల్ల బొగ్గుల కృష్ణమూర్తి అనే యువకుడు మావోలు అమర్చిన మందు పాత్ర మీద కాలు వేయడంతో తన రెండు కాళ్లు నుజ్జు అయ్యాయితనతో వెళ్లిన వ్యక్తులు తెలిపారు.క్షత గాత్రుని వైద్యం కోసం వెంకటాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం ములుగు తరలించారు.


# సింగరేణి సీఎండీని కలిసిన జనక్‌ప్రసాద్



హైదరాబాద్, మార్చి 21 (జనంసాక్షి) : ఇల్లందు జీకే ఓసీ, కొత్తగూడెం జేకే ఓసీకి సంబంధించిన అనుమతుల ఆలస్యాన్ని వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ సింగరేణి సంస్థ సీఎండీ బలరాం నాయక్ కలిసి కోరారు. బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల కేటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని, రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత పనులను వేగవంతం చేయాలని కోరారు. అదేవిధంగా జైపూర్‌లో 800 మెగావాట్ల అదనపు విద్యుత్ ప్లాంట్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర కోల్ సెక్రటరీతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలియజేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన సింగరేణి సీఎండీ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ సింగరేణి జనరల్ సెక్రటరీ శ్రీ వికాస్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం

- సిబిఐని ప్రతివాదిగా చేర్చాలని సునీత వినతి
- కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్



హైదరాబాద్, మార్చి 21 (జనంసాక్షి) : మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఈ కేసు సీబీఐ కోర్టులో విచారణలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నా.. పురోగతి ఏమీ లేదని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి ఈ హత్య చోటు-చేసుకుందని.. సీబీఐ అధికారులు విచారణ చేపట్టి ఇప్పటికే రెండు ఛార్జిషీట్‌లు దాఖలు చేశారన్నారు. ఇంకా సీబీఐ కోర్టులోనే విచారణ కొనసాగు తోందని.. దీన్ని ఆరు నెలల్లోగా ముగించేలా కోర్టును ఆదేశించాలని హైకోర్టును కోరారు. సీబీఐ అధికారులు ఇప్పటికే కొన్ని పత్రాలకు సంబంధించి హార్డ్ డిస్క్‌లో ప్రతివాదుల తరఫు న్యాయవాదులకు ఇచ్చారనీ.. అయితే, హార్డ్‌డిస్క్‌లో ఉన్న కాపీలు ఓపెన్ కావడంలేదు గనక నేరుగా ప్రింటింగ్ ప్రతులు కావాలని వారు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే, లక్షల సంఖ్యలో పేజీలు ఉండటంతో ప్రింటింగ్‌కాపీలు ఇవ్వడం కుదరదు గనక హార్డ్ డిస్క్‌లను ఓపెన్ చేయాలని సీబీఐ అధికారులు చెబుతుండటంతో.. దాదాపు 15 నెలలుగా విచారణ ముందుకు సాగడంలేదని సునీత న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు- తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు- ఈ కేసులో నిందితులందరికీ నోటీ-సులు వ్యక్తిగతంగా నోటీ-సులు ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# దామెర చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, మార్చి 21 (జనం సాక్షి): పరకాల పట్టణంలోని దామెర చెరువు ను మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో టి యు ఎఫ్ ఐ డి సి, మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ను పరిశీలించారు. దామెర చెరువు ప్రాంతాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్వయంగా బైక్ నడుపుతూ దామెర చెరువు కట్ట, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దామెర చెరువు ప్రాంతాన్ని మినీ ట్యాంక్ బండగా త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. మినీ ట్యాంక్ బండ్ కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దామర బండ్ ప్రాంగణంలో గ్రీనరీ, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్,ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్పోర్ట్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ను అమలు చేయబోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. కన్సల్టెన్సీ ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి డిపిఆర్ ను తయారు చేశామని, దానికి అనుగుణంగా పనులను చేపడుతున్నామని అన్నారు. వర్షా కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు చేపడుతున్నా మన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతాన్ని స్పోర్ట్స్ స్టేడియం లా మార్చుతామని అన్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని అధికారులకు తెలియజేశారు. ఈ స్పోర్ట్స్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, ఫుట్ బాల్,స్విమ్మింగ్ పూల్, తదితర వాటిని ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.

# సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల తరలింపునకు యత్నం

- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది




వరంగల్ ఎంజీఎం, మార్చి 21(జనంసాక్షి): వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం రంగశాయిపేటలో నడుస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాల తరలింపుకు అధికారులు యత్నం చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నడుస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాల 2021లో పెంబర్తి నుంచి వరంగల్ కు తీసుకొనివచ్చారు. ఎన్నో ఉద్యమాలు నిర్వహించి వరంగల్ కు తీసుకువస్తే కొందరు అధికారుల తీరు విస్మయానికి గురిచేస్తుంది. సుమారుగా 400 మంది విద్యార్థులు, 45 మంది అధ్యాపకులు, 20 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది, 10 మంది హాస్టల్ నిర్వాహకులతో నడుస్తున్న కళాశాలనే అర్ధాంతరంగా తరలించడం పై పలు అనుమానాలకు తావిస్తున్నది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అధ్యాపకులకు సౌకర్యంగా నగర నడిబొడ్డున అన్ని సౌకర్యాలతో అందరికీ అందుబాటులో ఉన్న భవనంలో కళాశాల నడుస్తుంటే కొందరు అధికారులు తరలింపు పని వారికి సంబంధించింది కాకపోయినా పనిగట్టుకుని ప్రభుత్వానికి కుంటి సాకులు చూపిస్తూ తరలింపు కోసం ప్రయత్నాలు చేస్తున్న తీరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు కలుగజేసుకొని తరలింపును ఆపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు.

# ఆయుష్ భవనం నర్సింగ్ కళాశాలకు కేటాయించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి , మార్చి 21 (జనం సాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయంలో వైద్య, నర్సింగ్, ఆయుష్, సీహెచ్‌సీ, టీజీఎంఎస్ఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్ భవనంలోని రెండు అంతస్థులను నర్సింగ్ కళాశాల నిర్వహణకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి అవసరమైన సిబ్బందిని సర్దుబాటు చేసి, కళాశాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. తాత్కాలికంగా భవనం వినియోగం గురించి కమిషనర్ తో మాట్లాడతానని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి డా మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశం, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, ఆయుష్ ఇంచార్జ్ తనూజా రాణి, టిజిఎంఎస్ఐడిసి డీఈ రాందేవ్, ఏఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్ కేసు కొట్టేయండి: శ్యామల

హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) : బెట్టింగ్ యాప్‌ల కేసులో యాంకర్ శ్యామల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెట్టింగ్ యాప్ కేసులో తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను క్వాష్ చేయాలని పిటిషన్ వేశారు. దీనిపై కోర్టులో విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో శ్యామలపై కేసు నమోదైన విషయం తెలిసిందే. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో టీ-వీ యాంకర్ విష్ణుప్రియ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ రీతూచౌదరిలను పంజాగుట్ట పోలీసులు నిన్న సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370